ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

23-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 142 పేజీలు: 10+4 వెల: 6.50

ఖమేనీ వారసులుగా ముగ్గురు మతపెద్దలు!
14 కోట్లు దాటిన బిజెపి సభ్యత్వాలు
5లో



# అమెరికా మెరుపు దాడితో ఇరాన్ ఉక్కిరి బిక్కిరి

- 3 కీలక అణుశుద్ధి స్థావరాలు ధ్వంసం
- నతాంజ్, ఫోర్డో స్థావరాలు భస్మీపటలం
- దూసుకొచ్చిన 125 అమెరికా యుద్ధవిమానాలు
- 14 బంకర్ బస్టర్ బాంబులతో దాడి
- రహస్య బంకర్‌లో దాగిన మతపెద్ద ఖమేనీ
- హార్ముజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్
- అంతు చూస్తామని ట్రంప్ హెచ్చరిక
- అమెరికా దాడులను ఖండించిన చైనా
- యుఎన్‌కు ఫిర్యాదుచేసిన ఇరాక్





**వాషింగ్టన్,జూన్ 22:** పశ్చిమాసియా మొత్తం యుద్ధమోడుతోంది. మధ్యప్రాచ్యంలోని ఉద్రిక్తతలు పశ్చిమాసియాలోని రెండుదేశాలమధ్య చావోరేవో అన్నట్లుగా మారిపోయాయి. ఇప్పటివరకూ అమెరికాకు వ్యతిరేకంగా నిలిచిన ఇరాన్ దేశం ఇపుడు ఏకాకిగా పోరాటంచేస్తోంది. అణు ఒప్పందంచేసుకోవాలని లేనిపక్షంలో అణు స్థావరాలన్నింటినీ ధ్వంసంచేస్తామన్న హెచ్చరికల నేపథ్యంలో గత పదిరోజులనుంచి ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు తోడు ఇపుడు అమెరికా చేసిన ఆకస్మిక మెరుపు దాడులు ఇరాన్‌లోని కీలక అణు >>2

## చమురు రవాణాకు కీలకం హార్ముజ్ జలసంధి

### మూసివేతకు ఇరాన్ పార్లమెంట్ ఓకే

**టెహ్రాన్,జూన్ 22:** పశ్చిమాసియా దేశం ఇరాన్‌పై అటు అమెరికా, ఇటు ఇజ్రాయెల్‌లు ఏకబిగిన దాడులుచేసి అణుస్థావరాలను ధ్వంసంచేస్తుండగా ఇరాన్‌కూడా తక్కువేమీ తినలేదు. దాడులకు ధీటుగా స్పందిస్తూనే ప్రపంచ చమురు జలరవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రపంచదేశాల చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హార్ముజ్ జలసంధిని మూసివేసేందుకు ఇరాన్‌పార్లమెంటు ఆమోదం తెలిపింది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకోడంతోపాటు ప్రపంచ >>2



## ప్రజలను మరోసారి ఏకం చేసిన యోగా

### గిన్నిస్ రికార్డు సాధించిన ఎపి ప్రజలకు అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ

**విజమవాడ, జూన్22, ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖ వేదికగా జరిగిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించింది. దీనిపై ప్రధానమంత్రి మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. యోగా ప్రజలను మరోసారి ఏకం చేసిందని ప్రధానిఅన్నారు. యోగాను తమ జీవితంలో భాగంచేసుకోవాలనే ఉద్యమాన్ని బలోపేతం చేసినందుకు ఎపి ప్రజలను ఆయన అభినందించారు. విశాఖలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమం చాలా మందిని ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రేరేపిస్తుందని మోడీ పేర్కొన్నారు. యోగా అనేది మానవతను పెంచే సామూహిక ప్రక్రియ అని తెలిపారు.
అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి ప్రపంచ గుర్తింపు తెచ్చినందుకు అభినందనలు తెలిపారు. గత పదేళ్లలో కోట్ల మంది జీవితాల్లో యోగా వెలుగులు నింపిందన్నారు. గ్రామగ్రామాల్లో యువకులు యోగాను అనుసరిస్తున్నారని చెప్పారు. యోగాకు హద్దులు లేవని, యోగాకు వయస్సుతో పనిలేదని మోదీ పేర్కొన్నారు. ప్రకృతిలో మనిషి భాగస్వామి అని యోగా గుర్తు చేస్తుందని ప్రధాని మోడీ అన్నారు. యోగాతో వ్యక్తిగత క్రమశిక్షణ అలవడుతుందన్న ప్రధాని, యోగా ద్వారా నేను అన్న భావన మనంగా మారుతుందని చెప్పారు. మనం అన్న భావన మానవత్వాన్ని పెంచుతుందని, ప్రపంచంలో అశాంతి, అస్థిరత పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రకృతి సౌందర్యానికి, ప్రగతికి విశాఖపట్నం చిరునామా అని, చంద్రబాబు, పవన్ యోగాంధ్ర నిర్వహణకు చొరవ చూపారని కొనియాడారు. నారా లోకేశ్ కూడా యోగాంధ్ర కార్యక్రమం కోసం కృషి చేశారని అన్నారు. నెలన్నర రోజుల్లో యోగాంధ్రను విజయవంతం చేయడంలో లోకేశ్ పాత్ర కీలకమైందన్న మోడీ తన ట్వీట్‌లోను పేర్కొన్నారు. యోగా వల్ల శాంతి, స్థిరత్వం సాధించవచ్చని, అంతర్గత శాంతి ప్రపంచ విధానంకావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి >>2

## 27న కృష్ణాబోర్డు సమావేశం

**విజయవాడ జూన్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం ఈ నెల 27న ఏర్పాటు చేసింది. వర్చువల్‌గా జరిగే ఈ సమావేశానికి హాజరు కావాలంటూ తెలంగాణ, ఎపి రాష్ట్రాలకు బోర్డు సభ్యకార్యదర్శి డిఎం రాయిపురే సమాచారం అందించారు. రాష్ట్రాల నుంచి బోర్డులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు రాష్ట్రాలు 25 శాతం ఇన్సెంటీవ్‌లు ఇవ్వడాన్ని కేంద్రం గతంలో నిలిపివేసింది. దీంతోపాటు అప్పటివరకు చెల్లించిన మొత్తాన్ని కూడా రికవరీకి ఆదేశించింది. దీనిపై ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రికవరీ నిర్ణయాన్ని మాత్రం నిలువరిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఈ నిర్ణయంపై చర్చించి బోర్డు ఆమోదం తెలియజేయాల్సి ఉన్నట్లు సమాచారం.

## సజ్జలపై క్రిమినల్ కేసు




**విజయవాడ, జూన్22,ప్రభాత వార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామ కృష్ణా రెడ్డిపై అమరా వతి మహిళలపై దూషణ అంశంలో క్రిమినల్ కేసు నమోదైంది. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో రాజధాని దళిత జేఏసీ నేత కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసురిజిస్టర్ చేశారు. జర్నలిస్ట్ కృష్ణంరాజు రాజధాని మహిళలపై చేసిన అభ్యంతరకరమైన >>2

## గోదావరి వివాదాలపై కొత్త ట్రిబ్యునల్!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్22:** గోదావరి నదీ జలాల వివాదాలపై కేంద్ర ప్రభుత్వం కొత్త ట్రిబ్యునల్ వేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గోదావరి జలాల పరివాహక ప్రాంతాల పరిధిలోని రాష్ట్రాల మధ్య జలాల వినియోగ వివాదాలు పెరుగుతున్న నేపథ్యంలో కొత్త ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేంద్ర జలమంత్రిత్వ శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సంబంధిత అధికారు >>2

# యోగాతో మహాద్భుతం సాధించాం

- విశాఖలో జరిగిన 11వ యోగా దినోత్సవాన్ని ప్రపంచ రికార్డుగా గుర్తించిన గిన్నిస్ బుక్
- వేడుకలో 3 లక్షల మంది పైగా పాల్గొన్నారు..
- ప్రపంచ వ్యాప్తంగా 12 లక్షల చోట్ల యోగా ప్రదర్శనలు జరిగాయి: సిఎం చంద్రబాబు



**విజయువాడ,జూన్22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలో మహా అద్బుతాన్ని ఎపి ప్రజలందరి సమిష్టి కృషితో సాధించామని రాష్ట్ర ముఖ్యమంత్రి బాబునాయుడు అన్నారు. ఒక సంకల్పంతో. ప్రజలందరి మద్దతుతో విశాఖలో నిన్న నిర్వహించిన యోగా డేకు రెండు ప్రపంచ రికార్డులను లభించాయన్నారు.గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అధికారికంగా తన బ్లాగ్‌లోను,సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో 3 లక్షల 105 మంది పాల్గొని సరికొత్త రికార్డ్ సృష్టించారంటూ గిన్నీస్ వరల్డ్ రికార్డ్ ప్రశంసలు కురిపించింది. గిన్నీస్ వరల్డ్ రికార్డ్ పోస్ట్‌పై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా ఆదివారం పోస్టు చేసారు.
గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లలో విశాఖ యోగాకు స్థానం దక్కడం ప్రతి ఒక్క ఆంధ్రుడికి గర్వకారణమని అన్నారు. మీరందరు చూపించిన అంకితభావం అందరిలో స్ఫూర్తిని నింపింది. ఒక మంచి పని కోసం అందరం కలిసి పనిచేస్తే ఇటువంటి ఫలితాలు సాధించవచ్చని నిరూపించాం.. అందరికీ అభినందనలు అంటూ సీఎం చంద్రబాబు సోషల్ మీడియాలో పేర్కొన్నారు.
సాగరతీరంలో యోగా చేయాలనుకున్న చోటుకు 3,03,654 మంది క్యూఆర్ కోడ్‌తో వచ్చారని వెల్లడించారు. యోగాతో ఉపయోగం ఉందని భావించడం వల్లే ప్రజల నుంచి ఇంత స్పందన లభించిందని అన్నారు. ఈ నెల21న ఒక్కరోజే ప్రపంచ వ్యాప్తంగా 12 లక్షల చోట్ల 10 కోట్ల మంది ప్రజలు యోగాలో భాగస్వాములయ్యారన్నారు. యోగా దినోత్సవ విజయవంతానికి మంత్రులు, అధికారులు బాగా పనిచేశారన్నారు. టెక్నాలజీని ఉపయోగించి కంట్రోల్ రూమ్‌ల ద్వారా నిత్యం పర్యవేక్షించారు.
22,122 మంది గిరిజన విద్యార్థులు 108 నిమిషాల పాటు సామూహిక సూర్య నమస్కారాలు చేసి రికార్డు సాధించారని, వారందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 26 థీమ్ ఆధారిత యోగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. వంద పర్యాటక ప్రాంతాల్లో యోగా చేయాలని లక్ష్యం పెట్టుకుని 101 చోట్ల నిర్వహించామన్నారు. సూరత్‌లో 1.47 లక్షల మందితో యోగా చేసి గిన్నిస్ రికార్డ్ సాధిస్తే నేడు ఒకేవేదికపై మూడు లక్షల మంది పైచిలుకుతో యోగా చేసి రికార్డును తిరగరాశామన్నారు. రాష్ట్రంలో 2.17 కోట్ల మంది ప్రజలు యోగాడేలో పాల్గొన్నారన్నారు. యోగాను ప్రమోట్ చేసేందుకు ఐదు లక్షల చొప్పున టీ షర్టులు, మ్యాట్లు కేంద్రం పంపించిందన్నారు. యోగాను ప్రోత్సహించేలా కార్యాచరణ చేపడతామన్నారు. ఆర్గానిక్ ఆహారాన్ని అలవాటు చేసుకుంటే ప్రజలు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. యోగాంధ్ర పిలుపుతో అర్ధ రాత్రి లేచి అన్ని వయసులవారు వచ్చేశారని ముఖ్య మంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు.
26 జిల్లాల్లో 26 థీమ్ థీమ్ బేస్డ్ యోగా >>2

## ట్రాన్స్ ఉమన్‌కూ పూర్తి హక్కులు

### - హైకోర్టు

**విజయవాడ జూన్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** పురుషుడి నుంచి మహిళగా మారిన ఓ ట్రాన్స్ ఉమన్‌కు సంతానోత్పత్తి సామర్థ్యం లేకున్నా స్త్రీకి ఉండే అన్ని హక్కులుంటాయని అత్యున్నత న్యాయ స్దానం స్పష్టం చేసింది.ఆమెకు పిల్లలు పుట్టే అవకాశం లేదనే కారణంతో తనను మహిళగా పరిగణించడానికి వీల్లేదన్న వాదనను హైకోర్టు తిరస్కరించింది. ఇలాంటి వాదని తప్పని, చట్టపరంగా ఆమోదయోగ్యం కాదని తేల్చి చెప్పింది. ఎపి హైకోర్టు న్యాయవాదులు తెలిపిన సమాచారాన్నిఅనుసరించి ట్రాన్స్‌జెండర్స్ న్యాయ స్దానం పలు అంశాల్లో స్పష్టతను ఇచ్చింది. స్త్రీతత్వాన్ని సంతానోత్పత్తికి పరిమితం చేసే సంకుచిత భావన రాజ్యాంగ స్ఫూర్తిని తక్కువ చేసి చూడటమేనంది. లింగ బేధంతో సంబంధం లేకుండా పౌరులకు హుందాతనంగా తగిన గుర్తింపుతో, సమానత్వంతో జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. ట్రాన్స్ జెండర్లకు లింగ గుర్తింపును స్వయంగా నిర్ణయించుకునే హక్కు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపింది. పిల్లల్ని కనే >>2



గిన్నెస్ బుక్ రికార్డు పత్రంతో నారా లోకేష్

## ప్రపంచ రికార్డులను బ్రేక్ చేసిన ఎపి

### ఇది ప్రజా సంఘటిత విజయం: గిన్నిస్ రికార్డుపై మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్22,ప్రభాతవార్తప్రతినిధి:** యోగా డే సందర్భంగా ఎపికి గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు రావడంపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. ప్రపంచ రికార్డులను ఆంధ్రప్రదేశ్ బ్రేక్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించిందని, బ్రాండ్ విశాఖ వేదికగా ఈఘనతను సాధించామని మంత్రి లోకేష్ అన్నారు. బ్రాండ్ విశాఖ వేదికగా ఈ సరికొత్త రికార్డు సాధించామని ఆయన దగ్గర నాలుగు లక్షల మంది ఒక క్రమ శిక్షణతో ఒక్కచోటనే యోగాడేలో పాల్గొన్నారన్నారు. గిరిజన >>2

## సుపరిపాలనలో తొలి అడుగు

### యేడాది పాలనపై నేడు కూటమి ప్రభుత్వ సమావేశం

**విజయవాడ, జూన్ 22,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి అధికారంలోకి వచ్చి యేడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట ప్రత్యేక సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం సాయంత్రం 4 గంటలకు రాజధాని అమరావతిలో ఈ కార్యక్రమం జరగనుంది. వెలగపూడి సచివాలయం వెనుక >>2



'సుపరిపాలనలో తొలి అడుగు' యేడాది పాలనపై జరుగనున్న సమావేశ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



- విడియో ద్వారా వెలుగులోకి వచ్చిన కొత్త కోణం
- పోలీసుల అదుపులో కారు డ్రైవరు
- కేసులో ఎ-2గా జగన్

## సింగయ్యను ఢీకొన్నది జగన్ వాహనమే!

### ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన పోలీసులు

**విజయవాడ,జూన్22,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ అధ్యక్షుడు జగన్ రెంటపాళ్ల పర్యటనలో గుంటూరులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సింగయ్య జగన్ వాహనం ఢీ కొట్టడం వల్లే చనిపోయినట్లు నల్లపాడు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఇప్పటివరకు సింగయ్యను జగన్ కాన్వాయ్‌తో పాటు ఉన్న వైఎస్సార్సీ నేత వాహనం ఢీ కొట్టినట్లు భావించి ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ వీడియో ద్వారా సింగయ్య మృతిలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. వైఎస్ జగన్ ప్రయాణిస్తున్న వాహనం ఢీకొనడం వల్లనే సింగయ్య అనే వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈనెల 18వ తేదీన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా పర్యటనకు వెళ్లినప్పుడు మార్గమధ్యలో గుంటూరు సమీపంలోని ఏటుకూరు వద్ద ప్రమాదం జరిగింది. ఇప్పటివరకు సింగయ్యను వైఎస్ జగన్ ర్యాలీలో పాల్గొన్న వేరే వాహనం ఢీకొందని పోలీసులు భావించి, ఆ దిశగా దర్యాప్తు చేశారు. అనూహ్యంగా బయటకొచ్చిన ఓ వీడియోలో ఆ రోజు ఏం జరిగిందో తెలిసింది.ఏటుకూరు వద్ద నేషనల్ హైవే నుంచి సర్వీసు రోడ్డులోకి మలుపు తిరిగే ప్రదేశంలో జగన్ వాహనం కింద సింగయ్య పడిపోయినట్టు కొందరు కార్యకర్తలు >>2

## 'కల్తీ నెయ్యి'లో బోలేబాబా డెయిరీ కీలకం

### మేనేజర్ చౌహాన్ కోసం సిట్ వేట

**తిరుమల,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూప్రసాదం తయారీలో ప్రధానమైన నెయ్యి కల్తీచేసి టిటిడికి పంపారనే కేసులో క్లైమాక్స్‌లో ఉత్తరాఖండ్ బోలేబాబాడెయిరీ యాజమాన్యం కీలకమని సిబిఐ సిట్ అధికారులు నిర్ధారించారు. 2022లోనే నెయ్యిసరఫరా టెండర్లలో పాల్గొన్న ఈ డెయిరీని టిటిడి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. అయితే ఆ తరువాత మాల్‌గంగ డెయిరీని బోలేబాబా తెరపైకి తీసుకువచ్చిందని, ఈ డెయిరీకి కమీషన్లు ఇచ్చి సుగంధ ఆయిల్స్, పామోలిన్‌తోబాటు మరికొన్ని రసాయనాలు కలిపి తయారుచేసిన కల్తీనెయ్యిని పరోక్షంగా బోలేబాబా డెయిరీనే టిటిడికి పంపిందని సిట్ తేల్చేసింది. టిటిడి తిరుమల ఆలయంతోబాటు రాష్ట్రంలోని మరికొన్ని ఆలయాలకు ఇదే నెయ్యి సరఫరా చేసినట్లు కూడా సిట్ దర్యాప్తులో ఆధారాలు సేకరించింది. దీనివెనుక ఉన్న పెద్దల పాత్ర కంటే ఆ డెయిరీకి చెందిన మేనేజర్ చౌహాన్‌ను పట్టుకుంటే తప్ప మరింత పూర్తి సమాచారం వెలుగులోకి వస్తుందని సిట్ వెల్లడించింది. చౌహాన్‌ను అరెస్ట్ చేస్తే కల్తీనెయ్యివెనుక పెద్దలెవరనేది స్పష్టం కానుంది. ఇప్పటికే కల్తీనెయ్యి సరఫరా కేసులో సుదీర్ఘవిచారణ >>2



ఆదివారం మదురైలో జరిగిన 'మురగ భక్తర్గళ్ మానాడు'లో స్వామీజీల ఆశీస్సులందుకొంటున్న డి.సిఎం పవన్



మురుగ భక్తర్గళ్ మానాడుకు విచ్చేసిన అశేష భక్తజనం

# ఇరాన్ ఉక్కిరిబిక్కిరి

>> స్థావరాలను ధ్వంసంచేసాయనే చెప్పాలి. జరుగుతున్న పరిణామాలను ముందే పసిగట్టిన ఇరాన్ మతపెద్ద అయతొల్లా ఖమైనీ తన నివాసాన్ని మార్చివేసి రహస్యస్థావరంలోకి వెళ్లిపోయారు. ఖమైనీని అంతంచేస్తామని ప్రకటించిన ఇజ్రాయెల్ హెచ్చరికలను పరిగణలోనికి తీసుకున్న ఇరాన్ ప్రభుత్వం ఖమైనీని రహస్యస్థావరం అంటే బంకర్‌లోకి తరలించింది. ఎలక్ట్రానిక్‌పరికరాలు వేటినీ కూడా వాడకుండా కేవలం ఒకరిద్దరు నమ్మకస్తులతోనే సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. తనకంటూ ప్రాణహాని జరిగితే వారసులు ఉండాలన్న లక్ష్యంతోముగ్గురు సీనియర్ మతపెద్దలపేర్లను కూడా ఎంపికచేసారు. అలాగే వారసత్వ పాలనకు చెక్‌పెడుతూ వారిలో తన కుమారుడిపేరును చేర్చలేదు. ఇదిలా ఉంటే ఇరాన్‌లో ఉన్నకీలక అణుస్థావరాలన్నింటినీ ధ్వంసంచేసామని అమెరికా రక్షణరంగవ్యవస్థ పెంటగాన్‌ప్రకటించింది. ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్‌గా పేర్కొన్న పెంటగాన్ తమ ఆపరేషన్ తీవ్ర విఘాతం కలిగించిందని చెప్పింది. రక్షణమంత్రి పిట్ హెగ్‌సేత్ ఆపరేషన్‌వివరాలుప్రకటించారు. మొత్తం 14 బంకర్ బస్టర్ బాంబులు విడిచామని, అమెరికానుంచి బి2 బాంబర్లు పాల్గొన్నాయని, ఇరాన్‌ను దృష్టి మరల్చేందుకు కొన్ని తూర్పువైపు, మరికొన్ని పశ్చిమానికి ప్రయాణించాయి. 37 గంటలపాటు11వేల కిలోమీటర్లుప్రయాణించినతర్వాత ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి 30 వేల పౌండ్ల బరువున్న 14 బాంబులు విడిచామని ప్రకటించారు. నతాంజ్, ఇస్ఫహాన్ ఫోర్డో అణుస్థావరాలు పూర్తిగా ధ్వంసంచేసినట్లు ప్రకటించుకున్నారు. ఏడు బి2 బాంబర్లు సహా మొత్తం 125 యుద్ధవిమానాలు, ఇంధనవిమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు పీట్‌హెగ్‌సేత్ వెల్లడించారు. ఫోర్డో,నతాంజ్‌లపై సాయంత్రం 6.40 గంటలకు ఏడు గంటలకల్లా ఇరాన్ గగనతలంనుంచి బయటకు వచ్చేసామన్నారు. ఇరాన్‌కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2.10 గంటలకు దాడులు జరిగినట్లు తెలిపారు. అమెరికాలోని మిస్సోరి స్థావరంనుంచి ఈ ఆపరేషన్ షురూచేసారు. మూడు స్థావరాలతోపాటు మరికొన్ని కీలక కూడళ్లపై తోమ్‌హాక్ క్షిపణులు ప్రయోగించారు. వాస్తవానికి రెండురోజుల ముందే అమెరికా బి2 బాంబర్లను పసిఫిక్ ద్వీపం గ్వామ్‌కు తరలించింది. ఈ బాంబర్లే ఫోర్డోవంటి లోతైన అణుస్థావరాలను ఛేదించాయి.

**హర్మూజ్ జలసంధి మూసివేత**

ప్రపంచ దేశాల చమురు ఎగుమతులకు కీలకంగా నిలిచిన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్‌ప్రకటించడంతో ఇపుడు చమురు జలరవాణాకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతాయి. ఇరాన్‌నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ తుదినిర్ణయం ప్రకటించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే పార్లమెంటు ఆమోదం తెలిపింది. ప్రపంచంలోని రోజువారి చమురు అవసరాల్లో 20శాతం ఈ జలసంధినుంచే వెళతాయి. ఒమన్‌లోని ముసాండం ద్వీపకల్పం, ఇరాన్‌మధ్య ఉన్న ఈ జలసంధిద్వారానే భారత్‌తోపాటు ఇతర దేశాలకు దిగుమతులు, అమెరికా ఇతర అగ్రదేశాల చమురు ఎగుమతులు వంటివిజరుగుతున్నాయి. అమెరికా దాడుల అనంతరం ఇరాన్ ఇక ఉపేక్షించేదిలేదంటూ చమురు రవాణాపైయుద్ధం ప్రకటించింది. హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీనితో ఒక్క భారత్‌కే కాకుండా ఈ జలసంధిద్వారా చమురు దిగుమతిచేసుకుంటునన ప్రపంచ దేశాలకు విఘాతం కలుగుతోంది. కరెన్సీ విలువలు పడిపోవడంతోపాటు ద్రవ్యోల్బణం పెరిగి చమురుధరలకు రెక్కలు వస్తాయి. ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యత్వదేశంగా ఉన్న అమెరికా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిందని, తమ గగనతలంలోకి అక్రమంగా ప్రవేశించి ఇరాన్‌పై దాడులుచేపట్టిందని ఇరాక్ ఐక్యరాజ్యసమితి సెక్రటరీజనరల్‌కు ఫిర్యాదులుచేసింది. ఇలాంటి నేరపూరిత దేశాలపట్ల ఇతర దేశాలు అప్రమత్తంగా ఉండాలని, ఈదాడులకు ప్రతీకార దాడులు తప్పకుండా ఉంటాయని, ఆగాయం అమెరికాకు జీవితాంతం గుర్తుండిపోతుందని ఇరాన్ విదేశాంగమంత్రి సయ్యద్ అబ్బాస్ ఆరోపించారు. ఆత్మరక్షణ హక్కును వినియోగించుకుంటూ ఇరాన్ తన సార్వభౌమత్వం, ప్రజల సంరక్షణకు అన్ని చర్యలుచేపడుతుందని అబ్బాస్‌వెల్లడించారు. అలాగేపశ్చిమాసియాలోని అమెరికన్లను అగ్రరాజ్యం స్థావరాలు లక్ష్యంగా దాడులుచేస్తామని వెల్లడించింది. **ఖమెనీకి భద్రతపెంపు...**

ఇజ్రాయెల్, అమెరికా దేశాలనుంచి పొంచి ఉన్న ముప్పుకారణంగా ఇరాన్ అధినేత అయతొల్లా ఖమైనీ భద్రతను మరింతపెంచేసారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు సైతం గుర్తుపట్టని రహస్య స్థావరంలో ఖమైనీని ఉంచారు. ఖమెనీ భద్రత పరంగా ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని నిర్ణయించిన ఇరాన్ ఎలాంటిసిగ్నల్లకు అవకాశం లేకుండా కమ్యూనికేషన్ వ్యవస్థలను ఈ బంకర్‌కు పూర్తిగా నిలిపివేసింది. కేవలం ముగ్గురు అత్యంత కీలకమైన ఉన్నతాధికారులు, ఖమైనీ సన్నిహితులు మాత్రమే ఖమెనీతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ కార్యాచరణలు అమలుచేస్తున్నారు. అలాగే ఈ రెండుదేశాలనుంచి తనకు ప్రాణహాని ఉన్నందున ఖమెనీ కూడా తన వారసులను ప్రకటించేసారు. తనకుమారుడు మొజ్తబా పేరును మాత్రం చేర్చలేదు. కేవలం అత్యంత సీనియర్ పెద్దలు అలీరెజా అరాఫీ, అలీ అస్గర్ హెజాజీ, హాషీం హుస్సేని బుషారీల పేర్లను ఎంపికచేసి వీరిలో వరో ఒకరు సుప్రీం బాధ్యతలుచేపడతారన్న సంకేతాలు ఇచ్చారు.

**యూటర్న్ తీసుకుంటున్న మిత్రదేశాలు..!**

కాగా ఇరాన్‌పై జరుగుతున్న దాడులను ప్రతిఘటించి ఆదేశానికి వెన్నుదన్నుగా నిలిచే మిత్రులందరూ యూటర్న్ తీసుకుంటున్నారు. నిన్నమొన్నటివరకూ అమెరికా యుద్ధనౌకలను పేల్చివేస్తామని ప్రకటించిన యెమెన్‌లోని హౌతీ దళాలు ఇపుడు మౌనం వహించాయి. అలాగే గాజా పాలస్తీనా హమాస్, ఈజిప్టులోని హెజ్‌బొల్లాలనుంచి కూడా ఎలాంటి స్పష్టమైన ప్రకటనలు రాకపోవడంతో ఇపుడు అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ప్రతిఘటించేందుకు ఇరాన్ ఏకాకిగా మారింది. అయినప్పటికీ ఇజ్రాయెల్‌లోని కీలక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించి ధ్వంసంచేసింది. మొత్తం 27కిపైగా క్షిపణులను ఇజ్రాయెల్‌లోని హైఫా, టెల్ అవీవ్‌నగరాలపై ప్రయోగించడంతో ఇజ్రాయెల్‌కూడా ఇపుడు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టంచేసుకుంటున్నది.

# క్రిమినల్ కేసు

>> వ్యాఖ్యలకు రాజధాని మహిళలు నిరసన వ్యక్తం చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారు సంకరజాతి వారని సజ్జల చేసిన వ్యాఖ్యలపై శిరీష ఫిర్యాదుచేశారు. ఈ వ్యవహారంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టుని సజ్జల రామకృష్ణారెడ్డి ఆశ్రయించారు. అయితే సజ్జలకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు వీలులేదని హైకోర్టులో శిరీష తరపున న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ ఇంప్లీడ్ పిటీ షన్ వేశారు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఉదయం సజ్జలపై క్రిమినల్ కేసు రిజిస్టర్ కావడంతో పోలీసులచర్యలపై సర్వత్రా ఉత్కంఠ ఏర్పడింది.

# బ్రేక్ చేసిన ఎపి

>> విద్యార్థులు విన్యాసాల్లో అద్భుతాలు చేసారన్నారు. ప్రపంచ రికార్డుల నమోదు గర్వకారణంగా ఉందన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలకు లోకేశ్ కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రభుత్వ అధికారులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలియజేశారు. ఇక యోగాను పాఠ్యంశాల్లో తీసుకుని వస్తామన్నారు. విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహిస్తామన్నారు.

# ఏకం చేసిన యోగా

>> అందరి క్షేమం కాంక్షిస్తుందన్న ప్రధాని, యోగాపై దేశంలోని అనేక వైద్యసంస్థలు పరిశోధన చేస్తున్నాయని తెలిపారు. యోగాను అనేక చికిత్సా విధానాల్లో భాగం చేస్తున్నాయని, గుండె, నరాల సమస్యలకు యోగా పరిష్కారంగా మారుతోందని చెప్పారు. మానసిక ఆరోగ్యానికి కూడా యోగా సహాయపడుతుందన్న ప్రధాని, అంతర్జాతీయ చికిత్సా కేంద్రంగా భారత్ మారుతోందన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు

>> భాగంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై 'సుపరిపాలనలో తొలి అడుగు' సమావేశాన్ని నిర్వహించనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి యేడాది పూర్తయిన జూన్ 12వ తేదీనే ఈ కార్యక్రమం నిర్వహించాలని భావించినా.. అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఘోర విమాన ప్రమాదం దృష్ట్యా వాయిదా వేశారు. రేపటి సమావేశంలో ఏడాదిలో చేపట్టిన పాలనా సంస్కరణలు, తీసుకొచ్చిన మార్పులు, అందించిన సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని సమీక్షించుకునేలా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. వచ్చే నాలుగేళ్లలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటంతో పాటు అభివృద్ధి లక్ష్యాలను ఎలా సాధించాలన్న అంశంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నారు. అమరావతిలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, హెచ్వోడీలు, సెక్రటరీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు హాజరు అవుతారు.

**స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల పైనా దృష్టి**

కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుని రెండో ఏడాదిలోకి అడుగుపెట్టింది. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక, పాలనా విధ్వంసాలను సరిచేస్తూ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం దిశగా నడిపిస్తోంది. స్వల్పకాలిక అభివృద్ధి ఆశయాలతో పాటు వికసిత ఆంధ్రప్రదేశ్ సాధన కోసం స్వర్ణాంధ్ర 2047 విజన్ లాంటి దీర్ఘకాలిక ప్రణాళికల్ని కూడా కూటమి ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్రానికి పరిశ్రమలుపెట్టుబడులను తీసుకురావటం, 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పన తదితర అంశాల్లో వేగంగా అడుగులు వేస్తోంది. యేడాదిలో చేసిన సుపరిపాలనను సమీక్షించుకునేందుకురాష్ట్ర భవిష్యత్ కోసం చేసిన ప్రణాళికల్ని వివరించేలా 'సుపరిపాలనలో తొలి అడుగు' అనే పేరిట ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఇదే సమయంలో ఈ ఏడాది ఏం చెయ్యాలి...ఎలాంటి లక్ష్యం సాధించాలి అనే అంశాలను కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు. గత ఏడాది ప్రొగ్రెస్ రిపోర్ట్ వివరిస్తూ....ఈ ఏడాది చేపట్టే కార్యక్రమాలను ఈ సమావేశంలో చర్చించనున్నారు. 26 జిల్లాల నుంచి వచ్చే అధికారులతో సమావేశం ముగిసిన తరువాత..అందరితో కలిసి సిఎం, మంత్రులు అక్కడే డిన్నర్ చేయనున్నారు.

**కార్యక్రమం ఏర్పాట్లు పూర్తి**

ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. సమావేశంలో పాల్గొనే ప్రతినిధులు కూర్చునేందుకు ప్రధాన వేదికతో కూడిన రౌండ్ టేబుళ్లతో సభా ప్రాంగణం సిద్ధమైంది.దానిని ఆనుకుని సమావేశానికి వచ్చిన సియం, డిప్యూటీ సిఎం సహా ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు రాత్రి భోజనం చేసేందుకు మరో ప్రాంగణం ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఈకార్యక్రమంలో ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ వెంట గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జెసి భార్గవ్ తేజ్, రాష్ట్ర ప్రణాళికా శాఖ సంయుక్త కార్యదర్శి అనంత శంకర్, గుంటూరు ఆర్డిఓ శ్రీనివాస రావు,ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ మోహన్ రావు,సిఆర్‌డిఏ ఎస్ఇ ధనుంజయ్, గుంటూరు డిఎఫ్ఓ శ్రీనివాస రెడ్డి,ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ ఉమన్‌కూ పూర్తి హక్కులు

>> సామర్థ్యం లేదన్న కారణంతో ట్రాన్స్ ఉమన్ స్త్రీ హోదా నిరాకరించడం 498 (ఏ) కింద కేసు పెట్టే హక్కు లేదనడం ఆమె పట్ల వివక్ష చూపడేమనంది. 498(ఏ) కింద ట్రాన్స్ ఉమన్‌కు ఆమె భర్త అత్తమామలు, బంధువులపై పోలీసులకు ఫిర్యాదు చేసే హక్కు ఉంటుందని పేర్కొంది. అయితే ప్రస్తుత కేసులో ట్రాన్స్ ఉమన్‌ను ఆమె భర్త అత్తమామలు వేధించినట్లు కట్నం కోసం డిమాండ్ చేసినట్లు ఆధారాలు లేనందున ట్రాన్స్ ఉమన్ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులు కొట్టేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఇటీవల కీలక మార్పు ఇచ్చారు. ఒంగోలుకు చెందిన షబానా ట్రాన్స్ ఉమన్ చెన్నైకి చెందిన విశ్వనాథన్ కృష్ణమూర్తి షబానా ప్రేమించుకున్నారు. హైదరాబాద్ ఆర్య సమాజ్‌లో 2019 జనవరి 21న వివాహం చేసుకున్నారు. అదే ఏడాది మార్చి 11 వరకు ఒంగోలులో నివాసం ఉన్నారు. ఆ తర్వాత కృష్ణమూర్తి చెన్నైలోని తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో షబానా చెన్నైలోని కృష్ణమూర్తి ఇంటికెళ్లి ఆరా తీశారు. అక్కడ భర్త అత్తమామలు తనను చంపేస్తామని బెదిరించారని ఒంగోలు మహిళా పోలీసుస్టేషన్లో షబానా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి ఒంగోలు కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ కృష్ణమూర్తి, అతని తల్లిదండ్రులు 2022 లో హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపిస్తూ ట్రాన్స్ జెండర్‌కు సంతానోత్పత్తి సామర్థ్యం ఉండదని, ట్రాన్స్ ఉమన్‌ను మహిళగా పరిగణించడానికి వీల్లేదని, ఈ నేపథ్యంలో షబానాకు భర్త అత్తమామలపై 498(ఏ) కింద కేసు పెట్టే అర్హత లేదన్నారు. వేధింపులకు గురిచేశారనేందుకు ఆధారాలు కూడా లేదన్నారు. పోలీసుల తరపున ఏపీపీ ప్రియాంక లక్ష్మి వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి పుట్టుక సమయంలో ఉన్న లింగ నిర్ధారణే, ఆ వ్యక్తి లింగ గుర్తింపుగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. ట్రాన్స్ జెండర్ల హక్కులను రక్షించేందుకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను గుర్తుచేశారు. లింగ గుర్తింపు కోసం ట్రాన్స్ జెండర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారని పుట్టినప్పుడు పేర్కొన్న లింగాన్నే తప్పనిసరిగా అనుసించాల్సిన అవసరం లేకుండా ఆదేశాలివ్వాలని కోరారన్నారు. సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించి రాజ్యాంగం కల్పించిన హక్కులు కేవలం పురుషులు, స్త్రీలకే పరిమితం కాదని, ట్రాన్స్ జెండర్లకు వర్తిస్తాయని తెలిపిందన్నారు. ఈ తీర్పునకు అనుగుణంగా 2019లో ట్రాన్స్ జెండర్ పర్సన్స్ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని వివాహం తర్వాత భిన్న లింగసంపర్క సంబంధం ఉన్న ట్రాన్స్ ఉమన్/ట్రాన్స్ జెండర్‌కు 498(ఏ) కింద కేసు పెట్టే హక్కు ఉంటుందని స్పష్టం చేశారు.

# హర్మూజ్ జలసంధి

>> దేశాల మద్దతు కూడగట్టేందుకే ఇరాన్ ఈనిర్ణయం తీసుకుంది. రోజువారి చమురు అవసరాల్లో 20శాతం ఈ జలసంధిద్వారానే రవాణా అవుతుంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం ఇరాన్‌మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇదే. దీనితో ఒకచోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లుమాత్రమే ఉంటుంది. ఈ మార్గంనుంచి నిత్యం రెండు కోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యుఎఇ, కువైట్, ఇరాక్‌లనుంచి ఎగుమతి అవుతుంది. హర్మూజ్ జలసంధి మూసివేత నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్యంపై పడుతుంది. ముఖ్యంగా భారత్ చమురు అవసరాల్లో 90శాతం ముడిచమురు విదేశాలనుంచే దిగుమతిచేసుకుంటున్నది. ఈమొత్తంలో 40శాతం హర్మోజ్ ద్వారానే వస్తుంది. ప్రభుత్వం తన 74 రోజుల చమురునిల్వలను తగ్గించుకోవాల్సి వస్తోంది. ఇరాన్ నిర్ణయం ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువపైనా ప్రభావం పడుతుంది. ఇప్పటికే బ్యారెల్ ముడిచమురు 90 డాలర్లవద్ద ఉంది. సౌదీ అరేబియా, ఇరాక్, యుఎఇ దేశాల నుంచి అత్యధికమొత్తంలో భారత్‌ముడిచమురు దిగుమతిచేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ చమురునౌకలు ఒమన్ ఇరాన్ సముద్ర మార్గంలో ఉన్న హర్మూజ్ జలసంధిలోప్రయాణిస్తాయి. భారత్‌కు ముడిచమురు 15లక్షల బ్యారెళ్లు ఉంటుంది. ఈరవాణా ఆగితే రోజుకు 10 నుంచి 12కోట్లలీటర్ల పెట్రోలు ఉత్పత్తి నిలిచిపోతుంది. అలాగే ద్రవరూప గ్యాస్ రవాణాలోను 20శాతం ఈ జలసంధి మీదుగానే వెళతాయి. ఇపుడు అమెరికా, ఇజ్రాయెల్ బాంబుల దాడులవల్ల ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో ప్రపంచదేశాలపై చమురు డిమాండ్ మరింతపెరగడం ఆపై ధరలు కూడా చుక్కలనంటేపరిస్థితులు ఉన్నాయి.

# జగన్ వాహనమే!

>> గమనించి ఆపాలని డ్రైవర్‌కు కార్యకర్తలు సైగ చేసినట్టు ఆ వీడియోలో ఉంది. సీసీ కెమెరాలు, వీడియో ఫుటేజీలు, డ్రోన్ వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, వైఎస్ జగన్ ప్రయాణిస్తున్న వాహనం కింద సింగయ్య పడి ప్రాణాలు కోల్పోయినట్టు నిర్ధరించారు. ఘటన సమయంలో అక్కడున్నది ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడుకు చెందిన వైఎస్సార్సీ కార్యకర్తలుగా గుర్తించి వారిని పిలిచి ఆ రోజు ఏం జరిగిందన్న విషయమై విచారించారు. చనిపోయింది సింగయ్యేనా అని వారిని అడిగి నిర్ధరించుకుని ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సింగయ్య మృతిచెందిన రోజు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ర్యాలీలో ఉన్న వాహనం ఢీకొందని చెప్పి దాని నంబరు సైతం ప్రస్తావించారు. అప్పటికి పూర్తిస్థాయిలో స్పష్టత లేకపోవడంతో ఎఫ్ఐఆర్‌లో మాత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొందని పేర్కొంటూ కేసు నమోదుచేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో జగన్ కారు డ్రైవర్‌ను నల్లపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి వివరాలు రాబడుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనం కింద వ్యక్తి పడినట్లు గుర్తించారా? ఆ సమాచారాన్ని వైఎస్ జగన్‌కు తెలియజేశారా? ఘటన జరిగిన వెంటనే వాహనం ఆపకుండా ఎందుకు వెళ్లిపోయారు? తదితర విషయాలపై జగన్ కారు డ్రైవర్ నుంచి సమాచారాన్ని పోలీసులు తెలుసుకుంటున్నారు. మరోవైపు జగన్ పర్యటనకు సంబంధించి వీడియోలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆయన పర్యటనను ఎవరెవరు వీడియోలు తీశారనే దానిపై ఆరా తీస్తున్నారు. వారి నుంచి ఫుటేజీని సేకరిస్తున్నారు. తాజా సమాచారాన్ని అనుసరించి ఈ కేసులో ఎ1గా కారు డ్రైవర్ రమణారెడ్డిని, ఎ2గా వైఎస్ జగన్‌ను, ఎ3గా కారు యజమానిని చేర్చాలని పోలీసులు నిర్ణయించారు. యాక్సిడెంట్‌లో సింగయ్య చనిపోయిన రోజు ఐపిసిలోని 304ఏ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కెమెరా విజువల్స్‌లో అది జగన్ ప్రయాణిస్తున్న కారు అని తేలడంతో పోలీసులు అప్రమత్తం అయ్యారు.ఈ నేపథ్యంలోనే ఎఫ్ఐఆర్‌లో అదనంగా 304 పార్ట్ 2 సెక్షన్ వర్తించే అవకాశం ఉంది. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసే అవకాశం కూడా ఉంది. ఎఫ్ఐఆర్‌లో సెక్షన్స్ మార్చి కోర్ట్ మెమో పంపాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులు అందరూ భేటి అయ్యారు. ఈ సంఘటన జరిగిన సమయంలో ఉన్న వ్యక్తుల కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. అప్పుడు బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందిని కూడా ఉన్నతాధికారులు పిలిపిస్తున్నారు.

# యోగాతో మహాద్భుతం సాధించాం

>> కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. 100 పర్యాటక ప్రదేశాల్లో అనుకుంటే 101 చోట్ల చేశారన్నారు. లక్షకు పైగా ప్రదేశాల్లో రెండున్నర కోట్ల మంది యోగా చేశారని తెలిపారు. విశాఖలో 10 ఏళ్ల క్రితం హుద్ హుద్ పరిణామాలను ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. నాడు దీపావళి టపాసులు కాల్చొద్దంటే మానేశారని, నేడు యోగాకు రమ్మంటే ఉత్సాహంగా తరలివచ్చారన్నారు. తన పిలుపుతో వృద్ధులు కూడా వచ్చి ఆసనాలు వేశారని సిఎం తెలిపారు. కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ సిఎం అభినందనలు తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా డే నిర్వహణపై ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. గేమ్ ఛేంజర్‌గా నిలిచిన ఈ వేడుకకు ఓ లాజికల్ ముగింపు ఇస్తామన్నారు. యోగా వల్ల కుటుంబానికి, రాష్ట్రానికి భారం కాదని గుర్తించాలని అన్నారు. ఇంకా పెద్ద ఎత్తున యోగాంధ్రను ప్రోత్సహిస్తామన్నారు. డిజిటల్ హెల్త్ కార్డులకు సంబంధించి బిల్ గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి నూతన ఒరవడిలు సృష్టిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యాన్ని కాపాడుతూ వైద్య ఖర్చులు బాగా తగ్గేలా ఈ ప్రాజెక్టు రూపొందుతోందన్నారు. మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం పనితీరు వల్ల ప్రజా చైతన్యం పెరిగిందని ప్రధాని గుర్తించారన్నారు. వాస్తవాలు లేకుంటే ప్రధాని మాట్లాడరన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని ప్రశంసలకు కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, సంస్కరణలు రాకుండా ఉంటే కొత్త ఆలోచనలు వచ్చేవి కావని ముఖ్యమంత్రి అన్నారు. 1995లో సాంకేతిక విప్లవం వచ్చిందన్నారు. ఈ సాంకేతికతను అందిపుచ్చుకుని భారతీయులు ఎదిగారని అన్నారు. రాజకీయ నేతగా అప్పుడు, ఇప్పుడూ సాంకేతిక పరిజ్ఞాన్ని ప్రోత్సహిస్తున్నాను. టెక్నాలజీని అర్థం చేసుకోవడంలో ప్రధాని మోడీని మించినవారు లేరు. ఏఐ, క్వాంటమ్ వ్యాలీ అంటే చాలామందికి అర్థం కావడం లేదు. ప్రపంచ దేశాల్లో ఉన్న భారత సంతతి వారే తలసరి ఆదాయంలో ఆయా దేశాల వారికంటే ముందున్నారు. మంచి విజ్ఞానం, ఆలోచనలు ఉన్న అధికారులు సాంకేతికతను కూడా అందిపుచ్చుకుంటే మంచి ఫలితాలు సాధించొచ్చని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్గానిక్ ఆహారాన్ని అలవాటు చేసుకుంటే ప్రజలు ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం లేదు అని ముఖ్యమంత్రి వివరించారు. 22,122 మంది 108 నిమిషాల పాటు సామూహికంగా సూర్య నమస్కారం చేసి గిన్నీస్ రికార్డు సాధించిన గిరిజన విద్యార్థులను మనస్ఫూర్తిగా అభినందిస్తు న్నానని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26జిల్లాల్లో 26 థీమ్ ఆధారిత యోగా కార్యక్రమాలు చేపట్టాం. 100 పర్యాటక ప్రాంతాల్లో యోగా చేయాలనుకుంటే 101 చోట్ల నిర్వహించాం. సూరత్‌లో 1.47 లక్షల మందితో యోగా చేసి గిన్నీస్ రికార్డ్ సాధిస్తే...నేడు 3లక్షలమంది పైచిలుకుమందితో యోగాడే నిర్వహించాం. రాష్ట్రంలో 1.30 లక్షల ప్రాంతాల్లో యోగా సాధన చేశారు. మొత్తంగా 2.17 కోట్ల మంది పాల్గొన్నారు. 1.44 లక్షల మంది యోగా శిక్షకులు తయారయ్యారు. కేంద్రంకూడా ప్రమోట్‌చేసేందుకు 5లక్షల టీషర్టులు, మ్యాట్లు 5 లక్షలు రాష్ట్రానికిపంపించింది. మంచి కార్యక్రమాన్ని 30రోజుల పాటు పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేసినందుకు మీడియా ప్రతినిధులను అభినందిస్తున్నాను. యోగాడే స్ఫూర్తిగా విశాఖపట్నం డిక్లరేషన్ తీసుకొస్తాం. యోగా ఒక గేమ్ ఛేంజర్ అవుతుంది. రాష్ట్ర బడ్జెట్ నుంచి ఈ ఏడాది ఆరోగ్య శాఖకు రూ.18 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రూ.5 వేలకోట్లకుపైగా ఎన్టీఆర్ ఆరోగ్య వైద్య సేవకు ఖర్చుచేస్తున్నాం అని సిఎం అన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 23-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
త్రయోదశి రా.10.10
కృత్తిక మ.3.16
వర్జ్యం తె.5.42-7.09
దు.మ.12.37-1.29, 2) మ.3.14-4.16
శుభసమయం : ఉ.5.30-6.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం** : సంతానం అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. విలువైన వస్తు - ఆభరణాలు కొనుగోలుచేస్తారు.

**వృషభం** : ఎంతోకాలంగా వేధిస్తున్న సమస్యలు కొంతవరకు తీరుతాయి. పనులు పూర్తి.

**మిథునం**: భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**కర్కాటకం** : ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. చర్చలలో పాల్గొంటారు.

**సింహం**: దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఆనందం కలిగిస్తుంది. ధనలాభం.

**కన్య** : బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. వస్తులాభం.

**తుల** : ఎంతటివారినైనా ఆకట్టుకొని ముందుకుసాగుతారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలుచేస్తారు.

**వృశ్చికం**: పట్టుదలతో ముందుకు సాగుతారు. వృత్తి-వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**ధనుస్సు**: అందరిలోనూ గుర్తింపు రాగలదు. దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుతుంది.

**మకరం**: రుణాలు తీరి ఊరటచెందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**కుంభం**: కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తిచేస్తారు. విందు, వినోదాలు.

**మీనం** : సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గోదావరి వివాదాలపై కొత్త ట్రిబ్యునల్!

>> లతో చర్చించారు. మహారాష్ట్ర ,తెలంగాణ, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిస్సా రాష్ట్రాల్లో గోదావరీ నదీ పరివాహక ప్రాంతం ఉంది. గోదావరి మిగులు, వరద జలాల ఆధారంగా కొత్త ప్రాజెక్టులకు సంబంధిత రాష్ట్రాలు ప్రణాళికలు వేసుకుంటున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల మధ్య జలాల వినియోగంపై వివాదాలు వస్తున్నాయి. తాజాగా గోదావరి మిగులు, వరద జలాల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ పోలవరం, బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులకు ప్రతిపాదనలు చేసింది. అయితే ఈ విషయంపై తెలంగాణ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. మరోవైపు గోదావరి మిగులు, వరద జలాల ఆధారంగా ప్రాజెక్టులకు చత్తీస్‌ఘడ్ శ్రీకారం చుట్టింది. రాష్ట్రాల మధ్య వివాదాలు, తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతుండటం, ఫిర్యాదులు కూడా పెద్ద ఎత్తున వస్తోండటంతో ఏం చేయాలనే దానిపై కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఏ రాష్ట్రాలకు అన్యాయం జరుగకుండా చూస్తామని కేంద్రప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ దిశలో గోదావరి నదీ జలాల ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని కేంద్ర జల మంత్రిత్వ శాఖ భావిస్తోంది. గతంలో ఆయా రాష్ట్రాల మధ్య జలాల వివాదాన్ని పరిష్కరించి అవార్డ్ ఇచ్చిన బచావత్ నేతృత్వంలోనే గోదావరి నదీ జలాల వివాద ట్రిబ్యునల్ ఏర్పాటైంది. 1980లో అవార్డ్ ప్రకటించిన అనంతరం గోదావరి నదీ జలాల విదాద ట్రిబ్యునల్ మనుగడలో లేకుండా పోయింది.

# ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్

**న్యూఢిల్లీ, జూన్ 22:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న దాడులతో పశ్చిమాసియాలో వాతావరణం వేడెక్కింది. టెహ్రాన్‌పై అమెరికా దాడులతో అది మరింత ముదిరింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడులు నిర్వహించడంపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్పందించారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిణామాలపై ప్రధాని మోడీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శత్రుత్వాన్ని తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. దౌత్య మార్గంలో సమస్యను పరిష్కరించుకోవాలనిసూచించారు. కాగా.. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో సహకారంపై రెండు వారాల్లో చర్చలు జరిపి ఒక నిర్ణయం తీసుకుంటానని చెప్పిన ట్రంప్.. టెహ్రాన్‌పై రెండు రోజుల్లో దాడులు నిర్వహించారు.

# బోలేబాబా డెయిరీ కీలకం

>> చేపట్టిన సిట్ అధికారులు పాత్రధారులెవరనేది దాదాపుగా తేల్చేసింది. వారందరినీ అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించింది. ఏఆర్ డైరీ ఎండి రాజశేఖరన్, రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక) సిఇఒ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలు కీలకంగా ఉన్నారు. కోల్‌కత్తాలో నూనెల పరిశ్రమ నడుపుకుంటున్న పారిశ్రామికవేత్త జ్యోతిష్యను సిట్ విచారణ చేసి కొన్ని ఆదారాలు సేకరించింది. టిటిడి మాజీ ఛైర్మన్ అప్పన్నను కూడా సిట్ బృందం అదుపులోకి తీసుకుని అవసరమైన సమాచారం మొత్తం సేకరించిన విషయం తెలుస్తోంది. తిరుపతి అలిపిరిలోని తాత్కాలిక సిట్ కార్యాలయం వేదికగా గత ఏమినిమది నెలల దర్యాప్తులో 15మంది వరకు ముఖ్యులైన మేనేజర్ల నుండి అధికారులు, ల్యాబ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్‌లు, అధికారులు, సిబ్బంది అయిన నిందితులను అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో బోలేబాబాడెయిరీ జిఎం హరివమోన్‌రాణా మాస్టర్‌మైండ్ ఉందని, అతను బయటకు వెళ్తే సాక్ష్యాధారాలు మాయం చేస్తాడని ,సాక్షులను ప్రభావితంచేసే అవకాశం ఉందనేది ఎపిపి వాదనలు వినిపించారు. దీంతో ఎసిబి కోర్టులో దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి తిరస్కరించారు. కల్తీ నెయ్యిలో అంతా బోలేబాబా డెయిరీ లీలలేనని ఒనిర్ధారణకు వచ్చేసిన సిట్ బృందం పెద్దలెవరనేది తేల్చేపనిలో ఉన్నారు. 2024 జులైలో వెలుగుచూసిన తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా బాగోతంలో ఇప్పటికే సంచలన విషయాలు వెలుగుచూశాయి. దీనిపై తొలుత రాష్ట్రసిట్ ఏర్పాటైనా, కొందరు పెద్దలు రాద్ధాంతం చేసి కేసును ఆపేందుకు ప్రయత్నాలు సాగించారు. దీంతో ఏకంగా సుప్రీంకోర్టు సిబిఐ,రాష్ట్రపోలీసు ఉన్నతాధికారులతో ఒక సిట్‌ను గత ఏడాది నవంబర్‌లో ఏర్పాటుచేసింది. ఆ దర్యాప్తులోని సిబిఐ అధికారులు చేపట్టిన లోతైన సమగ్ర దర్యాప్తులో కల్తీనెయ్యి టిటిడికే పరిమితం కాలేదని, రాష్ట్రంలోని అన్ని ప్రధానమైన ఆలయాలు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, ద్వారకా తిరుమల ఆలయాలకు ఇదే కల్తీనెయ్యి సరఫరా అయ్యిందనేది విస్మయానికి గురిచేసింది. ఈ కేసులో దర్యాప్తుచేపట్టిన సిబిఐ సిట్ అధికారులకు బోలేబాబాడెయిరీ లీలలు తెలిశాయి. కల్తీనెయ్యిని సరఫరాచేశారనేది అధికారులు నిర్ధారించేశారు. మరీ ఇప్పుడు బోలేబాబా డెయిరీ ఛౌహాన్ కోసం వేటాడుతున్నారు. ఆయన పట్టుబడితే మరిన్ని సాక్ష్యాధారాలు సిట్ చేతికి అందినట్లేనని, ఈ కల్తీ పాపంలో కీలక సూత్రధారుల పేర్లు వెలుగుచూసి కల్తీ కేసు క్లైమాక్స్‌కు చేరుకుంటున్నదనేది సమాచారం.

## తిరుమల సమాచారం



# తెలుగుప్రజలకు శ్రీవారి ఆశీస్సులుండాలి

**తిరుమల, జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల ప్రజలందరికీ శుభాలు కలగాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్‌తిలహరి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అభినావ కుమార్‌షావిలి, డీఆర్‌డిఒ ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్, తెలంగాణ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ దంపతులు ఆదివారం ఉదయం వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. దేవుడ్ని దర్శించుకుంటే అన్నీ శుభాలు కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. వీరికి టిటిడి ఆలయఅధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనంచేశారు. టిటిడి ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.





# వెంకన్న దర్శనానికి 24గంటలు

**తిరుమల,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ముగిసిన తరువాత విద్యాసంస్థలు తెరచుకున్న పదిరోజులకు వారాంతం ,రెండు రోజులు సెలవులు రావడంతో తిరుమల జనసంద్రంగా మారింది. ఆదివారం ఉదయానికి వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి ఏవిఎస్‌ఒ రాజశేఖర్ ఆలయంలో భక్తుల లైన్లు త్వరగా కదిలేలా చూస్తున్నారు. గత పదిరోజులుగా తిరుమల భక్తజనసంద్రంగానే కొనసాగు తోంది. ఆదివారం ఉదయానికి స్వామివారి సర్వదర్శనానికి 24గంటలు సమయం కేటాయించారు. ప్రత్యేక ప్రవేశ దర్శ



నాలుగుకిలోమీటర్లు శిలాతోరణం వరకు వెలుపల క్యూలైన్లు బారులుతీరాయి. వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా చేరుకోవడంతో తిరుమలలో రద్దీ విపరీతంగా ఉంది. టిటిడి అధికారులు కూడా అందుకు తగ్గట్లు ఏర్పాట్లుచేసి వీలైనంత త్వరగా దర్శనం చేయించేందుకు చూస్తున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, విఎస్‌ఒ ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ నానికి ఆరేడుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 30వేలమంది భక్తులు అర్థరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టీ,కాఫీ ,మజ్జిగ,పాలు పంపిణీ చేస్తున్నారు. వెలుపల క్యూలైన్లలోని భక్తులకోసం పారిశుద్యసిబ్బంది 24గంటలూ మూడుషిఫ్టుల్లో సేవలందిస్తున్నారు.

# తిరుపతిలోని శివాలయంలో వడ్రంగి తేనెటీగ

## శేషాచలంలో 93 జీవాలున్నట్లు శాస్త్రవేత్తల పరిశోధన

### 94వదిగా వడ్రంగి తేనెటీగ

**తిరుమల,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** జీవవైవిధ్యానికి నిలయంగా మారిన శేషాచలంఅడవుల్లో అరుదైన వడ్రంగి తేనెటీగ ప్రత్యక్షమైంది. ఈ తేనెటీగ ఆదివారం ఉదయం తిరుపతినగరంలోని మంచినీళ్ళగుంట సమీపంలో ఉన్న శివాలయంలో కనిపించింది. ఈ విషయాన్ని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ పి. హరికృష్ణ తెలిపారు. సహజంగా వడ్రంగి తేనెటీగ ఉత్తర అమెరికాలో సంచరించేదని, తూర్పుకనుమల్లో ఉందని ఇప్పుడు తిరుపతి పరిసరాల్లో కనిపించిందని గతంలోనే రెండు సార్లు జులాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇంకా 93 రకాల జీవాలున్నాయని, తాజాగా కనుగొన్న వడ్రంగి తేనెటీగ 94వదని జీవశాస్త్ర నిపుణులు తేల్చారు. ఈ వడ్రంగి తేనెటీగ మగవ్యాలీ కార్పెంటర్ బీ ,ట్రాఫికల్ కార్పెంటర్ బీ జాతికి చెందిందని, చూడగానే ఆకట్టుకునే విధంగా కనిపిస్తుంది.



ఆదివారం ఉదయం శివాలయంలో నేలపై మెల్లగా ప్రాకుతూ రావడం గమనించారు. ఈ తేనెటీగల జీవనం చెక్కలో గూళ్ళు చేసుకుంటాయని, ఇది సాధారణంగా చెక్కను కొరికి రంధ్రాలు చేస్తాయి. అయితే చెక్కను తినవని, ఆడవడ్రంగి తేనెటీగలు మాత్రమే కుట్టగలవన్నారు. ఒకే ద్వారం కలిగిన వృత్తాకర రంధ్రం చేస్తాయి. ఆ రంధ్రంలోపల సొరంగాలు గా విభజించుకుంటాయి. అయితే ఇవి తేనెను ఉత్పత్తిచేయవు. పువ్వులనుండి మకరంధం, పుప్పొడిని సేకరిస్తాయి. వాటి లార్వా కోసం అవి చెక్కబొరియల్లో నిల్వచేసిన బీబ్రెడ్‌ను మాత్రమే తింటాయి.

# కర్నూలు నుండి వచ్చిన చిరుత ఎస్వీజూలో మృతి



**తిరుపతి,జూన్ 22ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లా ఆదోని సమీపంలోని కొసిగి ప్రాంతంలో పట్టుబడిన చిరుతపులిని సంరక్షణకు తిరుపతి ఎస్వీజూకు తరలించగా, అది అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు ఎస్వీ జూ అధికారులు తెలిపారు. ఈనెల 15వతేదీ సుమారు ఆరేడు సంవత్సరాల వయస్సుగల ఒక మగచిరుతపులిని అక్కడి అటవీశాఖ సిబ్బంది రక్షించి మరుసటి రోజు 16వతేదీ తిరుపతి ఎస్వీజూకు తరలించారు. ఇక్కడకు తీసుకువచ్చిన చిరుతపులిని జూలో తిరుపతి ఎస్వీవైద్యవిశ్వవిద్యాలయం మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్ నేతృత్వంలోని ఆరోగ్యకమిటీ రేడియోగ్రఫీ, అల్ట్రాసోనోగ్రఫీ, శారీరక రసాయన పరీక్షలు నిర్వహించారు. తదనంతరం తగిన వైద్యం సూచించారు. ఆ రోజునుండి ఆ చిరుత ఆహారం తీసుకోకుండా కేవలం ద్రవపదార్థాలపై ఆధారపడింది. ఐదురోజులుపాటు దాన్ని ఆరోగ్యం సంరక్షించినా చివరకు శనివారంరాత్రి అదీ జూలో మరణించింది. ఆదివారం ఉదయం మగచిరుతకు ఎస్వీవైద్యకళాశాల పాథాలజీ విభాగం ప్రొఫెసర్ ఆధ్వర్యంలో శవపరీక్షలు చేశారు. చిరుతపులి వేటాడి సంహరించి తిన్న ఆహారం అన్నవాహికలో అడ్డుపడింది. దీనివల్ల ఇన్‌ఫెక్షన్ కారణంగామరణించిందని వైద్యులు నిర్ధారించారు. ఎస్వీ జంతుప్రదర్శనశాలలోనే ఖననం చేశారు.

# కల్‌రోడ్‌పల్లి వద్ద కారు దగ్ధం: దంపతులు దుర్మరణం

### ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు

**చంద్రగిరి, జూన్ 22 ప్రభాతవార్త:** కల్‌రోడ్ పల్లి వద్ద జాతీయ రహదారిపై కల్వర్టును ఢీకొట్టిన కారు మంటల్లో చిక్కుకుని దగ్ధమైన విచాకర దుర్ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. చిత్తూరు జిల్లా, గుడిపాల మండలం, కుప్పిగాని పల్లికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఎ.సిద్దయ్య (43) తన పుట్టిన రోజును పురస్కరించుకుని భార్య జ్యోతి (38), తమ కుమార్తె గాయత్రి, కుమారుడు గిరితో కలసి తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. పూతలపట్టు-నాయు



డుపేట జాతీయ రహదారి కల్‌రోడ్ పల్లి పంచాయతీ, గెడ్డక్రింద పల్లి వద్ద కారు కల్వర్టును వేగంగా ఢీ కొట్టుకుని పొగలు చిమ్మడంతో వాహనచోదకులు, దంపతులను, పిల్లలను కారు నుండి బయటకు దించారు. ఈ క్రమంలో కారులో మంటలు వ్యాపించడంతో కారు పూర్తిగా మంటల్లో చిక్కుకుని కాలిపోయింది. ప్రమాదానికి గురైన సిద్దయ్య, జ్యోతి విలవిలలాడుతూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న ఎస్ఐ అనిత హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నారు. తీవ్రగాయాలపాలైన గాయత్రి, గిరిని అంబులెన్స్ ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

# యోగాంధ్ర విజయవంతంపై మంత్రి దుర్గేష్ హర్షం

**విజయవాడ,జూన్22,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ప్రజల సహకారంతో విజయవంతం కావడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. యోగాంధ్ర 2025 (యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్) పేరుతో రాష్ట్రవ్యాప్తంగా మే 21 నుండి జూన్ 21 ప్రపంచ యోగ దినోత్సవం వరకు నెల రోజుల పాటు ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. భారీ ఎత్తున ప్రజల నుండి స్పందన రావడం, విశాఖలోని ఆర్ కే బీచ్ నుండి భోగాపురం వరకు దాదాపు 3 లక్షలకు పైగా ప్రజలు ఒకే వేదికపై యోగా అభ్యసనం చేయడం అసాధారణమైన విషయమన్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం గిన్నిస్ రికార్డు సాధించడం సంతోషంగా ఉందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలిగించే యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నదే తన ఆకాంక్ష అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. యోగా మన వారసత్వ సంపద అని గుర్తుచేశారు. ప్రపంచానికి మన దేశం అందించిన గొప్ప వరం యోగా అని కీర్తించారు. ప్రస్తుత జీవనశైలికి, సమస్యలకు యోగాచక్కని పరిష్కార మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలు అంతర్జాతీయ వేదికపై మరోసారి ఇనుమడింప జేసిందన్నారు. ఇదొక చారిత్రాత్మక విజయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్, సహచర మంత్రులు, అధికార యంత్రాంగం, ప్రజలతో కలిసి యోగా వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సింగయ్య మృతి దృశ్యాలు భయానకం: షర్మిల

**విజయవాడ,జూన్22,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి వాహనం కింద పడి సింగయ్య నలిగిపోయిన దృశ్యాలు భయానకమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. ఒళ్ళు గగుర్పొడిచేలా ఈ ఘటన ఉందన్నారు. ఆదివారం పీసీసీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో ఈ ఘటనకు జగన్ బాధ్యత వహించాలన్నారు. కారు కింద ఒక వ్యక్తి పడ్డారన్న సోయి లేకుండా కాన్వాయ్ కొనసాగడం ఏంటి ? 100 మందికి పర్మిషన్ ఇస్తే వేల మంది ముందు సైడ్ బోర్డు మీద నిలబడి జగన్ గారు చేతులూపడం ఏంటి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు మీకు ఎవరిచ్చారు ? బెట్టింగ్ లో ఓడిపోయి సూసైడ్ చేసుకున్న వ్యక్తి విగ్రహ ఆవిష్కరణకు ఇద్దరిని బలి ఇస్తారా ? ఇదేం రాజకీయం ? ఇదెక్కడి రాక్షస ఆనందం ? మీ ఉనికి కోసం జనాలను టైర్ల కింద తొక్కుకుంటూ పోతారా? ప్రజల ప్రాణాల మీద శవ రాజకీయాలు చేస్తారా ? కార్ సైడ్ బోర్డ్ మీద నిలబడి ఒక నాయకుడిగా కాన్వాయ్ మూవ్ చేయించడం సబబేనా? ఇది పూర్తిగా జగన్ గారి బాధ్యత రాహిత్యాని అద్దం పడుతుంది. బలప్రదర్శన చేసి సింగయ్య మృతికి కారణమైన జగన్ 100 మందికి అనుమతి ఇచ్చి వేల మందితో



వచ్చినా దగ్గరుండి మరి చోద్యం చూసిన కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి. పర్మిషన్‌కి విరుద్ధంగా జన సమీకరణ జరుగుతుంటే పోలీసులు ఎలా సహకరించారు? ఎందుకు ప్రేక్షక పాత్ర వహించారు ? ఎందుకు ఇంటలిజెన్స్ వ్యవస్థను నిద్రపుచ్చారు ? ప్రజా సమస్యలపై పోరాడితే ఆంక్షలన్నీ కాంగ్రెస్ పార్టీకేనా? కాంగ్రెస్ చేసే ఉద్యమాలకు, ధర్నాలకు హౌజ్ అరెస్ట్ లు చేస్తారు. దీక్షలను భగ్నం చేస్తారు. ర్యాలీలను తొక్కిపెట్టి మా గొంతు నొక్కుతారు. వైసీపీ చేసిన బలప్రదర్శనలకు, హత్యలకు జగన్ ఏం సమాధానం ఇస్తారు ? కూటమి ప్రభుత్వం ఏం సమాధానం చెప్తుంది ? ఏం చర్యలు తీసుకుంటున్నారు ? అంటూ ప్రశ్నించారు.,కార్ సైడ్ బోర్డ్ మీద నిలబడి ఒక నాయకుడిగా కాన్వాయ్ మూవ్ చేయించడం సబబేనా? అన్నారు. ఇది పూర్తిగా వైఎస్ జగన్ బాధ్యతరాహిత్యానికి అద్దం పడుతుందని పేర్కొన్నారు. బలప్రదర్శన చేసి సింగయ్య మృతికి కారణమైన జగన్‌తోపాటు వంద మందికి అనుమతి ఇచ్చి వేల మందితో వచ్చినా దగ్గరుండి మరి చోద్యం చూసిన కూటమి ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యత వహిం చాల్సి ఉందని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. పర్మిషన్‌కి విరుద్ధంగా జన సమీకరణ జరుగుతుంటే పోలీసులు ఎలా సహకరించారని సందేహం వ్యక్తం చేశారు. వారు ఎందుకు ప్రేక్షక పాత్ర వహించారని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థను ఎందుకు నిద్రపుచ్చారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడితే.. ఆంక్షలన్నీ కాంగ్రెస్ పార్టీకేనా? అంటూ ఆవేదన చెందారు. కాంగ్రెస్ పార్టీ చేసే ఉద్యమాలకు, ధర్నాలకు హౌస్ అరెస్టులు చేస్తారన్నారన్నారు. అలాగే తమ పార్టీ చేసే దీక్షలను భగ్నం చేస్తారని.. ఆ క్రమంలో ర్యాలీలను తొక్కిపెట్టి మా గొంతు నొక్కుతారని వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ చేసిన బలప్రదర్శనలకు, హత్యలకు వైఎస్ జగన్ ఏం సమాధానం ఇస్తారన్నారు.

# అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు తీవ్ర అవమానం

### కింద కూర్చుని విధులు నిర్వహిస్తున్న వైనం

**తిరుపతి విద్య, జూన్ 22 ప్రభాతవార్త:** తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న రవివర్మ సెలవుపై వెళ్లి శనివారం విధులకు వచ్చారు. తన ఛాంబర్లోకి వెళ్లిచూడగా టేబుల్, కుర్చీలు తొలగించి ఉండటం చూసి ఒక్కసారిగా కంగుతిన్నారు. దీనిపై కళాశాల సిబ్బందితో ఆరా తీయగా ప్రిన్సిపాల్ తొలగించారని చెప్పారు. దీంతో నేలపై కూర్చుని తన విధులను నిర్వర్తించారు. కళాశాల విద్యా ర్థుల ముందు తనను అవమానించడంతో ఆయన మనస్తాపానికి గురై వీసీకి ఫిర్యాదు చేశారు.

**దళితుడనే కారణంతోనే నన్ను వేధిస్తున్నారు:** ఈ ఘటనపై బాధితుడు రవివర్మ మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో ఎస్సీ ఉద్యోగులపై ఓవర్గం అరాచకాలకు పాల్పడుతోంది అని, డెయిరీ కళాశాలలో ఎనిమిదేళ్లుగా అసిస్టెంట్



ప్రొఫెసర్ గా పని చేస్తున్నాను అని, ఇక్కడ రాజకీయాలు, వర్గపోరు తారా స్థాయిలో రాజ్యమే ఏలుతున్నాయి. దళితులను అగ్రవర్ణ కులాల అధ్యాపకులు వేధించడం పరిపాటిగా మారింది. పలుమార్లు డెయిరీ కళాశాల ప్రిన్సి పాల్ నన్ను ఎన్నో సార్లు అవమానిస్తూ వచ్చినా భరించాను. దళితుడిననే కారణంతో మానసికంగా కూడా ఇబ్బందులకు గురిచేశారు. శనివారం అకారణంగా నాచాంబర్ లోకి వచ్చి టేబుల్, కుర్చీలను తొలగించారు. కంప్యూటర్, ప్రింటర్, ఫైల్స్ ను చెల్లాచెదురుగా కింద పడేసి వెళ్లారు. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ ను ప్రశ్నించగా పట్టించుకోకుండా సమాధానం దాటవేశారు. దీంతో వీసీ ని కలిసి ఫిర్యాదు చేశాను. వీసీ నా ఛాంబర్ లోకి వచ్చి పరిస్థితిని గమనించి ప్రిన్సిపాల్ ను వివరణ కోరేందుకు ఫోన్చేయగా ఆయన వీసీ కాల్కు సైతం సరైన సమాధానం ఇవ్వలేదుఖిఅని చెప్పారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం అని వీసి రమణ తెలిపారు. ఈ విషయం పైన పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సం ఘాలు వామపక్ష పార్టీ నాయకులు.

# అనంతలో ఆర్డీటీకి అండగా క్రికెటర్ల భారీ ర్యాలీ

### కేంద్రం వెంటనే ఎఫ్.సి.ఆర్.ఏ పునరుద్ధరణ చేయాలని నేతల డిమాండ్

**అనంతపురం, జూన్ 22 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో ఉమ్మడి అనంతపురం జిల్లా క్రికెటర్ల ఆధ్వర్యంలో గత 55 సంవత్సరాలుగా అనంతపురం జిల్లాలో విశిష్ట సేవలు అందించిన రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)కీ మద్దతుగా ఆదివారం పెద్ద ఎత్తున భారీ ర్యాలీని నిర్వహించారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అనంతపురం జిల్లాలోని సీనియర్ క్రికెటర్లు ఆర్డిటి కోసం నగర వీధుల్లో కదం తొక్కారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యువ క్రికెటర్లు అసోసియేషన్ సభ్యులు, మాజీ రంజీ క్రీడాకారులు, ప్రస్తుత రంజీ క్రీడాకారులు, మహిళా క్రికెటర్లు పెద్ద ఎత్తున పాల్గొని సేవ్ ఆర్డిటి అంటూ నినాదాలు చేస్తూ అనంతపురం నగరాన్ని హోరెత్తించారు. జిల్లా క్రికెటర్ల ర్యాలీ అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ దగ్గర ప్రారంభమై కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఉన్న విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వద్ద సభ అనంతరం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్డిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆర్డిటికీ అన్ని విధాలుగా క్రికెటర్లందరు తోడుగా ఉంటామని వారి సేవలు జిల్లాలో కొనసాగాలని డిమాండ్ చేశారు . జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పగడాల మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో గత 50 సంవత్సరాలు పైగా ఆర్డిటి అన్ని వర్గాల ప్రజలకు సేవ చేసిందని ఇప్పుడు కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆర్డిటికీ అండగా ఉంటూ జిల్లాలో ఆర్డీటీ కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి




చేశారు. సభాధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ కేంద్రం వెంటనే ఆర్డీటీ సంస్థకు ఎఫ్.సి.ఆర్.ఏ పునరుద్ధరణ చేయాలని ఆర్డీటీకి అండగా నిలుదాం ర్యాలీను విజయవంతం చేసినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాబోవు రోజుల్లో మరిన్ని ర్యాలీలు సీనియర్ క్రికెటర్లు నిర్వహిస్తారని ఆర్డిటి జిల్లాలో పని చేసేంతవరకు మా పోరాటం కొనసాగుతుందని జిల్లాలోని సీనియర్ క్రికెటర్లు అందరూ సహకరించాలనీ.ఆయన కోరారు. ఐపీఎల్ క్రీడాకారుడు విజయకుమార్ మాట్లాడుతూ ఆర్డిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి భీమలింగారెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డి, షాబుద్దీన్, ప్రసాద్ రెడ్డి, రంజి క్రికెటర్లు సురేష్ తదితరులు సభలో మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్డిటికీ ఎఫ్ సి ఆర్ ఏ అనుమతులు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు మాజీ సెక్రటరీ శ్రీనివాసులు, కమలాకర్ నాయుడు, సీతారామారావు రవీంద్రనాథ్ చంద్రమోహన్ రెడ్డి మాజీ రంజీ క్రికెటర్లు ఫయాజ్, షాషావలి, మురళి, సర్దార్, సాగర్, విజయ్ రాజు, దాదా కలందర్, సాదిక్ తదితర క్రికెటర్లు పాల్గొన్నారు. ర్యాలీ కి ముందు ప్రస్తుతం సీనియర్ ఆడుతున్న రంజి క్రికెటర్లు వినయ్ కుమార్, మచ్చా దత్త రెడ్డి, వీరారెడ్డి దీపక్ ర్యాలీ ముందు భాగంలో ఉంటూ ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వరకు పాల్గొని యువ క్రికెటర్లకు స్ఫూర్తినింపారు .ఆర్డీటీకి అండగా నిలుదాం ర్యాలీ ఆదివారం ఉదయం క్లాక్ టవర్ దగ్గర గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించారు ఈ ర్యాలీ టవర్ క్లాక్ నుంచి ప్రారంభమైంది సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జి, సంగమేష్ సర్కిల్ కలెక్టర్ కార్యాలయం మీదుగా కలెక్టర్ కార్యాలయం విన్సెంట్ ఫెర్రర్ విగ్రహం వరకు కొనసాగింది.

# ఫలితాలు ఎందుకు విడుదల చేయలేదో చెప్పండి: హైకోర్టు

### నేడు కోర్టుకు హాజరు కావాలని ఏఎన్‌యు రిజిస్ట్రార్‌కు ఆదేశం

**విజయవాడ జూన్ 22 ప్రభాతవార్త ప్రతినిధి:** డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు అఫిలియేషన్ రుసుము, ఇతర ఫీజులను చెల్లించలేదన్న కారణంతో విద్యార్థుల పరీక్ష ఫలితాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిలుపుదల చేయడంపై హైకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. సోమవారం విచారణకు హాజరుకావాలని ఏఎన్‌యు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలను ప్రకటించకపోవడాన్ని సవాలు చేస్తూ ప్రకాశం జిల్లా కార్తికేయ డిగ్రీ కళాశాల యాజమాన్యం, మరికొన్ని కళాశాలలు హైకోర్టును ఆశ్రయించాయి.

# మాజీ మంత్రి అంబటిపై పోలీసులు పలు కేసులు

**విజయవాడ,జూన్22,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై పోలీసులు పలు కేసులు నమోదుచేశారు. ఆ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటనలో అంబటి నిషేధాజ్ఞలను ఉల్లంఘించారనే ఆరోపణలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు నల్లపాడు, పాత గుంటూరు పోలీసు స్టేషన్లలో ఆయనతోపాటు మరికొందరు వైకాంగ్రెస్‌పార్టీ నాయకులపై ఎఫ్ఐఆర్ నమోదైంది. సత్తెనపల్లి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో అంబటిపై మరో కేసు నమోదైంది. జగన్ పర్యటనలో భాగంగా కొర్రపాడు వద్ద అంబటి, ఆయన సోదరుడు మురళితో కలిసి గందరగోళం సష్టించారని, అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి, విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారని, వారించేందుకు ప్రయత్నించిన పోలీసు సిబ్బందిని అంబటి నెట్టివేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి పాల్పడ్డారనే అభియోగాలపై భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్లు 188 (ప్రభుత్వాధికారి జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘించడం), 332 (ప్రభుత్వోద్యోగివిధులకు ఆటంకం కలిగించడం), 353 (ప్రభుత్వోద్యోగిపై దాడి లేదా నేరపూరిత బలప్రయోగం), 427 (ఆస్తి నష్టం కలిగించడం) కింద సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రైల్వే గ్రూప్-డి పోస్టులకు 1.08కోట్ల దరఖాస్తులు

### ఖాళీల సంఖ్య కేవలం 32,438మాత్రమే

### ఒక్కో పోస్టుకు సగటున 772మంది అభ్యర్థుల పోటీ

### పదవ తరగతి అర్హత గల పోస్టులకు పోటీ పడుతున్న పిహెచ్‌డి స్కాలర్లు, యూపిఎస్‌సి ఆశావహులు సహా

**గుంతకల్లు రైల్వే, జూన్ 22,ప్రభాతవార్త:** కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖలో లీస్ట్ కేటగిరీ అయిన లెవెల్-1 గ్రూప్-డి క్యాడర్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల సంఖ్యను బట్టి చూస్తే పోటీ తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. పదవ తరగతి, ఐటిఐ కనీస విద్యార్హతలు గల గ్రూప్-డి క్యాడర్ నియామకాలకు పిహెచ్‌డి స్కాలర్‌లు, యూపిఎస్‌సి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న ఆశావాహులైన అభ్యర్థులు సైతం దరఖాస్తులు చేయడం విస్మయాన్ని గురి చేస్తోంది. దేశవ్యాప్తంగా రైల్వే జోన్‌లలో ట్రాక్ మెయింటైనర్(గ్యాంగ్ మెన్),ట్రాక్ మిషన్, ట్రాక్షన్,పిడబ్ల్యూఐ, బ్రిడ్జి,సిఅండడబ్ల్యూ తదితర విభాగాలలో (గ్రూపు-డి క్యాడర్‌లో) 32,438పోస్టులను భర్తీకై ఆర్‌ఆర్‌బిల ద్వారా గ్రూప్-డి నియామకాలను చేపట్టేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ ఈ ఏడాది జనవరి 22న సెంటలైజ్డ్ ఎంప్లాయిమెంట్ నోటిఫికేషన్ జారీ చేసింది. రైల్వేలో లెవెల్-1కేటగిరి గల ఈ పోస్టులకు కనీస విద్యార్హతగా పదవ తరగతి,ఐటిఐ లేదా ఎన్‌సివిటి జారీ చేసిన జాతీయ అప్రెంటీస్ సర్టిఫికేట్ గల అభ్యర్థులు మాత్రమే అర్హులని రైల్వే శాఖ తన నోటిఫికేషన్(పేరా నెంబర్ 6.0అన్నెగ్జర్-ఎ)లో క్లియర్‌గా పేర్కొంది. అలాగే 6.0(సి) పేరాలో డిప్లొమా,ఇంజనీరింగ్,ఎంబిఎ, ఎంసిఎ,లా వంటి ఉన్నత చదువులు చదువుకున్న విద్యావంతులు సైతం గ్రూప్-డి పోటీలకు భారీగా దరఖాస్తు చేసుకోవడంతో పోటీ తీవ్రంగా నెలకొంది. రైల్వేలో దేశవ్యాప్తంగా మొత్తం ఖాళీల సంఖ్య 32,438ఉండగా, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య మాత్రం 1,08,22,423మంది. ఒక్కో పోస్టుకు 772మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

# చంద్రబాబు అనుభవంతో గాడిలో ఆర్థికవ్యవస్థ: మంత్రి నారాయణ

**నెల్లూరు, జూన్ 22, ప్రభాతవార్త-వైద్యం:** నెల్లూరు ములుముడి బస్టాండ్ సెంటర్‌లో రూ.15లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్లకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శంకుస్థాపన చేశారు. డివిజన్‌కు విచ్చేసిన మంత్రికి మహిళలు పూల వర్షం, కురిపిస్తూ, బాణ సంచాలు మంగళవాయిద్యాలతో మంత్రికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. తమ ప్రాంతానికి వచ్చిన మంత్రికి మార్వాడి మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. అభివృద్ధి ప్రదాతకు జేజే లంటూ నినాదాలు హోరెత్తించారు. అనంతరం వారందరితో కలిసి సీసీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ రోడ్డు శంకుస్థాపనకు వచ్చిన తనకు ఇక్కడి వారి చూపిస్తున్న అభిమానం ఎన్నటికి మరువలేనన్నారు. నేడు శంకుస్థాపన చేస్తున్న ఈ రోడ్డును మరో నెల రోజుల్లో ప్రారంభోత్సవం చేస్తానని హామీ ఇచ్చారు. 2014లోనే మంత్రిగా 5250 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించానని గుర్తు చేశారు. 80 శాతం పనులు కూడా అయిపోయాయన్నారు. అయితే వాటిని గత ప్రభుత్వం తమపై అక్కసుతో ఆపేసిందని మండిపడ్డారు. దాంతో పాటు ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని ఎద్దేవ చేశారు. ప్రజలు కట్టిన పన్నులను



కూడా దారి మళ్లించారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ చేతకాని పరిపాలనతో రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకొందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు అపార అనుభంతో ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందని మంత్రి భరోసా ఇచ్చారు. హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు, డివిజన్ ఇన్‌ఛార్జీ ధర్మవరం గణేష్, 47వ డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణ, టీడీపీ నేతలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వార్త

మనిషి తన ధనాన్ని బుర్రగా మార్చుకుంటే దాన్నెవరూ తస్కరించలేరు. జ్ఞానంపై పెట్టిన పెట్టుబడి ఎల్లప్పుడూ మంచి వడ్డీనే ఇస్తుంది.

న-అరిస్టాటిల్

# మాటల్లోనే 'శాంతి'!

ప్రస్తుత సారథ్యనేత ట్రంప్ ఉన్నట్టుండి ఇప్పుడిప్పుడు నోబెల్ గ్రహీతల్లోపోవాలను కుంటున్నట్లుంది. ఒక పక్క ఇరాన్ అణ్వస్త్ర కేంద్రాలపై భీకర దాడులు ప్రారంభిస్తూనే శాంతి ప్రవచనాలు పలుకుతూ, శాంతిదూతగా అవార్డులు పొందాలనుకుంటున్నారు. ఒక పక్క అణ్వస్త్ర దాడికి మేం వ్యతిరేకమంటూనే ఇరాన్‌కు ఉన్న మూడే మూడు నంతాజ్, ఇస్ఫహాన్, ఫోర్డో అణు కేంద్రాలపైకి అమెరికా దూకుడు ప్రారంభించి చింది. ఎదుటివారిలో వైషమ్యాలు లేకుండా దౌత్యనీతితో పరిష్కరించుకొని శాంతి మంత్రం పఠించడం, శాంతి కోసం కృషి చేయడం శాంతికి మార్గ మని అనుకోవడం సహజం. కానీ ప్రత్యర్థి అణ్వస్త్ర కేంద్రాలను నాశనం చేయడం ద్వారా శాంతికి మార్గం ఏర్పడుతుందని నమ్మి శాంతిదూతగా ట్రంప్ మిగిలి పోయారు. ఇలా 'శాంతికి కొత్త నిర్వచనం చెబుతున్నా రన్నమాటేగా! మూడో ప్రపంచ యుద్ధం అనే ప్రస్తావన లేకుండానే అగ్రదేశాలు తమకు నచ్చిన, తాము మెచ్చే దేశాలకు అండదండలుగా ఉంటూ, వారి ప్రత్యర్థులను హతం చేసే పనుల్లో చేయూత నందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సమయంలో మూడో ప్రపంచ యుద్ధం మూకుమ్మడిగా రానక్కర్లేదు. ఆదిలో కొన్ని సమూహాలు తలపడితే , వెను వెంటనే మిగిలిన దేశాలు వారి ఇచ్ఛ మేరకు వచ్చి కలుస్తాయి. ఇదోరకం యుద్ధ తంత్రం.కానీ అమెరికా ఏకపక్షంగా యుద్ధానికి ఉరకలు వేస్తుంది. ఇరాన్‌తో తన చమురు వాణిజ్య బంధాలను నిలబెట్టుకునే రీతిలో చైనా ఆయుధ సంపత్తిని సమకూరుస్తోంది. ప్రాంతీయ ఆధిపత్యాల కోసం ఈ యుద్ధం పర్యవసానం ఊహించడం కష్టమే మరి!. ఇరాన్ లొంగిరాకపోతే నేరుగా యుద్ధమే శరణ్యమని, ఖోమైనీ తల ఎగిరిపోతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిస్తే, అమెరికా జోక్యం చేసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్ ప్రతి హెచ్చరికలు చేసుకుం టున్నాయి. తాను యుద్ధానికి తెగబడుతూనే శాంతి నెలకొల్పడం ఇరాన్ చేతిలోనే ఉందని ట్రంప్ ఒకటికి పదిసార్లు వేదికల మీద బహిరంగాంగానే ప్రకటించారు. తాజాగా అమెరికా మాత్రమే చేయగలదన్న సాహసాన్ని ట్రంప్ అమల్లోకి తెచ్చేసారు. బంకర్ బ్లస్టర్ బాంబులతో దాడి మొదలు పెట్టి ఇరాన్‌కు అణ్వాయుధ తయారీకి ఏమాత్రం అవకాశం లేకుండా దెబ్బతీసారు. ఇరాన్‌పై ఇలాంటి హింసాత్మక దాడిని ట్రంప్ చరిత్రాత్మకంగా ప్రకటించుకోవడం విశేషం. విభిన్నమైన పరిస్థితుల మధ్య ట్రంప్ ప్రపంచానికే పెద్దన్న పాత్ర వహించాల్సి ఉండగా, కేవలం ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహుకి మాత్రమే అగ్రజుని పాత్ర పోషించారు. భారత్ పాకిస్థాన్ ల మధ్య కుదిరిన కాల్పుల ఒప్పందానికి తానే మధ్యవర్తినని ప్రకటించుకుని, ఆ మాత్రం దానికే నోబెల్ అవార్డుకు పాకిస్తాన్ నుంచి ప్రతిపాదన చేయించుకొని గరిగారు. అదే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య శాంతి జపమే లేకుండానే భీకర దాడులకు పురికొల్పారు. అణుయుద్ధం రాకూడదంటూనే మరో భిన్నమైన విచిత్రమైన ఆలోచనకు ట్రంప్ శ్రీకారం చుట్టారు. మరోసారి తూచ్.. భారత్ పాక్‌ల మధ్య కాల్పుల విరమణ తనదేనే మధ్యవర్తిత్వ పాత్ర ఏమీ లేదంటూనే దానిని పురస్క రించుకుని తనకు నోబెల్ బహుమతి రావాలని కలలు కంటున్నారు. ఇదేమీ మాట తడబాటు కాదు. లేనిపోని పెద్దరికాన్ని తెచ్చిపెట్టుకోవడం. ఇదే సందర్భంగా నెటిజన్లు ట్రంప్‌కు తలంటే పనిలో పడ్డారు. భారత్ -పాక్ మధ్యవర్తిత్వం అంటూ ఇక చెప్పుకునే పరిస్థితి లేక భారత్ ప్రధాని హెచ్చరికతో 'యూ టర్న్'కు దిగిన ట్రంప్‌కు ఈ క్రెడిట్ పోయినట్లే. ఇక ఇరాన్ ఇజ్రాయెల్ లలో ఓ వర్గాన్ని బెదిరించి లొంగదీసుకోవాలన్న ట్రంప్ పాచిక పారలేదు. పైగా తొందరపాటు నిర్ణయంతో ఇరాన్‌పై దాడులకు దిగినందున ఈ యుద్ధాన్ని కూడా తన శాంతి సందేశాల ఖాతాలో వేసుకోవడం కుదిరే పనికాదు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడమూ, లేని విషయాలను, విజయాలకు తనకు అపాదించుకుని గర్వించడమంటే – అవేమీ నోబెల్ బహుమతికి ప్రాతిపదికలు కాదు. అందుకేనేమో! ఈ ప్రతిష్టాత్మక బహుమతి తనకు రాసిపెట్టి లేదేమోనని నిర్వేదం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. పైగా దశాబ్దాలుగా యుద్ధరంగంలో తలపడుతున్న కాంగో, రువాండాల మధ్య శాంతిని నెలకొల్పేందుకు యత్నిస్తు న్నట్లు చెప్పుకున్నారు. సెర్బియా, కొసావో మధ్య ఘర్షణలకు చరమ గీతం పాడేసానని, ఈజిప్టు, ఇథియో పియాల మధ్య శాంతి కొనసాగుతోందని ఐనా,నోబెల్ తన శాంతి ప్రయత్నాన్ని గుర్తిస్తుందో లేదోనన్న ఆవేదన వ్యక్తం చేశారు. ట్రంప్ తన రాజనీతిజ్ఞతలో, వ్యూహాత్మక ముందుచూపులో వ్యవహరించి భారత్‌లో దౌత్యపర చర్చలు జరిపారని రెండు అణ్వస్త్ర దేశాల మధ్య ఘర్షణ తీవ్రరూపం దాల్చకుండా చూపిన శాంతిప్రియుడు ఐనందున నోబెల్ పురస్కారం ఇవ్వాలని పాకిస్థాన్ ప్రతి పాదించింది. ట్రంప్‌లోని ఆకాంక్షలను నెరవేర్చేందుకు మునీర్ నడుం కట్టినందునే మునీర్‌ను ట్రంప్ ప్రశం సలతో ముంచెత్తారు. పాకిస్థాన్ ప్రతిపాదన దురదృష్టక రమని, ఐరాసలో పాక్ రాయబారిగా పనిచేసిన మలీ హాలోధి విమర్శించారు. ఇదెంతో దయనీయమైన ప్రతి పాదన అని పాకిస్థాన్ జర్నలిస్టు జాహిద్ హుస్సేన్ గొంతెత్తారు. ప్రపంచ శాంతికి కృషి చేసే వారికిచ్చే నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ కివ్వాలని ప్రతిపాదిం చడంలో పాక్ వివేకమేమిటో తేటతెల్లమౌతోంది!.

సజ్జనుడు కిందపడ్డప్పటికీ బంతిలా మళ్లీ పైకి లేస్తాడు. మూర్ఖుడు కిందపడితే మట్టి ముద్దలా లేవలేక అణగిపోతాడు.



వివేకానందుడు

ఆత్మవిశ్వాసంతో కృషి చేసే మనిషి అందుకోలేని శిఖరాలు లేవు.



ఆస్కార్‌వైల్డ్

# జి-7 సమ్మిట్‌లో భారత్ పాల్గొనటం అవసరమా?

**అసలు భారత్‌ను కెనడా ప్రభుత్వం ఆహ్వానిస్తుందా లేదా అన్న మీమాంస సమ్మిట్ ప్రారంభం కాకముందు జరిగినా ఎట్టకేలకు చివరి నిముషంలో ప్రధా నిని సమావేశానికి స్వాగతించటం జరిగింది. కెనడా కొత్త ప్రధానిని కలవటం ఒక్కటే మంచి పరిణామం అనుకోవాలి. అంతేకానీ ఖలిస్థాన్ ఉగ్రవాదం భారత్‌కు వ్యతిరేకంగాకెనడా దేశంలో ప్రభుత్వ తోడ్పాటుతో జరుగుతున్నప్పుడు కనీసం ప్రధాని మోడీ ఇలాంటి ఉద్యమాలను సమర్థించకూడదని కెనడా ప్రభుత్వం దృష్టికి తెచ్చినా ఎలాంటి చర్యలు తలపెట్టకపోవడంతో భారత్ దేశానికి ఈ సమ్మిట్‌లో పాల్గొనటం వల్ల ఒరిగిందేమీటన్న ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. ఇలాంటి పరిస్థితులలో భారతదేశం జి-7 సమ్మిట్స్‌లో ముందు ముందు పాల్గొనే విషయాన్ని కూడా సమీక్షించుకొని సరైన నిర్ణయం తీసుకోక తప్పదేమో.**



రావులపాటి సీతారాంరావు

ప్రధానమంత్రి మోడీ దాదాపు 11000 కిలో మీటర్లు ప్రయాణం చేసి జి-7 సమ్మిట్ కెనాడా దేశంలోని కానన్‌స్కీలో పాల్గొన్నారు. ఈ సమ్మిట్ ఫలితాలు మాత్రం నిరాశాజనకంగా ఉన్నాయి. అంతర్జాతీయ సమావేశాలు కొన్ని దేశాలు గ్రూప్‌లుగా ఏర్పడి గత కాలంలో జరుపుకున్నప్పుడు ఫలితాలు, ఆ సమావేశాల్లో పాల్గొన్న దేశాలకు సంతృప్తిని కలిగించేవి. గ్లోబల్ పరిధిలో కూడా లాభాలు సమకూర్చేవి. చాలా సంవత్సరాల క్రిందట ఇండియా సారథ్యంలో అలీన దేశాల సమావేశాలు దేశాల మధ్య సంఘర్షణలను, చిన్నచిన్న విభేదాలనూ సరిదిద్దే ప్రయత్నంలో చాలా వరకు మంచి ఫలితాలనే దేశాలకు లాభాలను చేకూర్చే విధంగా పొందటం చరిత్ర గమనంలో రికార్డు అయ్యే ఉంది. కోల్డ్‌వార్ రోజుల్లో కూడా అమెరికా, రష్యా ల్లాంటి అగ్రదేశాల మధ్య రాజుకున్న నిప్పురవ్వలపై నీళ్ల జల్లి ఎంతో కొంత ఉపశమనానికి ఈ సమావేశాలు తోడ్పడేవి. ప్రస్తుతం యు.యన్.ఓ కానీ, యు.యన్. సెక్యూరిటీ కౌన్సిల్ గాని మొక్కుబడిగా దేశాల మధ్య ఏర్పడుతున్న విభేదాలను తొలగించటంలో ప్రయత్నాలు జరుపుతున్నప్పటికిని ఫలితాలు మాత్రం శూన్యంగా మిగిలిపోవటం గమనార్హం. ఇదంతా ప్రస్తుతం ఎందుకు చర్చించుకోవాల్సి వస్తున్నదంటే ఆర్భాటంగా జరిగిన కెనడాలోని మొన్నటి జి-7 సమ్మిట్ చేసిందేమీ లేదు అని చెప్పటానికే.ఈ మధ్య కాలంలో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం, ఇండియా,పాకిస్థాన్‌ల మధ్య పహల్గాం నేపథ్యంలో జరిగిన సంఘర్షణలూ, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య జరుగుతున్న ప్రపంచ యుద్ధాన్ని తలపించేటట్లు ఉన్న నిత్య సంఘర్షణల వైనం, పర్యావలోకనం చేసుకుంటున్నప్పుడు మరో ప్రపంచయుద్ధానికీ, ఈ సంఘర్షణలు దారితీస్తున్నాయా అన్న అనుమానానికి తావిస్తున్నాయి. జి-7 గ్రూప్‌లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యు.కెతోపాటు అమెరికా దేశాలు ఉన్నాయి. ఇది ఒక విధంగా రాజకీయ, ఆర్థిక విధానాల సమీక్షకూ, సర్దుబాట్లకు ఏర్పాటయిన సమ్మిట్. యూరోపియన్ యూనియన్ కూడా ఈ సమావేశాలకు, ఇండియాతోపాటు ప్రత్యేక



ఆహ్వానం మేరకు హాజరు అవుతుండటం విశేషం. కెనడా, ఇండియాల మధ్య నిజ్జార్ కేసు విషయంలో తలెత్తిన విభేదాలు, ప్రధాని మోడీ ప్రత్యేకంగా కెనడా కొత్త ప్రధాని మార్క్‌కార్నీని కలిసి చర్చించటానికి తోడ్పడ్డాయి. ఇండియా, కెనడా హైకమిషనర్లను మళ్లీ నెలకొల్పటానికి ఈ సమావేశం ఉపయోగపడింది. కానీ కెనడా ప్రభుత్వం ఖలిస్థాన్ ఉద్యమకారులు, భారతదేశానికి వ్యతిరేకంగా చేస్తున్న విద్రోహ చర్యలు అణచివేసే విషయంలో ఎలాంటి చొరవ చూపకపోవడం ఒక రకంగా అసంతృప్తిని మనదేశానికి కలిగించిన వాస్తవాన్ని కప్పిపుచ్చలేం. గ్లోబల్ ట్రేడ్‌ను అతలాకుతలం చేస్తున్న ట్రంప్ ప్రభుత్వం టారిఫ్ విధానాలను ఈ సమ్మిట్ సరిచేయలేకపోయింది. డోనాల్డ్ ట్రంప్, రష్యా, చైనాల విషయంలో దౌత్యపరంగా అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరితో పాటు ఉక్రెయిన్ గనులను ఆక్రమించుకొనే ఎత్తుగడలను ఎత్తిచూపలేకపోయింది. చైనా అవకాశవాదాన్ని, పాకిస్థాన్‌ను ఏకపక్షంగా సమర్థించే వైఖరి విషయంలో కూడా ఎలాంటి చర్య కానీ, రిజల్యూషన్ ద్వారా తప్పు పట్టటం కానీ జి-7 సమ్మిట్ చేయలేకపోయింది. అంతెందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యలోనే సమావేశాన్ని వదిలి వెళ్లటం కానీ, ఏకగ్రీవ తీర్మానాన్ని త్రోసి పుచ్చి సంతకం చేయకుండా నిష్క్రమించటాన్ని ఈ సమ్మిట్‌లో పాల్గొన్న అగ్రదేశాలు ఆపలేకపోయాయి. పేరుకు అగ్రరాజ్యాల సమ్మిట్ కానీ నిష్క్రియాపర్వానికి మాత్రమే మరొకసారి ఈ సమావేశం తెరతీసినట్లయింది. తూతూ మంత్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, క్రిటికల్ మినరల్ సప్లయి చైన్స్, వైల్డ్‌ఫైర్ ప్రివెన్షన్, ట్రాన్స్‌నేషనల్ రిప్రెషన్ లాంటి విషయాల్లోనే, జాయింట్ స్టేట్‌మెంట్ లేకుండా చైర్స్ సమ్మరీ పేరుతో ఒక ప్రకటన మాత్రమే ఈ సమ్మిట్ వెలువరించింది. అంతెందుకు టెర్రరిజం విషయంలో కూడా భారత్ ఆశించినట్లు బహిరంగ సమర్థన చేయలేకపోయింది.ఇలాంటి నేపథ్యంలో భారత్ ఈ సమ్మిట్‌లో మెంబర్ కాకపోయినా, ఆహ్వానించారని పాల్గొనటం, సమంజసమా అన్న చర్చ కూడా మొదలైంది. అసలు భారత్‌ను కెనడా ప్రభుత్వం ఆహ్వానిస్తుందా లేదా అన్న మీమాంస సమ్మిట్ ప్రారంభం కాకముందు జరిగినా ఎట్టకేలకు చివరి నిముషంలో ప్రధానిని సమావేశానికి స్వాగతించటం జరిగింది. కెనడా కొత్త ప్రధానిని కలవటం ఒక్కటే మంచి పరిణామం అనుకోవాలి. అంతేకానీ ఖలిస్థాన్ ఉగ్రవాదం భారత్‌కు వ్యతిరేకంగాకెనడా దేశంలో ప్రభుత్వ తోడ్పాటుతో జరుగుతున్నప్పుడు కనీసం ప్రధాని మోడీ ఇలాంటి ఉద్యమాలను సమర్థించకూడదని కెనడా ప్రభుత్వం దృష్టికి తెచ్చినా ఎలాంటి చర్యలు తలపెట్టకపోవడంతో భారత్ దేశానికి ఈ సమ్మిట్‌లో పాల్గొనటం వల్ల ఒరిగిందేమీటన్న ప్రశ్న ఉత్పన్నం కాకమానదు. ఇలాంటి పరిస్థితులలో భారతదేశం జి-7 సమ్మిట్స్‌లో ముందు ముందు పాల్గొనే విషయాన్ని కూడా సమీక్షించుకొని సరైన నిర్ణయం తీసుకోక తప్పదేమో.! ●

# కృత్రిమ మేధతో ప్రయోజనమా!సమస్యలా?

మేకిరి దామోదర్

మనిషి బుద్ధిజీవి,సృజన కారుడు కూడా. మనిషిలోని సుగుణాల్ని యంత్రానికి ఆపాదిస్తే.. యంత్రానికి వేగం ఎక్కువ, ఖచ్చితత్వమూ ఎక్కువే. అలా పరిమితంగా అయినా సరే, తెలివితేటలు జోడిస్తే? ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆలోచన ఇలా వచ్చింది. తనకు ఎదురైన అనుభవాలు, తనకున్న జ్ఞాపకాల ఆధారంగా మనిషి నిర్ణయాలు తీసుకుం టాడు. కానీ యంత్రానికి అనుభవాలు జ్ఞాపకాలు ఉండవు. 'డాటాయే సర్వస్వం'. ఎంత డాటా ఇవ్వగలిగితే, అంత ఖచ్చితత్వం సాధ్యం. అందులోనూ 'డీప్ లెర్నింగ్' టెక్నాల జీతో యంత్రాల విశ్లేషణ సామర్థ్యం బాగా పెరిగిపోయింది. నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్.. ఏ భాషనైనా చదివి అర్థం చేసుకునే శక్తినీ, ఏ గొంతు నైనా విని విషయాన్ని ఆకళింపు చేసుకోగలిగే నైపుణ్యాన్ని ప్రసాదించింది. కంప్యూటర్ విజన్ కు తోడు ఇంకో అడుగు ముందుకేసి ఏఐకి సహాయంగా కొత్తకొత్త టూల్స్ తయారు చేసుకుంది. ఇంకేముంది సాంకే తికత చేయలేని అద్భుతమంటూ ఉంటుందా!.ఇలా నేడు కృత్రిమ మేధ (ఏఐ) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భాగస్వా మ్యం ఎంతగానో పెరిగిపోతోంది!. ప్రస్తుతం ప్రపంచానికి ప్రయోజనమనీ కొందరు,ఇంకొందరు ప్రమాదమనీ భయపె డుతున్నారు. కృత్రిమ మేధ(ఏఐ) కొత్త అవకాశాలకుదారులు చూపుతున్న సాంకేతిక పరిజ్ఞానం. ఇది ఇప్పటికే పలు సంస్థ లకు సులువుగా పనిచేసి పెడుతూ, చాలామంది ఉద్యోగాల కు ఎసరు పెడుతుందని పలువురు గ్రాడ్యుయేట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఐ తమ ఉద్యోగ అవకాశాలను దెబ్బ తీస్తుందని, 70 శాతం మంది తమ అభిప్రాయాన్ని తెలి పారు. సీఎఫ్ఏ ఇన్స్టిట్యూట్ నిర్వహించిన శాంపిల్ సర్వేలో ఈ విషయం తేలింది. అలాగే మరికొందరు ఈ ఏఐ విష యంలో సానుకూల అభిప్రాయాన్ని వెల్లడించారు. ఏఐలేదా ఆటోమేషన్ టూల్స్‌లో నైపుణ్యం పొందడం ద్వారా తమ కెరీర్ అవకాశాలు మెరుగుపడటానికి దోహదం చేస్తుందని మరికొందరు అంటున్నారు. సీఎఫ్ఏ అనేది ప్రపంచ పెట్టుబడి నిప్పుల సంఘం. ఇది ఇటీవలే గ్లోబల్ గ్రాడ్యుయేట్ అవుట్ సర్వే 2025 విడుదల చేసింది. తొమ్మిదివేల మందికి పైగా తాజా గ్రాడ్యుయేట్ల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఈ నివేదిక ప్రకారం.. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత గ్రాడ్యుయేట్లలో ఏఐ ఆటోమేషన్ టూల్స్ భయం ఎక్కువగా కనబడుతుంది. ఇవి తాము కోరుకున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చాలా దెబ్బతీసే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 50శాతం మందికి పైగా తాము ఏఐను



ప్రభావితంగా ఉపయోగించగలమని విశ్వాసాన్ని వెల్లడించారు. సంబంధిత సాఫ్ట్‌స్కిల్స్‌ను కలిగి ఉండటమే కాకుండా ఏఐ నైపుణ్యాలు కలిగి ఉంటే ఉద్యోగ మార్కెట్లో మంచి అవకాశాలు లభిస్తాయని 56శాతం మంది విశ్వసిస్తున్నారు. ఏఐ కెరీర్‌లో స్థిరమైన వృద్ధి,ఆసక్తికరంగా స్థిరమైన ఎదుగుదల కనిపిస్తున్నది. గత ఏడాది ఇది 59 శాతం నుంచి ఈఏడాది 63శాతానికి పెరగటం గమనార్హం. "ఈ తరానికి ఏఐ ఇకపై కేవలం ఒక ఆప్షన్ కాదు. వృత్తిపరంగా ఎదుగుదలకు, సంబంధిత నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి దాని ప్రాముఖ్యతపై వారు అవగాహన కలిగి ఉన్నారు' అని భారత్ సీఎఫ్ఏ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సీనియర్ కంట్రీ హెడ్ అరాటి పోర్వాల్ అభిప్రాయపడ్డారు. గ్రాడ్యుయేట్లలో కెరీర్ ప్రాధాన్యతలకు సంబంధించి వరు సగా మూడేళ్లు ఆర్థిక రంగమే అగ్రస్థానంలో ఉన్నది. ఈ రంగంపై 38శాతం మంది చాలా విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఐటి 32 శాతం, విద్య 21శాతం వంటి రంగాలు ఉన్నాయి. 'కాలంతో పాటు ఆర్థిక రంగం అభివృద్ధి చెందుతోంది. ఈ కొత్త వెర్షన్‌లో, జనరేటివ్ ఏఐ బ్లాక్ చైన్ మొదలైన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి టెక్‌ఎనేబుల్డ్ ఫైనాన్స్‌పై దృష్టి కేంద్రీ కరించబడింది. ఈ అభివృద్ధి చెందుతున్న రంగానికి విద్యార్థులు సంబంధిత శిక్షణను పొందటం తప్పనిసరి అని డివై పాటిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చెప్పారు. 'గ్రాడ్యుయేషన్ పూర్తయినవెంటనే ఉద్యోగం కావాలి' కానీ తమ గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన వెంటనే తాము ఉద్యోగాన్ని కోల్పోతున్నట్టు 40 శాతం మంది గ్రాడ్యుయేట్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ వంటి సర్టిఫికేషన్లు కెరియర్ వృద్ధికి దోహదం చేస్తాయని 68శాతంమంది విశ్వ సించారు. సర్టిఫికేషన్ నేరుగా తమ ఉపాధి పొందే సామ ర్థ్యాన్ని ఆదాయాలను మెరుగుపరచాయని నివేదిక వివరిం చింది. ఏఐ అనేది కొంతమందికి ఆందోళనను, మరి కొంత మందికి కొత్త ఆశను కలిగిస్తున్నది. అయితే, ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం వినియోగించుకునే విధానాన్ని బట్టిదాని ఫలితాలు ఆధారపడి ఉంటాయని నిపుణులు మేధావులు చెప్తున్నారు. ఏఐ రాకతో పలు టెక్ కంపెనీలు తమ సంస్థల్లో ఉద్యోగులను తొలగిస్తున్నాయనీ, రాబోయే కాలంలో దాని ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశంఉన్నదని ఇప్పటికే పలు నివేదికలు హెచ్చరిస్తున్నాయి. కాబట్టి ఈ విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలనీ, ఏఐ విపరీత వినియోగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.అందుకే కొన్ని పరిమితులూ అవసరం. అలా అని ప్రయోజనం,ఇబ్బందులూ రెండింటిని ఎదుర్కోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు మేధోపరమైన సమస్యలు ఎదురుకావచ్చు, చట్టపరమైన తలనొప్పులు వచ్చినప్పుడు ఎవరిని బాధితుల్ని చేయాలనేది జవాబు లేని ప్రశ్న. ఈ కృత్రిమ మేధ అనే కాదు, ఏ పెనుమార్పు ఒంటరిగా రాదు. వస్తూ వస్తూ తన వెంట వివాదాలనూ, ప్రయోజనాలను మోసుకొస్తుంది. కొంత కాలానికి గొడవలు సద్దుమణుగుతాయి. మార్పు స్థిరపడిపోతుంది. ఏఐకి, కృత్రిమ మేధకు ఈ సూత్రమే వర్తిస్తోంది. ఏది ఏమైనా ఒక్కటి మాత్రం నిజం. మనిషిని మింగే శక్తి ఏ సాంకేతికతకూ లేదు. మనిషే కోరి కోరి ఆ టెక్నాలజీ నోట్లో తలపెడితే తప్పించి! ●

# ప్రజావాక్కు



## ఉచిత పథకాల కంటే ఉపాధి మేలు

**ఆంధ్రప్రదేశ్‌లో** కొన్ని రాజకీయ పార్టీలవారు లబ్ధి కోసం ప్రజలను మభ్యపెట్టి ఉచిత పథకాలను ప్రవేశపెట్టే పద్ధతిని అవలంబిస్తున్నారు. దీనివలన ప్రజలు ఈ ఉచిత పథకాలకు ఆకర్షితులై తమజీవనస్థితులకు దూరమైపోతున్నారు. అలాగే ఈ పథకాల వలన ప్రభుత్వం మేలు జరగడమే తప్ప ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదు. కావున ఈ ఉచిత పథకాలకు స్వస్తి చెప్పి ప్రజలకు ఉపయోగపడే పరిశ్రమ ఏర్పాటుచేసి, ఉపాధి అవకాశాలు వచ్చేటట్లుగా చేయడం, అలాగే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటివి కల్పిస్తే ప్రజలు పురోగ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయి. ఈ విషయాలపై ప్రభుత్వాలు పునరాలోచన చేస్తే బాగుంటుంది.

- కె. అన్నారావు, రాజాం, విజయనగరం

## యోగాసనాలు ఆరోగ్యానికి మంచివి

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రంలోవిశాఖపట్నంలో కొన్నిలక్షల మందితో శ్వేతవస్త్రాలు ధరించి పరిశుభ్రంగా కనిపిస్తూ దగదగా మెరిసిపోతూ కొన్నియోగాసనాలు భారతదేశ ప్రధాన మంత్రితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ప్రజలను భారతదేశ సనాతన సంప్రదాయాల పట్ల అంతరించిపోతున్న ఆచారాలుపట్ల సద్భావం కలిగేలా ఒక ప్రయత్నం చేస్తున్నారు. ఈ రోజుల్లో ప్రజలందరూ ఎన్ని ఉచితపథకాలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ, జబ్బులకోసం, వారి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసండబ్బులు సంపాదించడానికి ఆరాటపడుతున్నారు. ఇలాంటి ఈనేపథ్యంలో ఒకరితో ఒకరు పోటీ పడుతూ విపరీతమైన ఒత్తిడికి గురి అవుతున్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## యుద్ధాలు ఆగిపోవా?

**ఆధిపత్యమే** ఆయువుగా సాగుతున్న పోరాటం ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తుంది. అదే ఈ శత సంవత్సరాలలోని విషాదం చూడండి ఆసియా కేంద్రంగానే ఈ పోరాటం సాగుతుంది. ఎందుకు సహజ వనరుల మీద ఆధిపత్యం కోసం చమురు నిక్షేపాలుకోసం చిన్న దేశాలు తమ అస్తిత్వాన్ని కాపాడుకోకూడదు మరొక వైపు ఉక్రెయిన్ లాంటి దేశాలు గత సంవత్సర కాలంగా లేదా అంతకు మించి యుద్ధంలో సర్వస్వం కోల్పోయాయి.

- భారత అవినాష్, జనగామ

## స్థానికులకే ఉద్యోగావకాశాలు

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి బలం చేకూర్చే మార్గాల్లో ప్రధానమైనది పారిశ్రామికరంగం.పెట్టుబడులు ఆకర్షించేందుకు అనువైన వాతావరణం కల్పించడంలో పారిశ్రామిక సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయి. ఇటీవలి కాలంలో కొన్ని రాష్ట్రాలు నిర్వహించిన "ఇన్వెస్టర్స్ సమ్మిట్"లు గణనీయమైన ఫలితాలు ఇచ్చిన ఉదాహరణలు మనకు కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి తగిన సదుపాయాలు అందుబాటులో లేవని పలుమార్లు పరిశ్రమలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితిని మార్చాలంటే అత్యవసరంగా మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయాలి. రోడ్లు, విద్యుత్, నీరు, పారిశ్రామిక పార్కులు వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. అంతర్జాతీయ స్థాయి మల్టీనేషనల్ కంపెనీలు పరిశ్రమలు స్థాపించేందుకు ఉత్సాహం చూపేలా పన్నురాయితీలు,భూముల కేటాయింపు, శిక్షణా కార్యక్రమాల్లాంటి ప్రోత్సాహక పథకాలు ప్రవేశపెట్టాలి. కనీసం 70 శాతం ద్యోగాలు స్థానికులకే కల్పించాల్సిందే. దీనిపై ఒక స్పష్టమైన పారిశ్రామిక విధానం రూపొందించాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## సంతోషం సగంబలం

**మనం** ఎల్లప్పుడూ సంతోషంగా ఉండడానికి ప్రయత్నించాలి. సంతోషం సగంబలం అంటారు.ఉమ్మడి కుటుంబాలకు మద్దతు పలకాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. ఆర్థిక, ఇతర సమస్యలతో మనిషి కుదేలవుతాడు. దాంతో ఆనందం ఆవిరవతుందంటే అతిశయోక్తికాదు. ఏదిఏమైనా చిరునవ్వుకు, ఉద్యానవనానికి మనం దూరం కాకూడదు. వ్యసనాలకు స్వస్తి పలుకుతూ సమయానికి తింటూ జీవితంలో కొన్ని నియమాలు తు.చ తప్పకుండాపాటించాలి. ఎనిమిది గంటల నిద్ర అరగంట నడక,పావుగంట వ్యాయామం,పదినిమిషాలుయోగా, ధ్యానం, ఐదు నిమిషాలు నవ్వడం ఇవి అనారోగ్యాన్ని తరిమేస్తాయి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

## అభివృద్ధికి దూరం చేయడం తగదు

**రాష్ట్రంలో** ఏప్రభుత్వం అధికారంలోఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు,ఎమ్మెల్యేలు, గ్రామపంచాయతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామాల్లో రాజకీయ కక్ష్యలు, కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి. మనుషులంటే సరేసరి. ఆ రాజకీయ కక్ష్యలు, కార్పణ్యాలు గత ప్రభుత్వం నాటిన చెట్లు, మొక్కలపై కూడా చూపిస్తున్నారు.

-పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

# ఒబిసిల పోరుగర్జనతో జంకుతున్న పార్టీలు!

డాక్టర్ సంగని మల్లేశ్వర్

స్వపరిపాలన అంటే ఒక ఆధిపత్య వర్గంపోయి ఇంకో ఆధిపత్య వర్గం రావడం కాదు, రాష్ట్రం వస్తే సామాజిక న్యాయం జరుగుతుందని నమ్మి బలంగా కొట్లాడిన బడుగులకు రిజర్వేషన్లు లేని కారణంగా ఫలాలు అందలేదని, బిసిల రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఢిల్లీ కేంద్రంగా బిసి సంఘాల జాతీయ నేతల ఆధ్వర్యంలో ఒబిసిల పోరుగర్జన దేశంలోని అన్ని పార్టీలను అప్రమత్తం చేసిందనే భావించాలి. దాని ఫలితంగా దశాబ్ద కాలంగా జాప్యం చేస్తూ కులగణనపై ఊసెత్తని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేయాలనీ బిజెపి ప్రభుత్వం నిర్ణయించడం కనువిప్పు కల్పించిందనే అభిప్రాయం అందరిలో నెలకొంది. ఎన్నికల ముందు జాతీయ కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చినట్టుగానే తెలంగాణలో రేవంత్ సీఎంగా కులగణన చేసి, విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు అమలు కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపి తన ఔదార్యాన్ని చాటారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో రేవంత్ నిర్విరామంగా కృషి చేస్తూ రాష్ట్రంలో అన్ని కులాలు, భిన్న వర్గాల వారికీ సైతం సమన్యాయం జరిగేలా సామాజిక తెలంగాణగా తీర్చిదిద్దే ప్రయత్నం నిర్విరామంగా కొనసాగుతున్నది. రెండవ దఫా మంత్రివర్గ విస్తరణలో ఓసీల ఉసెత్తకుండా ఎస్సి, బీసీలకు ఇవ్వడం శుభసూచకం. ఇప్పటికే కాంగ్రెస్ అధినేత రాహుల్ ఒబిసిలను పీసీసీ అధ్యక్షులుగా నియమించి తన నిబద్ధతను చాటుకున్నారు. కులగణన జరిగితే ఏమివస్తది అన్న వ్యతిరేకులకు ప్రభుత్వ పరంగానే కాకుండా పార్టీ పరంగా కూడా కులగణనతో ఆయా వర్గాలకు రాజకీయంగా ప్రాధాన్యత పెరుగుతుందన్న నానుడి మంత్రివర్గ విస్తరణతో రూఢి అయింది. రోజూ ప్రెస్‌క్లబ్ లో మేధోవేదికల్లో బిసి బహుజన కులాల గురించి మాట్లాడే వాళ్లంతా ఆయా పార్టీల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన దాఖలాలు ఎక్కడ కన్పించలేదంటే అతిశయోక్తి కాదు. సమాజంలో 50 శాతం పైగా ఉన్న బిసిలకు ఎప్పుడు అన్యాయం జరిగింది. పార్టీని అధికారంలోకి తేవడానికి దోహదపడ్డ బిసిలకు తెలంగాణాలో కులగణన చేసి కాంగ్రెస్ రోల్‌మోడల్‌గా నిలిచింది. గరీబీ అటావో అన్న ఇందిరా నినాదంతో బిసి,ఎస్సి,ఎస్టీ, మైనార్టీ వర్గాలకోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. నాడు దళితుల జీవితాల్లో మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఏలా జ్యోతులు వెలిగించారో, బిసిలకోసం మహాత్మా జ్యోతిరావు ఫూలే ఎలా వెలుగులు తెచ్చారో నేడు రాహుల్ తీసుకున్న కులగణన ద్వారా బడుగుల జీవితాల్లో కాంతిరేఖ అవుతుందనడంలో ఎలాంటి అనుమానం లేదు. ఇప్పటివరకు దైవాంశ సంభూతులమన్నట్లు కొంత మంది మాత్రమే పాలించేవారు. అటువంటిది ఇంట గెలిచి రచ్చ గెలవాలని నిన్న జరిగిన మంత్రి వర్గ విస్తరణ ఫలితం చెరగని ముద్రవేసింది. దేశంలో కులగణన రోల్ మోడల్‌గా నిలిచినందున కులగణనకు జై కొట్టిన



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇక్కడ పార్టీ అధ్యక్షున్ని బిసిని నియమించే ప్రయత్నం ముమ్మరం చేసింది. జంతర్ మంతర్ వేదికగా బీసీ సంఘాల మహా ధర్నాకు వచ్చినఆదరణ చూసి, స్థానిక సంస్థల రిజర్వేషన్లు తగ్గించినప్పుడు నోరుమెదపని కెసిఆర్ తనయ భవిష్యత్ అంతా ఒబిసిలదే అంటూ సామాజిక న్యాయం నినాదం అందుకున్నది.జాగృతి అధినేత్రి 42శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తామని, మరోమారు నయవంచన చేసే ప్రయత్నం జరుగుతుంది. ఎందుకంటే తమ్మినేని వీరభద్రం గతంలో బిసి సబ్‌ప్లాన్ ఉద్యమాన్ని తీవ్రతరం చేసి అటకెక్కించిన సంగతి మరచిపోలేము కదా? ఉత్తరప్రదేశ్‌లో యాదవేతర, జాతవేతర బహుజన కులాలతో సామాజిక సమీకరణ చేసిన బిజెపి నాయకత్వం, మోడీ,అమిత్ షా ద్వయం ఇక్కడ మాత్రం వెనుకడుగువేస్తే భవిష్యత్ క్షమించదు. కానీ, దేశంలో బలీయమైన శక్తిగా ఎదిగేందుకు కులగణన తొలిమెట్టు అయ్యింది. మేము సగం మాకు సగం అన్న నినాదంతో సామాజిక తెలంగాణ దిశగా అడుగులు వేస్తుంది. కులగణనకు కట్టుబడి ఉన్నామని రాష్ట్రవ్యాప్తంగా గణాంకాలు తీసి,శాసనసభలో విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై తీర్మానం చేసి చేతులు దులుపుకోలేదు. మొన్న జరిగిన ఐదు ఎమ్మెల్సీలలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన కాంగ్రెస్ పార్టీ అదే పట్టుదల,అదే సంకల్పంతో మంత్రి వర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించి సునామీ సృష్టించింది. పార్లమెంట్లో చట్టబద్ధత సాకుతో స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు తేలకముందు ఎన్నికలకు వెళ్తితే కాంగ్రెస్ అభాసుపాలు అయ్యే ప్రమాదం ఉంది. అయితే స్థానిక సంస్థల్లో ఆయా రాష్ట్రాలకు పెంచడం, తగ్గించడం భారత రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది. ఇక్కడ ఏమి తేడా వచ్చినా దేగ కళ్లతో ఎదురుచూస్తున్న ప్రత్యర్థులు బలపడే ప్రమాదం లేకపోలేదు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల రాష్ట్రంలో 119 సీట్లలో అధికార, ప్రతిపక్ష పార్టీలలో ఉన్న బీసీ అభ్యర్థులు 19 మంది మాత్రమే. 10శాతం కూడా లేని సామాజిక వర్గం ధనబలంతో బిసిలను విడదీసి 69 సీట్లలో ఆధిపత్యాన్ని కొనసాగించారు. కులగణన ఫలితం రాహుల్ కమిట్మెంట్ అనే భావం అందరిలో నెలకొంది. మేము ఏమైనా తక్కువ తిన్నామా అంటూ బిజెపి కులగణన గెజిట్ విడుదల చేసి కార్యాచరణ ప్రారంభించింది. అన్ని పార్టీలకు మనుగడ ఉండాలంటే ప్రజా ప్రాతినిధ్య ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా ఆయా సామాజిక వర్గాలకు దామాషా ప్రకారం చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించి, పార్టీ సంస్థాగత పదవుల్లో, నామినేటేడ్ పదవుల్లో 42శాతం అమలు చేయాలి. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను దక్కించుకోవడానికి ఓబిసి సంఘాల ఢిల్లీ మహాధర్నాలో సీఎం రేవంత్ సహా కాంగ్రెస్ నాయకులు పాల్గొని వారి చిత్తశుద్ధిని చాటారు. నాడు బిసి సంఘాలు మహాధర్నాకు రావాలని కోరినా స్పందించని బిజెపి, బీఆర్ఎస్ నష్ట నివారణ చర్యలు చేపట్టింది. కల్వకుంట్ల కవిత రైల్ రోకో పిలుపు కూడా అందులో భాగమే. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి 2000 మంది ఓబిసి ప్రతినిధులు రిజర్వేషన్లు అమలు చేయాలనీ తీర్మానం చేయడంతో భయపడి కులగణనకు సానుకూల ప్రకటన చేసిందనేది నిర్వివాదాంశం. అయితే కులగణనతో పాటు అన్ని రంగాల్లో మన వాటా మనకు దక్కినప్పుడే సామాజిక న్యాయం దక్కిందని భావించాలి. విద్య ఉద్యోగ రిజర్వేషన్స్ అమలు కావాలంటే ఒబిసిలు ఏకతాటిపై రావాల్సిన అవసరం ఉంది. ●

**మనవి** | **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఖొమేనీ వారసులుగా ముగ్గురు సీనియర్ మతపెద్దలు!

**టెహ్రాన్,జూన్ 22:** ఇరాన్‌లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. దేశ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీ తన వారసుల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ముగ్గురు సీనియర్ మత పెద్దల పేర్లను ఆయన తన తర్వాత ఆ పదవిని చేపట్టేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే, ఈ వారసుల జాబితాలో ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీకి చోటు దక్కకపోవడం గమనార్హం. ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరిన ప్రస్తుత తరుణంలో, అమెరికా, ఇజ్రాయెల్ నుంచి వస్తున్న బెదిరింపుల నేపథ్యంలో ఖమేనీ ఈ అనూహ్యమైన చర్య తీసుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న తన పాలన ముగింపునకు ఆయన సిద్ధమవుతున్నారనడానికి సంకేతమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్ అత్యున్నత పదవికి తన వారసులుగా ముగ్గురు సీనియర్ మత పెద్దల పేర్లను ఖమేనీ ప్రతిపాదించినట్లు అమెరిక ఆంగ్లపత్రిక కథనం ప్రచురించింది. గతంలో, దివంగత అధ్యక్షుడు ఇబ్రహీం రైసీని ఖమేనీ వారసుడిగా ప్రచారం జరిగినప్పటికీ, హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన మరణంతో ఆ ఊహాగానాలకు తెరపడింది. ఇప్పుడు, ఖమేనీ సొంత కుమారుడు, తెరవెనుక కీలక వ్యక్తిగా భావిస్తున్న మొజ్తబా పేరు కూడా జాబితాలో లేకపోవడం గమనార్హం. ఇది మూడు దశాబ్దాలకు పైగా సాగుతున్న తన పాలన ముగింపునకు ఖమేనీ సిద్ధమవుతున్నారనడానికి




సంకేతమని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ నుంచి వస్తున్న తీవ్ర బెదిరింపుల నేపథ్యంలో ఖమేనీ అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఒక రహస్య భూగర్భ బంకర్‌లోకి వెళ్లినట్లు సమాచారం. అన్ని రకాల ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లను నిలిపివేసి, కేవలం ఒక నమ్మకమైన సహాయకుడి ద్వారా మాత్రమే సైనిక కమాండర్లకు సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇజ్రాయెల్ దాడుల్లో ఐఆర్‌జీసీ ఉన్నతాధికారులు మరణించిన నేపథ్యంలో, తన హత్యకు కుట్ర జరగవచ్చనే ఆందోళనతోనే ఖమేనీ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అర్థమవుతోంది. మొజ్తబా ఖమేనీకి వారసుడిగా అవకాశం దక్కకపోవడం వెనుక, రాజవంశ పాలనను ఖమేనీ వ్యతిరేకిస్తున్నారనే వాదనలకు బలం చేకూరుతోంది. కుటుంబ సభ్యులకు అధికారం కట్టబెట్టడంకంటే, ఇస్లామిక్ రిపబ్లిక్ మతపరమైన, సంస్థాగత పునాదులను కాపాడటమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. వారసుల ఎంపిక, సైన్యంలో కీలక మార్పుల ద్వారా, భవిష్యత్ అసరతను నివారించి, నాయకత్వ కొనసాగింపునకు ఖమేనీ మార్గనుగమం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ట్రంప్, నెతన్యాహూల నుంచి వచ్చిన పరోక్ష హెచ్చరికలు ఖమేనీలో ఆందోళనలను మరింత పెంచినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ఇరాన్ భవిష్యత్తుపై తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.

## ప్రాణహాని భయంతో రహస్యబంకర్‌లోకి ఖొమేనీ..

**టెహ్రాన్,జూన్ 22:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ బంకర్‌లో దాగిన్నట్లు సమాచారం. ఇజ్రాయెల్‌ను ఆయనను హతమార్చేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలో ఆయన ప్రాణాలకు ముప్పున్న నేపథ్యంలో బంకర్‌లోకి వెళ్లిపోయారు. అయితే, ఎవరూ అనుకోని విధంగా ఆయనకు ఏమైనా హాని జరిగితే తన వారసుడిగా ఎవరు బాధ్యతలు స్వీకరించాలో నిర్ణయం తీసుకున్నారని వార్తలు వైరల్ అయ్యాయి. ముగ్గురు సీనియర్ మతాధికారుల పేర్లను ఖరారు చేసినట్లు పేర్కొంది. అలీరేజా అరాఫీ, అలీ అస్గర్ హెజాజీ, హాషీం హుస్సేని బుషారీల్లో ఎవరో ఒకరు సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఖమేనీ ఎక్కడ ఉన్నాడో తెలియకుండా వివరాలో గోప్యంగా ఉంచాలని తనకు దగ్గరలో ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అత్యవసర యుద్ధ ప్రణాళిక నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. సుప్రీం లీడర్‌గా ఖమేనీ వారసుడిగా మొజ్తాబా ఖమేనీ పేరు సైతం వినిపించింది. తాజాగా ఆయన ఎంపిక చేసిన పేర్లలో తనయుడి పేరు కనిపించలేదు. వాస్తవానికి వారసత్వ రాజకీయాలకు ఖమేనీ పూర్తిగా వ్యతిరేకం. గతంలో కుటుంబ పాలకు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలోనే స్పందించడం ప్రస్తావనార్హం. ఇదిలా ఉండగా గతంలో ఖమేనీ వారసుడిగా మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ పేరు బాగా వినిపించింది. కానీ, ఆయన గతేడాది జరిగిన హెలీకాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా ఇటీవల ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఘాటుగా స్పందించారు. ఖమేనీ ఇక బహిరంగంగా బయటకు రాలేదని బంకర్‌లో దాక్కొని ఇజ్రాయెల్ ఆసుపత్రులపై దాడులకు ఆదేశిస్తున్నాడని ఆరోపించారు. ఇది యుద్ధ నేరమని ఖమేనీ దీనికి మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఖమేనీని లక్ష్యంగా చేసేందుకు ఇజ్రాయెల్ రక్షణ దళాలు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



# 14కోట్లు దాటిన బిజెపి సభ్యత్వాలు

## పార్టీలో తొలి క్రియాశీల సభ్యుడిగా చేరడం గర్వంగా ఉంది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూన్ 22:** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మరో మరోరికార్డు సాధించింది. పార్టీ ప్రాథమిక సభ్యుల సంఖ్య 14 కోట్లు దాటినట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ ప్రకటించారు. ఈ ఘనత సాధించడం వెనుక బూత్ స్థాయి కార్యకర్తల కృషి ఎంతో ఉందని ఆయన కొనియాడారు. ఈ విషయంపై బీఎల్ సంతోష్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ "భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వం 14 కోట్ల మార్కును దాటింది. ఇది గొప్ప విజయం. ప్రతి బూత్ స్థాయి కార్యకర్త కృషి అమోఘం. మేము భారీ ప్రచార కార్యక్రమాలను నిలిపివేసినప్పటికీ, బూత్ స్థాయి కార్యకలాపాల ద్వారా 14 కోట్ల సభ్యత్వ మార్కును దాటగలిగామని తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్టీ దేశవ్యాప్త యాక్టివ్ సభ్యత్వ ప్రచారంలో తొలి క్రియాశీల సభ్యుడిగా చేరిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం, బీజేపీ జాతీయఅధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ సభ్యత్వ ప్రచార కన్వీనర్ వినోద్ తావ్డే సమక్షంలో జరిగింది. ఇది పార్టీ చేపట్టిన సంఘటన్ పర్వ్ సభ్యత్వ ప్రచారం2024లో తదుపరి దశగా ప్రారంభమైంది. ఆ సమయంలో ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను ఎక్స్‌లో పంచుకుంటూ, బీజేపీలో తొలి యాక్టివ్ సభ్యుడిగా చేరడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. క్రియాశీల సభ్యుడు కావడానికి ఉండాల్సిన అర్హతలను కూడా ప్రధాని మోదీ వివరించారు. ఒక కార్యకర్త యాక్టివ్ సభ్యుడిగా అర్హత సాధించాలంటే ఒకబూత్ లేదా అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కనీసం 50 మంది కొత్త సభ్యులను నమోదు చేయించాలి. దీనివల్ల వారు మండల కమిటీ,పార్టీలో ఉన్నత స్థాయి పదవులకు పోటీ చేయడానికి అర్హులవుతారు. భవిష్యత్తులో పార్టీకి వివిధ హోదాల్లో సేవలందించేందుకు ఈ కార్యకర్తలకు విస్తృత అవకాశాలు కల్పిస్తామని ప్రధాని తెలిపారు. బీజేపీ జాతీయ సభ్యత్వ ప్రచారాన్ని తొలుత గత ఏడాది సెప్టెంబర్ 2న పార్టీ కేంద్ర కార్యాలయ విస్తరణ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రారంభించారు. సంఘటన్ పర్వ్ సభ్యత్వ ప్రచారం2024 పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో 2024 అక్టోబర్ 15 నాటికి సభ్యుల సంఖ్య తొమ్మిది కోట్లు దాటింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే బీజేపీ రెండు కోట్ల మంది సభ్యులను కలిగి ఉన్నట్లు ఆ పార్టీ పేర్కొంది. సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదటి, రెండవ దశలు ముగియడంతో పార్టీ క్రియాశీల సభ్యత్వ సంఖ్యను మరింత పెంచే లక్ష్యంతో మూడవ దశ ప్రారంభమైంది.

# ఇరాన్‌పైకి అమెరికా వదిలింది పాతకాలం టోమ్‌హాక్ క్షిపణులే..

**న్యూయార్కు, జూన్ 22:** ప్రపంచవ్యాప్తంగా దేశాలు సూపర్‌సోనిక్, హైపర్‌సోనిక్ క్షిపణుల అభివృద్ధిలో పోటీ పడుతున్న ప్రస్తుత తరుణంలో, అమెరికా మాత్రం కొన్ని దశాబ్దాలుగా ఒక సబ్‌సోనిక్ క్షిపణిపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. అదే టోమహాక్ క్రూయిజ్ క్షిపణి. గతంలో ఇరాక్ యుద్ధంలో అమెరికా ప్రయోగించిన తొలి ఆయుధం కూడా ఇదే కావడం గమనార్హం. ఇరాన్ అణు కేంద్రాలపై దాడికి బంకర్ బస్టర్ బాంబుల గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతుండగా, టోమహాక్ క్షిపణి పని తాను నిశ్శబ్దంగా పూర్తి చేసింది. సుమారు మూడు దశాబ్దాలకు పైగా అనేక యుద్ధాల్లో అమెరికా సైన్యం అత్యధికంగా విశ్వసించిన ఆయుధాల్లో టోమహాక్ ఒకటి. ఇరాక్, సిరియా, లిబియా, గల్ఫ్ దేశాలు, యెమెన్ వంటి అనేక సమస్యాత్మక ప్రాంతాల్లో అమెరికా ఈ క్షిపణిని విరివిగా ఉపయోగించింది. ప్రయోగించిన ప్రతీసారి ఇది తన లక్ష్యాలను విజయవంతంగా ఛేదించిందని నివేదికలు తెలియజేస్తున్నాయి. టోమహాక్ మిస్సైల్‌ను



సముద్రంలోని యుద్ధనౌకలు, జలాంతర్గాముల నుంచి శత్రువుల భూస్థావరాలపైకి ప్రయోగించేలా రూపొందించారు. దీని తయారీ ఆలోచన 1970లలో ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో తెరపైకి వచ్చింది. జనరల్ డైనమిక్స్ సంస్థ దీనిని అభివృద్ధి చేయగా, 1983 నాటికి ఇది అమెరికా సైనిక దళాల అమ్ములపొదిలో చేరింది. బూస్టర్‌ను మినహాయిస్తే, ఈ క్షిపణి పొడవు 5.6 మీటర్లు ఉంటుంది. ఇది సుమారు 1600 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. గంటకు 880 కిలోమీటర్ల వేగంతో (సబ్‌సోనిక్) ప్రయాణిస్తుంది. భూ ఉపరితలానికి కేవలం 30నుంచి 35 మీటర్ల ఎత్తులో ప్రయాణించే సామర్థ్యం ఉండటం వల్ల, ఇది లక్ష్యానికి అత్యంత సమీపంగా వచ్చే వరకు శత్రు రాడార్లు దీనిని గుర్తించడం కష్టం. అందువల్లే ఇది చాలా యుద్ధాల్లో నమ్మకమైన అస్త్రంగా పేరుతెచ్చుకుంది. ఈ క్షిపణి సుమారు 450 కిలోల బరువైన సంప్రదాయ వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. అమెరికా వద్ద ఉన్న 140 యుద్ధనౌకలు, జలాంతర్గాములలో దీనిని ప్రయోగించే ఏర్పాట్లు ఉన్నాయంటే, దీని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. ఇరాక్‌పై అమెరికా చేపట్టిన ఆపరేషన్ డిజర్ట్ స్టార్మ్ యుద్ధంలో, బాగ్దాద్ నగరంపై ప్రయోగించిన మొట్టమొదటి ఆయుధం టోమహాక్ క్షిపణే. మొత్తం 42 రోజులపాటు సాగిన ఈ యుద్ధంలో అమెరికా మొత్తం 297 టోమహాక్ క్షిపణులను ప్రయోగించగా, వాటిలో 282 క్షిపణులు తమ లక్ష్యా లను కచ్చితంగా తాకాయి. కొన్నిసార్లు చాలా ఎక్కువ ఎత్తు నుంచి, మరికొన్నిసార్లు తక్కువ ఎత్తు నుంచి ప్రయాణిస్తూ ఇవి శత్రువులను గందరగోళానికి గురిచేసి బాగ్దాద్‌పై విరుచుకు పడ్డాయి. ఒక్కో టోమహాక్ క్షిపణి ఖరీదు సుమారు 2మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని అంచనా. ఈ క్షిపణిలో అత్యంత ఆధునాతనమైన స్మార్ట్ నేవిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి. జీపీఎస్, ఇనర్షియల్ నేవిగేషన్ సిస్టమ్ (ఐఎన్ఎస్) వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇది ఉపయోగించుకుంటుంది. అంతేకాకుండా, దీనిలో ఉండే టెర్రైన్ కాంటూర్ మ్యాచింగ్ వ్యవస్థ, ముందుగా లోడ్ చేసిన మ్యాపులను అనుసరిస్తూ, భూమిపై వాస్తవంగా ఉన్న చిత్రాలను పోల్చుకుంటూ లక్ష్యం వైపు కచ్చితత్వంతో దూసు కెళ్తుంది. అత్యాధునిక డేటా లింక్‌లు కూడా దీనికి ఉండటం వల్ల, ప్రయాణ మార్గమధ్యంలో దీని దిశను మార్చవచ్చు లేదా అవసరమైతే మిషన్‌ను రద్దు చేసే సౌలభ్యం కూడా ఉంది.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు అమెరికా వత్తాసు



**జెరూసెలెం,జూన్ 22:** ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరుదేశాలపై మిస్సైళ్లతో దాడులు చేసుకుంటున్నాయి. అయితే, అమెరికా జోక్యం తప్పదన్న చర్చలు గత కొద్దిరోజులుగా సాగుతున్నాయి. చివరకు అదే నిజమైంది. శనివారం అర్ధరాత్రి అనంతరం అమెరికా వైమానిక దళాలు ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై భీకర దాడులకు పాల్పడ్డాయి. దీంతో పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ దాడుల విషయాన్ని ప్రకటించారు. ఫోర్డో, నాటాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడులకు బీ2 స్టెల్త్ బాంబర్‌ను వినియోగించినట్టు తెలిపారు. ఫోర్డోలోని భూగర్భ అణు స్థావరాన్ని ధ్వంసం చేసేందుకు ఆరు బంకర్ బస్టర్ బాంబులను వాడినట్టు వెల్లడించారు. నాటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడికి 30 టొమాహాక్ క్షిపణులను ప్రయోగించినట్టు చెప్పారు. అమెరికా వాయుసేనకు చెందిన బీ2 స్టెల్త్ బాంబర్ ఓ ప్రత్యేకతలు గల యుద్ధ విమానం. 1989లో తొలిసారిగా అమెరికా ఈ బాంబర్‌ను వాడింది. గత మూడు దశాబ్దాలుగా అమెరికా స్టెల్త్ సాంకేతికతకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ విమానం శత్రుదేశాల రాడార్లను కనిపించకుండా దాడులు చేయడం దీని ప్రత్యేకత. ఇప్పటికీ ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన విమానాల్లో ఇది ఒకటిగా ఉండటం విశేషం. నార్త్రప్ గ్రమ్మన్ అనే అమెరికా సంస్థ దీన్ని అభివృద్ధి చేసింది. ఇది భూగర్భంలో ఉన్న స్థావరాలను సైతం విజయవంతంగా ధ్వంసం చేసే సామర్థ్యం ఉంటుంది. దీనికి చాలా తక్కువ రాడార్ సిగ్నల్ ఉంటుంది. చిన్న పక్షి మాదిరిగా కనిపిస్తుంది. 6వేల నాటికల్ మైల్స్ దూరం ప్రయాణించగలదు. శక్తివంతమైన ఆయుధాలను మూసుకెళ్లగల సత్తా దీనికి ఉన్నది. ఆయుధాలను మోసుకెళ్లగలదు. ఇరాన్‌పై ఎందుకు బీ2 బాంబర్‌ను ఉపయోగించారు. ఇజ్రాయెల్ ఇప్పటికే ఇరాన్ అణు స్థావరాలపై దాడులకు పాల్పడింది. అవి భూగర్భంలో ఉండడంతో పెద్దగా నష్టం జరుగలేదు. కానీ, భూగర్భ నిర్మాణాలను ధ్వంసం చేయగల సామర్థ్యం ఇజ్రాయెల్ వద్ద లేదు. ఇలాంటి తరుణంలో అమెరికా రంగప్రవేశం చేసింది. ప్రత్యేకంగా భూగర్భ స్థావరాల కోసం రూపొందించిన 30వేల పౌండ్ల మాసివ్ ఓర్డినెన్స్ పెనెట్రేటర్ (బంకర్ బస్టర్ బాంబులు) బీ2బాంబర్ ద్వారా ప్రయోగించింది. బంకర్‌బస్టర్లు భూగర్భంలో ఉన్న గుహలను, రహస్య స్థావరాలను లక్ష్యంగా చేసుకునే శక్తివంతమైన బాంబులు. ఇవి జీపీఎస్ ఆధారంగా పని చేస్తాయి. అధిక భద్రత కలిగిన ప్రాంతాల్లోనూ వీటిని ఉపయోగించి ఖచ్చితంగా దాడి చేయొచ్చు. అమెరికా దాడులతో పశ్చిమా సియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. అమెరికా ప్రత్యక్షంగారంగంలోకి దిగడం, అణు కేంద్రాలపై గగనతల దాడులు జరగడం ప్రపంచానికే ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# తరగతి గదిలోనే టీచర్ గురకనిద్ర!

## విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు

**జల్నా,(మహారాష్ట్ర,)జూన్ 22:** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు తరగతి గదిలో విద్యార్థులందరూ ఉండగానే నిద్రపోయిన ఘటన మహారాష్ట్రలో వెలుగు చూసింది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో సంబంధిత అధికారి విచారణకు ఆదేశించారు. మహారాష్ట్రలోని జాల్నా జిల్లా గడేగావన్ గ్రామంలో ఉన్న మరాఠీ మీడియం జిల్లా పరిషత్ పాఠశాలలో వీకే ముండే అనే వ్యక్తి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన తరగతి గదిలో విద్యార్థులు పాఠాలు చదువుకుంటుండగా, ఆయన కుర్చీలో వెనక్కి వాలి, కాళ్లు బల్లపై పెట్టి గురక పెడుతూ గాఢ నిద్రలో మునిగిపోయారు. ఆ సమయంలో సుమారు 15 నుంచి 20 మంది విద్యార్థులు తరగతి గదిలోనే ఉన్నారు. ఈ దృశ్యాన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయింది. వీడియో తీస్తున్న వ్యక్తి ఒక విద్యార్థిని మాస్టారు ఎంతసేపటి నుంచి నిద్రపోతున్నారని అడగ్గా,



ఆ చిన్నారి తడబడుతూ అరగంట నుంచి అని సమాధానం చెప్పడం వీడియోలో వినిపిస్తోంది. కాసేపటికి నిద్రలేచిన ఉపాధ్యాయుడు ముండే ఒళ్లు విరుచుకుంటూ తాను పట్టుబడ్డానన్న భావన ఏమాత్రం లేకుండా చాలా మామూలుగా కనిపించడం గమనార్హం. ఈ ఘటనపై జోనల్ విద్యాధికారి సతీష్ షిండేకు ఫిర్యాదు అందింది. దీనిపై ఆయన స్పందిస్తూ సంఘటనపై విచారణ జరిపిస్తాం, నిజానిజాలు తేలిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా ఈ ఉదంతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య యొక్క నాణ్యతపై మరోసారి విస్తృత చర్చకు దారితీసింది.

## ఉగ్రవాదులకు సాయంచేశారని ఇద్దరు వ్యక్తుల అరెస్టు




**శ్రీనగర్,జూన్ 22:** జమ్మూకశ్మీర్‌లోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 22న ఉగ్రదాడిలో 26 మంది అమాయక పర్యాటకులు ప్రాణాలు పోగొట్టుకున్న సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన ఈ దారుణ మారణకాండలో పాల్గొన్న ఉగ్రవాదుల జాడ కనిపెట్టేందుకు నిఘా వర్గాలు ప్రయత్నిస్తూనే ఉన్నాయి. తాజాగా, ఈ దాడికి కారకులైన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించి అమానుష చర్యలకు సహకరించిన ఇద్దరు వ్యక్తులను ఆదివారం ఉదయం జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ అరెస్టు చేసింది. నిందితులు పహల్గామ్‌లోని బాట్‌కోట్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, హిల్ పార్క్‌కు చెందిన బషీర్ అహ్మద్ జోథర్‌గా ఎన్ఐఎ గుర్తించింది. వీరిద్దరూ పాకిస్థాన్ కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్ఈటీ)కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులకు ఆశ్రయం, ఆహారం, రవాణా వంటి అవసరాలు తీర్చి బైసరన్ లోయలో మారణకాండకు సహకరించినట్లు ఎన్ఐఏ తెలిపింది. నిందితులు పహల్గామ్ దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదుల పేర్లు వెల్లడించడంతో కేసులో కీలక పురోగతి సాధించినట్లయింది. ఈ కేసులో ఎన్ఐఎ అధికారులు ఇప్పటివరకూ 2000ల మందికిపైగా సాక్షులను విచారించారు. అరెస్టయిన పర్వేజ్, బషీర్ పహల్గామ్ దాడిలో పాల్గొన్న ముగ్గురు సాయుధ ఉగ్రవాదుల పేర్లను వెల్లడించారు. వారంతా నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా (ఎల్యీటీ) కోసం పనిచేస్తున్న పాక్ దేశీయులు. దాడికి ముందు నిందితులు ముగ్గురు ఉగ్రవాదులకు హిల్ పార్క్‌లోని సీజనల్ గుడిసెలో ఆశ్రయం కల్పించారు. ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఈ ఘోర విషాదంపై ఇంకా దర్యాప్తులు కొనసాగుతున్నాయి.

# ఉగ్రచర్యలు ప్రోత్సహిస్తున్న ఇద్దరు వ్యక్తుల ఆస్తులు జప్తు

**శ్రీనగర్, జూన్ 22:** పాకిస్థాన్ పారిపోయి అక్కడి నుంచి జమ్మూ కాశ్మీర్‌తోపాటు పాక్ సరిహద్దు ప్రాంతంలో ఉగ్రవాద చర్యలను ప్రోత్సహిస్తున్న ఇద్దరు వ్యక్తుల స్థిరాస్తులను కోర్టు ఆదేశాల మేరకు ఆ రాష్ట్ర పోలీసులు సీజ్ చేశారు. 2003లో హంద్వారాలో మహమ్మద్ షఫీ బారా, జీ హెచ్ ముస్తాఫాలు ఉగ్రవాద చర్యలకు పాల్పడ్డారు. హంద్వారా, మూన్‌బాల్ వాసులైన వీరిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం వీరిద్దరు పాకిస్థాన్‌కు పారిపోయారు. వీరిపై కొనేళ్లుగా కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఆ క్రమంలో జూన్ 20వ తేదీన కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. వీరిద్దరి ఆస్తులను సీజ్ చేయాలంటూ జమ్మూ కశ్మీర్ పోలీసులను కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో షఫీ బారా, ముస్తాఫాల ఆస్తులను పోలీసులు సీజ్ చేశారు. సరిహద్దు ప్రాంతంలో ఉద్రిక్తతలు రేకెత్తించేందుకు వీరిద్దరు ఉగ్రవాద చర్యలను చాలా కాలంగా ప్రోత్సహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ఆ ప్రాంతంలో ఉగ్రవాద చర్యల్లో వీరిద్దరి ప్రమేయం బలంగా ఉందనే ఆరోపణలు సైతం ఉన్నాయి. మరోవైపు ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ ప్రముఖ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా అనుబంధ సంస్థ ది రిసిస్టెన్స్ ఫ్రెంట్ ప్రకటించింది. దీంతో ఈ ఉగ్రదాడి ఘటనకు కర్త, కర్మ, క్రియ అంతా పాకిస్థానేనని భారత్ భావించింది. ఆ క్రమంలో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో పాక్‌తో చేసుకున్న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకుంది. అలాగే పాక్ సైతం సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాంటి వేళ భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు నిర్వహించింది. ఈ ఘటనలో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారు. అనంతరం సరిహద్దు వెంబడి రాష్ట్రాలే లక్ష్యంగా పాకిస్థాన్ క్షిపణులు, డ్రోనులతో దాడులు నిర్వహించింది. వీటిని భారత్



తిప్పికొట్టింది. ఇక పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లే లక్ష్యంగా భారత సైనిక బలగాలు దాడులు చేయడంతో పొరుగుదేశం పాక్ కాళ్ల బేరానికి దిగింది. తర్వాత సరిహద్దుల వద్ద కొన్ని చెదురు మదురు సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లోనే కాకుండా సరిహద్దు ప్రాంతంలో సైతం ఉగ్రవాద దాడులు జరగడం లేదు. ఇది కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్లే సాధ్యమైందనే చర్చ జరుగుతోంది. కోర్టు తాజా తీర్పుతో ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్న వారి ఆస్తులు సీజ్ చేయడం వల్ల కూడా భవిష్యత్తులో ఈ తరహా చర్యలకు ఆస్కారమే ఉండదనే భావన జమ్ముకాశ్మీర్ ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

## బోర్నో మార్కెట్‌లో ఆత్మాహుతి దాడి:12 మంది మృతి, 30 మందికిపైగా గాయాలు



**బోర్నో(నైజీరియా),జూన్ 22:** నైజీరియాలోని బోర్నోలో జరిగిన ఒక ఆత్మాహుతి దాడి స్థానిక ప్రజలను తీవ్ర దుఃఖంలో ముంచేసింది. ఈ దాడిలో దాదాపు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మంది గాయపడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. బోర్నోలోని ఫిష్ మార్కెట్ ప్రాంతంలో జరిగిన ఈ దాడి స్థానికులలో తీవ్ర భయాందోళనను రేపింది. బోర్నో పోలీస్ అధికారిగా వ్యవహరించే నహుం కెనత్ దాసో ఈ ఘటనపై వివరాలను అందించారు. ఒక మహిళ ఆత్మాహుతి పేలుడు పరికరాన్ని తన శరీరానికి కట్టుకొని చేపల మార్కెట్ ప్రాంతంలోకి చొరబడి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిపారు. బోర్నో నైజీరియాలోని ఉత్తర భాగంలో ఉన్న ఒక కీలక ప్రాంతం. ఇది బోకో హరామ్ అనే ఉగ్రవాద గ్రూప్ దాడులకు కేంద్రంగా మారింది. గత 16 సంవత్సరాలుగా ఈ ప్రాంతం బోకో హరామ్ ఉగ్రవాద కార్యకలాపాల నుంచి తీవ్రంగా బాధపడుతోంది. ఈ దాడులు అనేక అనర్థాలకు కారణమయ్యాయి. ప్రాణనష్టంతోపాటు కోట్లాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోకో హరామ్ గ్రూప్ దాదాపు 2009 నుంచి బోర్నోలో తీవ్రవాద కార్యకలాపాలను కొనసాగిస్తోంది. వీరి దాడుల వల్ల వేలాది మంది చనిపోయారు. రెండు మిలియన్లకు పైగా ప్రజలు ఇళ్లను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గాయపడిన వారికి వైద్య సహాయం అందించేందుకు స్థానిక ప్రభుత్వం సకాలంలో స్పందిస్తున్నప్పటికీ, బోర్నో వంటి ప్రాంతాలలో అత్యవసర సేవలు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. రంగంలోకి దిగిన రెస్క్యూ టీమ్స్ బాధితులను ఆస్పత్రికి తరలించి వారిని ఆదుకునేందుకు కృషి చేస్తున్నాయి. ఈ దాడులు నైజీరియా వ్యాప్తంగా అనేక ప్రశ్నలను రేకెత్తిస్తాయి. ముఖ్యంగా భద్రతా చర్యలు, ప్రభుత్వ పోరాటం పట్ల బోర్నో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలతో కలిసి పని చేసి ఇలాంటి దాడులను కట్టడి చేయాలని కోరుతున్నారు.

# బీహార్ గబ్బర్‌సింగ్ లాలూప్రసాద్ యాదవ్

## ఆ రాష్ట్ర డిప్యూటీ సిఎం సామ్రాట్‌చౌదరి

**పాట్నా,జూన్ 22:** ఆర్జేడి అధినేత మాజీ సీఎం లాలూప్రసాద్‌యాదవ్‌పై బీహార్ డిప్యూటి సిఎం బిజెపి నాయకుడు సామ్రాట్‌చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లాలూను బీహార్ గబ్బర్‌సింగ్ అవినీతికి ప్రతీక అన్నారు. గబ్బర్‌సింగ్ అంటే షోలే చిత్రంలో విలన్‌పేరు అదే. ఆపేరును ఉచ్ఛరిస్తూ సామ్రాట్‌చౌదరి ఈ సారి బీహార్ ఎన్నికల్లో ఆయన ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. లాలూప్రసాద్ యాదవ్ బీహార్ గబ్బర్ సింగ్. రాజకీయాల్లో ఆయన చురుగ్గా ఉన్నంతవరకూ ప్రజలు ఆయనకు భయపడుతూనే ఉంటారు. ఆయన అవినీతికి ప్రతీక అని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని సామ్రాట్ అన్నారు. ఆర్జేడి మొత్తంనేరస్థులతో నిండిపోయిందన్నారు. లాలూ కుటుంబం అవినీతిపరులతోనే నిండిందన్నారు. బీహార్‌ను లాలూకుటుంబం లూటీ చేసిందని, రాబోయే ఎన్నికల్లో ఆర్జేడి అవమానకరమైన రీతిలో ఓటమి పాలవుతుందన్నారు. ప్రధాని మోడీ సీఎం నితీష్‌కుమార్‌ల ఆధ్వ



ర్యంలో బీహార్‌ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. 2025-2030 మధ్యకాలంలో బీహార్ పారిశ్రామిక హబ్‌గా మారుతున్నదన్నారు. రాష్ట్రంలోని అభివృద్ధిని విమర్శిస్తున్నవిపక్షాలు పట్నా ఎయిర్‌పోర్టు, గంగాపథ్, పాట్నా బక్సర్‌రోడ్డు, పాట్నా ముజఫర్‌పూర్ రోడ్లు చూడాలని అన్నారు. ఇతరమౌలిక వనరుల న్నింటినీ కూడా ఎన్డీయే కూటమి సర్కారు నెరవేర్చిందన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# థాంక్స్ తణుకు-ఏడాది పూర్తయి అయిన సందర్భంగా కృతజ్ఞతలు



తణుకు, జూన్ 22 ( ప్రభాత వార్త) : గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచక పాలన సృష్టించిన జగన్మోహన్ రెడ్డిని రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చి గద్దె దించారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం తణుకు కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా తాను ప్రమాణ స్వీకారం చేసి ఏడాది కాలం పూర్తి అయిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు కూటమి నాయకులు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ అరాచకమైన పరిపాలన నుంచి ప్రజాస్వామ్యమైన పరిపాలనకు రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని అన్నారు. తణుకు నియోజకవర్గం ప్రజలు ఒక చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ రాని విధంగా భవిష్యత్తులో సైతం రాని విధంగా మెజార్టీ ఇచ్చారని అన్నారు. 72,121 మెజార్టీతో తనను గెలిపించి కూటమి ప్రభుత్వం ఏర్పడేందుకు నియోజకవర్గ ప్రజలు సహకరించారని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన మెజారిటీతో తనపై మరింత బాధ్యతను పెంచారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని గత ప్రభుత్వం అణగదొక్కిన పరిస్థితుల నుంచి స్వేచ్ఛగా ప్రజలు జీవించే విధంగా శాంతియుతమైన వాతావరణం ఏర్పడేందుకు రాష్ట్ర ప్రజలు సహకరించాలని చెప్పారు. ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, సమస్యలు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో తణుకు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమం అమలు చేసినట్లు చెప్పారు. ఏడాది కాలంలో సుమారు రూ. 1400 కోట్లు మేర అభివృద్ధి, సంక్షేమం అందించినట్లు వివరించారు. రాబోయే నాలుగేళ్లలో మరింత వేగంగా అభివృద్ధి, సంక్షేమాన్ని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పహారేశ్వర స్వామి ఆలయంలో జడ్పీ చైర్మన్ దంపతుల పూజలు



ఏలూరు జూన్,22 : ప్రభాతవార్త : ఏలూరు దక్షిణ వీధిలో కొలువై ఉన్న శ్రీ జలా పహరేశ్వరస్వామి ఆలయాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి ఘంటా పద్మశ్రీ ఆదివారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల జయేంద్ర శర్మ ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, చైర్ పర్సన్ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని జిల్లా ప్రజల శాంతి, ఆనందం, మరియు సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. అలాగే, ఆమె ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి స్వచ్ఛత మరియు అభివృద్ధి పనులపై ఆలయ కమిటీతో చర్చించారు. ఆలయ అభివృద్ధి కోసం అవసరమైన సహకారాన్ని జిల్లా పరిషత్ తరపున అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెంలో యోగాంధ్రా ఘనంగా కార్యక్రమాలు



**జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం జంగారెడ్డిగూడెం పట్టణంలోను, మండలంలోను పలు గ్రామాల్లో విద్యా సంస్థలు,ప్రభుత్వ కార్యాలయాల వద్ద శనివారం యోగాంధ్రా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లేగ్రౌండ్ లో యోగాంధ్ర కార్యక్రమం కమిషనర్ కె.వెంకటరమణ,తహసిల్దార్ స్లీవాజోజి నేతృత్వంలో జరిగింది. యోగా గురువు దిలీప్ కుమార్ యోగా విన్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్లీవా జోజి, కమిషనర్ వెంకటరమణ,డి. ఎల్.డి.ఓ ఎం.రాజు,ప్రభుత్వ హాస్పటల్ సూపరిడెంటెంట్ డాక్టర్ బేబీ కమల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్యం,టిడిపి నాయకులు మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్ కుమార్,రాజాన సత్యనారాయణ,జడ్పీటిసి పోల్నాటి బాబ్జి,జనసేన నాయకురాలు గురుజు ఉమా మహేశ్వరి,తదితరులు పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా పాల్గొన్నారు. అనంతరం యోగా గురువు దిలీప్ కుమార్ ఘనంగా సన్మానించారు. టుబాకో బోర్డు వేలం కేంద్రంలో : జంగారెడ్డిగూడెంలోని టుబాకో బోర్డు -18వ వేలం కేంద్రంలో యోగా సందర్భంగా యోగా కార్యక్రమాలు యోగా ఇనస్ట్రాక్టర్ ఐఎస్ ప్రసాద్ నిర్వహించారు. టుబాకో బోర్డు ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీహరి, ఎస్.జి.ఓ సుధీర్,బయ్యర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు. బాయ్స్ హాస్టల్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ బాయ్స్ హై స్కూల్ లో యోగా కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయులు పట్నాల సోమ శేఖర్ యోగా విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాఠశాల కమిటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ పాల్గొన్నారు. ఎంఎ నభి,పిడి ఏ సాయి శ్రీనివాస్,ఫస్ట్ అసిస్టెంట్ కే శివప్రసాద్ ప్రసంగించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్ జయరాజు ఎం భూదేవి కామేశ్వరి పిల్లల మధ్య నిలబడి వారిని ప్రోత్సహించారు. లక్కవరం జడ్పీ హైస్కూల్ లో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ఇబ్బంది ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నేడు పిజిఆర్ఎస్ యధాతధంగా జరుగుతుంది

## - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం జూన్ 22 ప్రభాతావార్త :** నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా కలెక్టర్ కార్యాలయం, డివిజన్, మునిసిపల్, మండల స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించు కోవచ్చునన్నారు. అదే విధంగా అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం.ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కూడా తెలియజేసారు.

# సినీ డిక్షనరిలో తనకంటూ కొన్ని పేజిలు సృష్టించుకున్న ఉద్దండుడు ఎల్విప్రసాద్



**భీమవరం జూన్ 22 ప్రభాతవార్త :** భారతీయ సినిమాకి నడకలు నేర్పిన మహనుభావుల్లో ఎల్విప్రసాద్ ఒకరని, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకులని పలువురు వక్తలు అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం తెలుగు సినీ నిర్మాత, దర్శకులు, నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత ఎల్విప్రసాద్ వర్ధంతి కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్ కె చాన్ భాషా, మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు మాట్లాడుతూ సినీ నిర్మాతగా, దర్శకుడుగా, నటుడుగా సినీ డిక్షనరిలో తనకంటూ కొన్ని పేజిలు సృష్టించుకున్న ఉద్దండుడని, భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించినందుకు గాను దాదాసాహేబ్ ఫాల్కే అవార్డును అందుకున్నారని అన్నారు. సంస్కార భారతి కార్యదర్శి చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హిందీ, తమిళ, తెలుగు కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకుడిగా, నిర్మాతగా, నటుడిగా పలు విధాలుగా తన పాత్రను పోషించారని అన్నారు. కింది స్థాయి నుండి ఎవరికి అందనంత ఎత్తుకు ఎదిగిన ఎల్వి ప్రసాద్ సామాజిక సేవతో కూడ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, చల్లా రాము, సిహెచ్ సాయి, కే సుబ్బరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి వాట్సప్ వేదిక

**- 94934 22222 ద్వారా సమస్య పరిష్కారానికి చర్యలు**

**- మొబైల్ సేవ పోస్టర్ ఆవిష్కరించిన తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ**



**తణుకు, జూన్,22 ( ప్రభాత వార్త) :** రాబోయే నాలుగేళ్లలో తణుకు నియోజకవర్గంలో మరింత అభివృద్ధి సంక్షేమం అమలు చేసే దిశగా పునరెంకితం అవుతానని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడించారు. తణుకు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి వాట్సప్ వేదిక ద్వారా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు. తాను ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పూర్తి అయిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను నేడుగా తన దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వాట్సాప్ నెంబర్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. 94934 22222 నెంబర్ కు హాయ్ అని పెడితే గ్రామం, వార్డు ఎంపిక చేసుకుని తద్వారా సమస్యను తన దృష్టికి తీసుకురావడానికి అవకాశం ఉంటుందని వివరించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



**పోడూరు, జూన్-22, ప్రభాతవార్త:** ఆచంట నియోజకవర్గంలో దారిద్ర రేఖకు దిగువనున్న పేద వర్గాలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 32 మంది బాధితులకు మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ రూ. 13,50,864/- నగదు విలువ గల చెక్కులను ఆదివారం అందజేశారు. ఆచంట మండలం లో కోట్ల దేవాళ్ళ 77,493/- ,పోలిశెట్టి దుర్గా మల్లేశ్వరి 30,786/-, చలపతి సోమ శేఖర సత్య నారాయణ 99,642/-, నిమ్మకాయల వాణి మాధవి 35,524/-,మానుకొండ పెద్దిరాజు 30,000/-,కుక్కల రాజు 43,565/- ,గుబ్బల ప్రవీణ్ 45,000/-, వెంద్ర జానకి 20,464/-, ఆదిమూలం జయ రామ కృష్ణ మణికంఠ 23,400/-,నర్గాన లక్ష్మణ రావు 31,049/-, బలనాగు వెంకట రామకృష్ణ రావు గుప్తా 37,100/-, పెనుగొండ మండలం లో సానబోయిన సుమతి 38,418/-, దొంగ లక్ష్మి నర్సమ్మ 43,953/-, గుబ్బల సత్యనారాయణ 35,500/-, ఏడిద అపర్ణ 30,786/- కడలి త్రినాథ్ 25,166/-, వెంద్ర నరసింహ రావు 46,734/-, కట్టా విజయ గంగ భవాని 30,786/-, తానేటి చిట్టి రత్నం 55,028/-, పోడూరు మండలం లో కుక్కల శ్రీ రమ్య 1,23,144/-, తుమ్మ సురేష్ 12,000/-, కుక్కల రామలక్ష్మి 23,920/-, తుమ్మా చిట్టెమ్మ 17,150/-, గరగ లక్ష్మి 45,850/-, కడలి లీల దుర్గా 23,920/-, కుక్కల ఉమా దేవి 20,000/-, పెనుమంట్ర మండలం లో జొన్నాడ ఏడుకొండలు 41,136/-, శీలబోయిన విమలవతి 42,450/-, మహాశివబట్టు వీర వెంకట రాఘవ రాజు 31,214/-, వేదంగి ఏసు రత్నం 18,000/-, గూడూరి హైమవతి 1,51,686/- , దంగేటి లక్ష్మి రేష్మ 20,000/- నగదు గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాల ప్రజల యాభై సంవత్సరముల కల నెరవేరింది



**ముదినేపల్లి. జూన్ 22(ప్రభాత వార్త ).** గత 50 సంవత్సరముల నుండి ఎంతగానో ఎదురు చూస్తున్న చిగురుకోట ,బొమ్మినంపాడు రెండు గ్రామాల మధ్య రాకపోకలకు సంబంధించి పెద్ద కొమ్మిలేరు మేజరు డ్రైన్ పై వంతెన నిర్మాణం కల నేటికి నెరవేరింది . రెండు గ్రామాల ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎంతోకాలంగా ఈ వంతెన నిర్మాణానికి ఎంతమంది నాయకులు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.కానీ ఏది ఏమైనా వంతెన నిర్మాణం చేపట్టాలని పట్టుదలతో ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి సత్యనారాయణ ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఈ వంతెన నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి ఎంపీపీ 10 లక్షల రూపాయలు ఇచ్చారు. సుమారుగా 5 లక్షల రూపాయలు రైతులు మరియు లితన సోదరుడు రామిశెట్టి ప్రసాద్ సహకారంతో వంతెన నిర్మాణం చేపట్టడం వెంటనే వంతెన నిర్మాణం పూర్తి చేయడం జరిగింది... ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఈ వంతెన వలన చిగురుకోట మరియు బొమ్మినంపాడు ములకలపల్లి మరియు అల్లూరు కొరగుంటపాలెం ఈడేపల్లి గ్రామాల ప్రజలకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే మండవల్లి మరియు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు ఎంతగానో ఉపయోగం మరియు ఈ వంతెన నిర్మాణం ఎన్నో ఏళ్లుగా నిర్మించకపోవడం వల్ల ప్రజలు ఎంతగానో ఇబ్బంది పడ్డారు .ఈ నిర్మాణానికి సహకరించిన రామిశెట్టి సత్యనారాయణ మండల, గ్రామ ప్రజలు అందరూ సంతోషవ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# నరసాపురంలో వాసవి సేవలు



**నర్సాపురం ప్రభాతవార్త :** నరసాపురం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు.క్లబ్ అధ్యక్షులు నూలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఉచితంగా డయాబెటిస్ టెస్టులు 300 మందికి చేశారు. అనంతరం చెప్పులు కుట్టే వారికి కావాల్సిన పనిముట్ల కిట్ లను అందచేశారు. అనంతరం అప్పన ప్లాజా లో మీటింగ్ నిర్వహించి ఒక రైతును ఘనంగా సత్కరించారు. కోవెల గుడిలో 1000లీటర్ల వాటర్ ట్యాంక్ లను క్లబ్ తరుపున బహుకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ జయంతి వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కనగళ్ల రామకృష్ణ, క్లబ్ అధ్యక్షులు నూరి శ్రీనివాస్, సెక్రటరీ కంచర్ల బాబ్జి, ట్రెజరర్ కోట్ల బాలకృష్ణ వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయానికి వాటర్ ట్యాంక్ బహూకరణ



**మొగల్తూరు జూన్ 22 (ప్రభాతవార్త):** సాయి బాబా మందిరంలో నందు ఆదివారం సాయంత్రం వాసవి వనిత క్లబ్ డాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరు శాఖకు అధ్యక్షురాలు సీమకుర్తి అరుణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వనిత క్లబ్ సభ్యులు సేవా కార్యక్రమాల మరింత విశృతంగా చేయాలని అన్నారు. తోటి వారికి సహాయ సహకారాలు అందించడంలో ఆర్యవైశ్యులు ముందు ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత సైనికుడు వాటాల ఏడుకొండలను ఘనంగా సత్కరించారు, పలువురు పేదలకు నిత్యవసర సరుకులు అందించారు, మొగల్తూరు లోని శ్రీ దత్త సాయి మందిరానికి నీళ్ల ట్యాంకును, వికలాంగులకు సామాగ్రిని అందజేశారు. పలువురికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రీజనల్ ఆర్గనైజర్ కనగళ్ల విజయరామకృష్ణ, రీజనల్ చైర్మన్ వంకాయల శ్యామల జోన్ చైర్మన్ అప్పన బద్రి ఆర్గనైజింగ్ సెక్రటరీ వంకాయల రవికుమార్, వనిత క్లబ్ కోశాధికారి అనంతపల్లి మంగామణి, సభ్యులు కారుమూరి రత్నకుమారి, అప్పన విజయ, అనంతపల్లి అరుణ, శాంతాదేవి, వెంకటరమణ, గ్రంధి అంజలి ,వేద సీతాకుమారి, ఉద్దగిరి మహాలక్ష్మి, అద్దేపల్లి సుబ్బలక్ష్మి తదితరులు ఉన్నారు.

# నేడు సత్యవరంలో పల్లెపల్లెకు

## -మన పితాని కార్యక్రమం



**పెనుమంట్ర, జూన్-22, ప్రభాతవార్త:** మండలంలోని సత్యవరం గ్రామంలో ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ నేడు అనగా సోమవారం నాడు "పల్లె పల్లెకు-మన పితాని" కార్యక్రమంలో పాల్గొంటారు. కొయ్యేటిపాడు గ్రామంలో 09:00 గంటల నుండి 11:00 గంటల వరకు పంచాయతీ వద్ద మండల స్థాయి అధికారుల బృందం మరియు ప్రజలతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొనున్నారు. 11:00 గంటల నుండి 12:00 గంటల వరకు జరుగు కూటమి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం" కార్యక్రమానికి హాజరుకానున్నారు. సత్యవరం గ్రామంలో 04:00 గంటల నుండి 06:00 గంటల వరకు పంచాయతీ వద్ద కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సర వేడుకలు మరియు మండల స్థాయి అధికారుల బృందం మరియు ప్రజలతో ముఖాముఖి చర్చా కార్యక్రమంలో పాల్గొనున్నారు. గ్రామంలో 06:00 గంటల నుండి 07:00 గంటల వరకు మల్లిడి వెంకటరెడ్డి ఇంటి వద్ద జరుగు కూటమి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం" కార్యక్రమానికి హాజరుకానున్నారు. కావున కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని ఎమ్మెల్యే పితాని క్యాంపు కార్యాలయం తెలిపింది.

# రావి ఆకుపై యోగాసనాలు



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: యోగా వల్ల శారీరకమానసిక,ఆధ్యాత్మిక పరమైన ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, యోగ అనేది సున్నితమైన వ్యాయామం,శ్వాస నియంత్రణ తో పాటు ధ్యానాన్ని కలిగి ఉన్న పురాతన అభ్యాసం అని జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం తెలుగు పండిట్, ఏలూరు జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు తెలిపారు. ప్రపంచ 11వ యోగా దినోత్సవం సందర్భంగా యోగాపై ప్రజలు,విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు, ఆసక్తి పెంచేందుకు రావి ఆకులపై పలు యోగాభ్యాసనాలు చిత్రించారు. రావి ఆకులపై ఆయన చిత్రించిన యోగాసనాలు యోగాలో ఎన్ని ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయో ప్రజలకు చక్కటి అవగాహన కల్పించేలా ఉన్నాయి. యోగాభ్యాసనం తో ఆరోగ్య ప్రయోజనాలతో పాటు రక్తపోటు తగ్గుతుందని నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో వారానికి ఒక రోజు యోగాభ్యాసనం ను విద్యార్థులచే చేయించాలని ఆదేశాలు జారీ చేస్తాననటం ఎంతో శుభ పరిణామం అని ఆయన ఆనందాన్ని వ్యక్తపరిచారు. పలువురు ఆయన రావి ఆకులపై చిత్రీకరించిన యోగాభ్యాసనాలను చూసి,ఆయనకు అభినందనలు తెలిపారు.

# తమ్మిలేరు రిజర్వాయర్ లో చేపలు వేటకు వెళ్లి వ్యక్తి మృతి



**చింతలపూడి.. ప్రభాత వార్త :** చింతలపూడి మండలం చింతలపూడి నగర పంచాయతీలో చార్లెస్ నగరకు చెందిన గద్దం శాంత కుమార్ నిన్న ఉదయం 11 గంటల సమయంలో ఇద్దరు స్నేహితులతో కలిసి మద్యం సేవించి నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు తన దగ్గర ఉన్న చేపల వల మెడకుచుట్టుకొని నీటిలో మునిగిపోయాడు సమాచారం అందుకున్న, చింతలపూడి సబ్ ఇన్స్పెక్టర్ కే సతీష్ కుమార్, వారి సిబ్బంది, మరియు అగ్నిమాపక సిబ్బంది రాత్రి 7 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టారు. మరి ఒక పక్క వర్షం రావడంతో వెళ్లిపోయి తిరిగి ఈరోజు ఉదయం 6 గంటలకు అగ్ని మాపక సిబ్బంది, కోటా కోటేశ్వరరావు, వి నాగరాజు, కే రాంబాబు, ఈ రామకృష్ణ బి నాగరాజు గంటలకు గాలింపు చర్యలు చేపట్టగా ఉదయం ఎనిమిది గంటలకు గద్దం శాంతకుమార్ మృతదేహం లభ్యం అయింది. మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది, బంధువులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎస్సై సతీష్ కుమార్ తో పాటు, ఏఎస్ఐ కిషోర్, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ తదితరులు ఉన్నారు.

# జంగారెడ్డిగూడెం సిఐ సురేష్ కు వేద ఆశీర్వచనాలు

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం పట్టణంలో గోకుల తిరుమల పారజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జంగారెడ్డిగూడెం పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎం.వి సురేష్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆయన శ్రీ స్వామివారికి ప్రత్యేక అష్టోత్తర పూజలు, ప్రత్యేక దర్శనాలు చేసుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు ఈవో కలగర శ్రీనివాసు అర్చకులు, నల్లూరి రవికుమార్ చార్యులు స్వాగతం పలికారు. సిఐ సుభాష్ కు వేద ఆశీర్వచనాలు అందజేసి స్వామి వారి శేష వస్త్రాలు ప్రసాదాలతో సన్మానించారు.

## శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయానికి భక్తులు తాకిడి

మొగల్తూరు జూన్ 22(ప్రభాతవార్త) ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయం నందు, ఆదివారం పలు జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యము సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు డైరెక్టర్లు, ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా దగ్గరుండి క్యూలైన్లో పంపించారు, అమ్మవారి ఆలయం నందు ఉదయం 9 గంటల నుండి భజన



కార్యక్రమం నిర్వహించారు

## వాక్కాయల మొక్కలను పంపిణీ చేసిన రైతు



మొగల్తూరుజూన్ 22(ప్రభాతవార్త) కే.పీ. పాలెం నార్త్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యీవన దామోదరావు-సరస్వతి దేవి దంపతుల ఇంటి ఆవరణలో భారీ వృక్షంగా పెరిగిన హైబ్రిడ్ వాక్కాయలు గుత్తులు గుత్తులుగా విరగ కాసిన మొక్క పలువురిని ఆకట్టుకుంది. ఎరుపు తెలుపు రంగులో గల హైబ్రిడ్ వాక్కాయల మొక్క ఈ ప్రాంతంలో పెరగడం చాలా అరుదు. ఈ వాక్కాయల మొక్క కు కాసిన కాయలు చుట్టుప్రక్కల నుండి వచ్చే పోయే పలువురు వారి అవసరాలకు తగ్గట్టుగా కోసుకునే వెళ్లడం విశేషం. ఈ ప్రాంతంలో హైబ్రిడ్ వాక్కాయల మొక్క దామోదర్ రావు సరస్వతి దేవి ఇంటి ఆవరణలో పెద్ద ఎత్తున కాయడం కాసిన కాయలు పలువురు చూసి ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు. వాక్కాయలు కావలసిన అవసరమున్న వారు గత వారం రోజుల నుండి ఇంటి యజమాని అనుమతితో ఉచితంగా కోసుకుని పట్టుకుని వెళుతున్నారు.

## వార్డుల్లో దేశం కమిటీలు



నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం పట్టణ 31వ వార్డులో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ పాలూరి నరసింహారావు (బాబ్జీ) గారి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పాల్గొన్నారు మరియు సంస్థగత కమిటీల అబ్జర్వర్ గా ఆచంట మండల జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు పాల్గొన్నారు 31వ వార్డు అధ్యక్షులుగా పాలూరి విగ్నేశ్వర వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా గునిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సాలాపు నాగేశ్వరరావు (అబ్బు) వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, మరియు మాజీ ఏ ఎం సి చైర్మెన్ & రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురం పట్టణ అధ్యక్షులు జక్కం శ్రీమన్నారాయణ, గుణిశెట్టి సత్యన్నారాయణ, పంజా దినేష్, చిన్నిమిల్లి వెంకటేశ్వరరావు, కడియం శివరామకృష్ణ, దుర్గాప్రసాద్, కొప్పాడ నరేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు

## ఈ వాహనాలకు మరమ్మతులు చేయించరా

ప్రభాతవార్త, చాట్రాయి : గ్రామాల్లో చెత్తను తీసుకువెళ్లేందుకు లక్షల ఖర్చు చేసి వాహనాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి పాడైపోతే పట్టించుకునే నాధుడే కరువైన వైనమిది. గ్రామాల్లోని చెత్తను తీసుకెళ్లి సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు కొన్ని గ్రామాలకు ఆటోలను ప్రభుత్వం సరఫరా చేసింది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆటోలను కొనుగోలు చేశారు కానీ అవి మరమ్మతులకు గురైతే పట్టించుకునే నాధుడే కరువు అవటంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఆటోలను పంచాయతీలకు అప్పగించారు కానీ దాని నిర్వహణకు కేటాయించకపోవడంతో వాహనాలు తుప్పు పట్టి పోతున్నాయి. లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం ఈ విధంగా వృధాగా పోతున్నా అధికారులు గానీ పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఈ విధంగా ఆటోలు శిధిలమై గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద దర్శనమిస్తున్నాయి.



ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పాడైపోయిన వాహనాలను మరమ్మతులకు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంతాపం.

అత్తిలి - జూన్ 22 ( ప్రభాత వార్త ): అత్తిలి రిటైర్డ్ ఎంప్లాయిస్ అస్సోసియేషన్ సంఘ సభ్యులైన నంబూరి మరియమ్మ, కె. పి.వెంకమ్మ, పి. రాధా దేవి, ఇటీవల మృతి చెందిన సందర్భంగా సంఘం ప్రగాఢ సంతాపం తెలిపింది. సంఘం అధ్యక్షుడు పమ్మి గోపాల కృష్ణ మూర్తి , శీతాల వెంకట నారాయణ తదితరులు సంతాపాన్ని తెలిపారు.

## వ్యవసాయ డిప్లమో కోర్సులకు ఈనెల 30వ తేదీ వరకు గడువు



పెనుమంట్ర, జూన్-22, ప్రభాతవార్త: ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించే వ్యవసాయ డిప్లమో కోర్సులకు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకొనుటకు గడువును ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లుగా మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎ.డి.ఆర్. డా. టి. శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయంవారు జూన్-16వ తేదీన ముగియాల్సిన ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను జూన్-30వ తేదీ వరకూ పొడిగించినట్లుగా తెలిపారు. ఏ కారణం చేతనైనా ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.ఆంగ్రూ.ఏసీ.ఇన్ అను వెబ్సైట్ ను వీక్షించ వలసిందిగా కోరారు. స్థానికులు ఏవైనా సందేహాలుంటే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మారుటేరు లేదా వ్యవసాయ పాలిటెక్నిక్, మారుటేరు కార్యాలయ పని వేళలలో సంప్రదించవచ్చని తెలిపారు.

## నేడు జంగారెడ్డిగూడెంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ప్రథమ మహా సభ

జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకెఎస్) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రథమ మహాసభ జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ నందు ఈనెల 23వ తేదీ ఆదివారం జరుగుతుందని రాష్ట్ర కన్వీనర్ ఎస్.కె గౌస్ ఆదివారం మీడియాకు తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం అవుతుందని ఈ మహాసభలో దేశంలో రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం సంఘం భవిష్యత్తు కర్తవ్యాలపై సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఇల్లెందు మాజీ శాసన సభ్యులు గుమ్మడి నరసయ్య రైతు సంఘం జాతీయ కన్వీనర్ కేచ్చల రంగారెడ్డి ఓపిడిఆర్ జాతీయ అధ్యక్షులు సి.భాస్కరరావు తదితర నాయకులు పలువురు పాల్గొంటున్నారని గౌస్ తెలిపారు.

## బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా యోగ వేడుకలు

నూజివీడు/ చాట్రాయి, జూన్ 22, ప్రభాతవార్త : నూజివీడు పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం నూజివీడు పట్టణంలోని శ్రీ గురుదత్త యోగ విద్యాలయంలో జరిగిన ఈ వేడుకలలో భాగంగా ప్రిన్సిపాల్ ఆచార్య తల్లాప్రగఢ కుమార్ నేత్రుత్వంలో బిజెపి శ్రేణులు, విద్యాలయ విద్యార్థులతో కలిసి యోగ సాధన, అభ్యాసనాలు వేశారు. ఈ సందర్భంగా పట్టణ బిజెపి అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి మాట్లాడుతూ యోగ విద్యవలన శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసంతో పాటు వ్యక్తిలోని సృజనాత్మకత శక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కృషి వలన భారతీయతకు చిహ్నంగా నిలిచిన యోగ విద్య విశ్వవ్యాప్తి చెందిందని పేర్కొన్నారు. ప్రపంచదేశాలు ఈ రోజు యోగ విద్యను అభ్యసిస్తున్నాయని తెలిపారు. సాక్షాత్తు ప్రధాని మోదీ సమక్షంలో యోగాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రపంచ రికార్డు నెలకొల్పటం ఆంధ్రప్రదేశ్ కే గర్వకారణమని మల్లెపూడి నాగరాణి అన్నారు. ఈ సందర్భంగా యోగ



విద్యాలయం ప్రిన్సిపాల్ కుమార్, కళ్యాణి దంపతులను నాగరాణి, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎం. రాజశేఖర్, మాటూరి ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకురాలు శివరాజు వసుంధరదేవి, జిల్లా కార్యదర్శి మాగంటి వాసు,అనమాల నాగేశ్వరరావు, రాజేంద్ర ప్రసాద్,పార్టీ ప్రధాన కార్యదర్శులు దోసపాటి మల్లిఖార్జున జగదీష్, దద్దనాల రవికిశోర్, షేక్ బాజీమా,పార్టీ నాయకులు నక్కా నాగ శివ,శేషగిరిరావు, సత్యనారాయణాచారి,తిరువూరు గంగాధర్,షేక్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమలో పండుగ వాతావరణంలో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం జూన్ 22 ప్రభాతవార్త :అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కలెక్టరేట్ పేరెడే గ్రౌండ్స్ లో వేలాది మంది యోగాభ్యాసనలో పాల్గొనడం పండుగ వాతావరణం తలపించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం భీమవరం కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించిన యోగ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, పట్టణ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, వివిధ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు సుమారు 8 వేల మంది పాల్గొని విశాఖలో భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ పాల్గొన్న యోగా కార్యక్రమాన్ని అనుసరిస్తూ యోగా అభ్యసనాలు కొనసాగిన తీరు అత్యద్భుతం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆకాంక్ష మేరకు ముఖ్యమంత్రి సూచన మేరకు గత నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా యోగ అభ్యసన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించు కోవడం జరిగిందన్నారు. ఈరోజు 8 వేల మందితో పెద్ద ఎత్తున యోగ కార్యక్రమం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇప్పటివరకు నేర్చుకున్న యోగ అభ్యాసన నిలిపివేయకుండా ప్రతిరోజు యోగాభ్యాసం చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నారు. నెల రోజులు పాటు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు, జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేసారని కితాబిచ్చారు. ఈరోజు జిల్లా వ్యాప్తంగా 4,835 లొకేషన్స్ లో సుమారు 8 లక్షల మందితో విజయవంతంగా యోగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగింది అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రతిరోజు యోగా చేయాలని, తద్వారా శారీరిక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలిగి చదువుపై దృష్టి కేంద్రీకరించడానికి వీలవుతుం దన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యసభ సభ్యులు పాకా నారాయణ మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన భారతదేశం కోసం ప్రధాని నరేంద్ర మోడీ యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. . ప్రపంచంలో ఏ దేశంలో లేని యువత మన దేశంలో ఉన్నారని వారందరినీ ఆరోగ్యవంతులను చేయడం ద్వారా ఆరోగ్య భారత్ గా తీర్చిదిద్దాలనేదే మోడీ ఆశయం అన్నారు. ప్రపంచంలో ఈ రోజున 175 దేశాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు.



నెల రోజులుగా గ్రామ, మండల, జిల్లాస్థాయిలో నిర్వహించిన యోగ పోటీల్లో జిల్లాస్థాయిలో వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డిఓ కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, డ్వామ పీడీ డా. కే సి హెచ్ అప్పారావు, జిల్లా టూరిజం అధికారి ఎ.వి అప్పారావు, డీఈవో ఇ.నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పట్టణ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## కోర్టు ఆవరణలో యోగ దినోత్సవం

భీమవరం జూన్ 22 ప్రభాతవార్త శనివారం "అంతర్జాతీయ యోగా దినోత్సవం" దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యం లో మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ బోధకులు కె. గోపాల శర్మ కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో యోగా ఆసనాలు వేయించారు. ప్రతీ ఒక్కరూ తమ దినచర్యలో యోగాను ఒక అలవాటుగా చేసుకుంటే ఎన్నో రోగాలు రాకుండా ఉంటాయని, ఉన్న రోగాలు తగ్గుతాయని గోపాల శర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ నాగరాజు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలు సరఫరా చేసినా అమ్మినా

**సేవించినా చట్టపరంగా నేరమే .. సిఐ నాగరాజు**



భీమవరం జూన్ 22 ప్రభాతవార్త : యువత భవిష్యత్తును, కుటుంబ జీవితాలను హరిస్తున్న గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని భీమవరం వన్ టౌన్ సిఐ నాగరాజు అన్నారు. పోలీస్ ఈగల్ ఆధ్వర్యంలో భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ అవగహన ర్యాలీ నిర్వహించారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లు కదలికలపై జాగ్రత్తగా వ్యవహరించాలని, చెడు మార్గాల వైపు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వల్ల యువత శారీరకంగానూ మానసికంగానూ తీవ్రంగా బలహీన పడిపోతారని, భవిష్యత్తు నాశనం అవుతుందని, ఇటువంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మత్తు పదార్థాలు సరఫరా చేసినా అమ్మినా సేవించినా చట్టపరమైన శిక్షలకు గురవుతారన్నారు. ఈగల్ అడ్వ జర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు కిరణ్, కృష్ణాజి, బిసి హాస్టల్ వార్డెన్ కడలి శ్రీనివాస్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## శాఖంబరి దేవిగా బాలత్రిపుర సుందరిదేవి అలంకరణ



భీమవరం జూన్ 22 ప్రభాతవార్త : జ్యేష్ట మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా భీమవరం మెంటేవారితోటలోని శ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారిని శాఖంబరి దేవిగా అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ నందమూరి ఆంజనేయులు దంపతులు, కడలి సుబ్రహ్మణ్యం (బాలు) దంపతులచే అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం దాతల సహకారంతో అమ్మవారిని వివిధ రకాల ఆకూ కూరలతో శాఖంబరి దేవిగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## వేంకటేశ్వరునికి 220 గ్రాముల వెండి ఆభరణాలు అందజేత



భీమవరం జూన్ 22 ప్రభాతవార్త : భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారికి వెండి ఆభరణాలను అందించారు. ఆదివారం పట్టణానికి చెందిన కొయ్యాని వెంకన్న కృష్ణవేణి దంపతులు సుమారు 220 గ్రాములు వెండితో తయారు చేసిన రజిత వరదహస్తం, రజిత కటిహస్తం లను అందించినట్లు ఆలయ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు తెలిపారు. సుమారు రూ 32 వేలతో రజిత వరదహస్తం రజిత కటిహస్తంలను తయారు చేయించారని తెలిపారు. దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందించి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. దాతల కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 24, 25వ తేదీలలో శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి మహోత్సవం

పెనుమంట్ర, జూన్-22, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి 111వ మహోత్సవం ఈనెల 24, 25వ తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 24వ తేదీ వీరభద్రుని సంబరం, 25వ తేదీ అమ్మవారు సంబరం అత్యంత వైభవంగా జరుగునని కమిటీ తెలిపింది. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఉచ్చ కమిటీ కోరింది.



## బదిలీలు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నాం



పెనుమంట్ర, జూన్-22, ప్రభాతవార్త: వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగులు బదిలీలపై పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు రవీంద్ర రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు ఉద్యోగుల బదిలీలు అత్యంత పారదర్శకంగా జరగడానికి కృషి చేసినందుకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా బదిలీలు ఇంత పెద్ద ఎత్తున జరగడం వైద్య ఆరోగ్య శాఖలో చాలా అరుదైన అంశం అని అన్నారు.

## మానవత సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తా

### నూతన అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా తన పదవీకాలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే ఉన్నత మానవత స్వచ్ఛంద సేవా సంస్థగా కార్యవర్గం, సభ్యులు, దాతల సహకారంతో రూపొందించడానికి తన శాయిశక్తుల కృషి చేస్తానని జంగారెడ్డిగూడెం మానవత సంస్థ నూతన అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ తెలిపారు. ఆదివారం ప్రభాతవార్త ప్రతినిధి కె.రమణా రావుతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 2004 వ సంవత్సరము లో మానవతా వ్యవస్థాపకులు ఎన్ రామచంద్రారెడ్డి చే ప్రారంభించబడి,2025 లో 21వ సంవత్సరంలో అడుగు పెడుతోందన్నారు. 2004 లో 108 మంది సభ్యులతో ప్రారంభమైన సంస్థ, రాష్ట్రమంతా వ్యాపించి 130 శాఖలతో సుమారు 80వేల మంది సభ్యులతో సేవలు అందిస్తోందన్నారు. బ్లడ్ డొనేషన్, శాంతి రథం, అంబులెన్స్, మార్చురీ ఫ్రీజర్ లు, మొక్కలు నాటే కార్యక్రమం, పేద కుటుంబాలకు, విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ మెంబర్ షిప్ అమౌంట్ లు సద్వినియోగం చేస్తూ, పారదర్శకంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పనిచేస్తోందన్నారు. తన పదవీకాలంలో జంగారెడ్డిగూడెం మానవత సంస్థలో మెంబర్ షిప్ ను గణనీయంగా పెంచడానికి, సంస్థ కార్యక్రమాలను సజావుగా కార్యవర్గం, సభ్యుల సహకారంతో నిర్వహిస్తానని తెలిపారు.



జంగారెడ్డిగూడెం మానవత సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఈనెల 29వ తేదీ ఆదివారం మధ్యాహ్నం గం 2-30 నుండి గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయ సమీపంలోని మానవతా కమ్యూనిటీ భవనంలో ప్రముఖుల సమక్షంలో జరుగుతుందని నూతన అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ తెలిపారు.

**మానవత జంగారెడ్డిగూడెం మండలం 2025-26 నూతన కార్యవర్గం:**

మానవత జంగారెడ్డిగూడెం మండలం నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ, కార్యదర్శి తుట్టగుంట మధు కుమార్, కోశాధికారి ఇమ్మంది మురళి మాధవరావు, ఉపాధ్యక్షులు గంధం గోపాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి బేత రమేష్, ఈసీ అవేర్నెస్ మాతంశెట్టి నాగేశ్వరరావు, ఈసీ హెల్త్ దల్లి అప్పల రెడ్డి, ఎమర్జెన్సీ తన్నీరు రామకృష్ణ, ఎడ్యుకేషన్ దారా సురేష్ గుప్తా, ఆత్మీయ సహకారం కమిటీ చైర్మన్ గద్దే సత్యనారాయణ, కోఆర్డినేటర్ మందపల్లి అయ్యన్న లు ఎన్నికయ్యారు. ప్రస్తుతం అధ్యక్షులుగా అయినాల వెంకటరమణమూర్తి,కార్యదర్శిగా గద్దే సత్యనారాయణ, కోశాధికారిగా ఇమ్మంది మురళి మాధవరావులు ఉన్నారు. పలువురు నూతన కార్యవర్గానికి, అధ్యక్షులు అల్లూరి రామకృష్ణకు అభినందనలు తెలిపారు.

## ఐ టీ డీ ఏ లో ప్రపంచ యోగా దినోత్సవం

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: కే ఆర్ పురం ఐ టి డి ఏ కార్యాలయం వద్ద ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ కె రాములునాయక్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పాల్గొన్నారు. అదేవిధంగా ఎన్ శ్రీ విద్యా డిప్యూటీ డైరెక్టర్, పలువురు వివిధ శాఖల అధికారులు, డిఈ శ్రీనివాస రావు, కేఆర్ పురం సర్పంచ్ బొజ్జియ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. చక్రదేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద: మండలంలోని చక్రదేవరపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద యోగా దినోత్సవం జరిగింది. యోగా గురువులు అల్లూరి వెంకట్రావు(86 సం) యోగా ప్రాధాన్యతను వివరించారు. యోగా టీచర్ సత్యవతి ప్రాణాయామం, ఆసనాలు చేయించారు. యోగా గురువు వెంకట్రావు ను సర్పంచ్ సాయిల



సత్యనారాయణ, ఎంపీటీసీ సాయిల రాంబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆఫీస్ ఎ.ఓ చుక్కా గోపాలకృష్ణ, టిడిపి గ్రామ అధ్యక్షులు వైట్ల ఆంజనేయులు, జనసేన నాయకులు యడ్ల చంటి, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణాచార్యులు, పంచాయితీ సెక్రటరీ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులకు టాయిలెట్ సౌకర్యం కల్పించాలి

జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంపై అంతస్తులు ఎంపీపీ,జడ్పీటీసీ లకు ప్రత్యేకంగా అధికారులు రూమ్స్ కేటాయించారు. ఎంపీపీ కొదమ జ్యోతి ఎంపీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించి నాలుగు సంవత్సరాలు పైగా అయినా నేటికి ఆమె కార్యాలయం గదిలో ఆమెకు టాయిలెట్ సౌకర్యంను అధికారులు కల్పించలేకపోయారు. ఆమె టాయిలెట్స్ కు వెళ్లాలంటే క్రిందనున్న ఎంపీడీవో రూంకు గాని, కార్యాలయం బయట ఉన్న టాయిలెట్స్ గాని వెళ్ళవలసి పరిస్థితి ఏర్పడింది. ఇది ఇలా ఉండగా జడ్పిటిసి పోల్నాటి శ్రీనివాస్ బాబు (బాబ్జి) కి కూడా ప్రత్యేకంగా రూమ్ కేటాయించారు. ఈయన రూమ్లో టాయిలెట్ సౌకర్యం ఉంది. దీనిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. చాలా కాలం నుంచి నిరుపయోగంగా ఉంది. కనుక కనీస సౌకర్యాలు లేవు ఈ టాయిలెట్ రూమ్ లో ఏవేవో చెత్త చెదారం ఉంచారు. గురువారం జరిగిన సర్పంచ్ సమావేశమునకు హాజరైన జడ్పిటిసి పోల్నాటి బాబ్జి సమావేశంలో ఆఖరున ఆయన ఈ టాయిలెట్ కోసం క్రింద ఉన్న టాయిలెట్స్ కి వెళ్లడం జరిగింది. వీరు ఇరువురి పదవికాలం పూర్తయ్యేనాటికైనా వీరికి వారి వారి రూములలో టాయిలెట్ సౌకర్యం కల్పించాలని



ప్రజా ప్రతినిధులు,మండల అధికారులు కోరుకున్నారు. ఈ సౌకర్యం ఎప్పటికీ సమకూరునో?

# 'కన్నప్ప'లోని ప్రతీ పాత్ర హీరోనే



## ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డా.ఎం. మోహన్ బాబు..

**డైనమిక్ హీరో** విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' జూన్ 27న విడుదల కాబోతోంది. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద డా. ఎం. మోహన్ బాబు నిర్మాణంలో ముఖేష్‌కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్లు ప్రేక్షకుల్లో అంచనాలు పెంచేశాయి. విడుదల తేదీ దగ్గర పడుతున్న క్రమంలో 'కన్నప్ప' ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డా.ఎం. మోహన్ బాబు మాట్లాడుతూ,ఆ భగవంతుడి ఆశీస్సులతోనే 'కన్నప్ప' చిత్రం ప్రారంభమైంది. ఆడియెన్స్ ప్రేమ, ఆ దేవుడు ఆశీస్సులు నా బిడ్డ విష్ణుకి ఉండాలని కోరుకుంటున్నాను. ఆ పరమేశ్వరుడు ఇచ్చిన శక్తితోనే ఈ చిత్రాన్ని తీశాం. ఈ మూవీలోని ప్రతీ పాత్ర హీరోలానే ఉంటుంది. ఇందులో నటించిన ప్రతీ ఒక్కరికీ నేను ఎంతో రుణపడి ఉంటాను. నేను మహా భారతం సీరియల్‌ని ఎన్నో సార్లు చూశాను. 'కన్నప్ప' సినిమాను ఆయన అద్భుతంగా తెరకెక్కించారు. రథ సారథిగా ముందుకు తీసుకెళ్లారు. ముఖేష్ రిషి కెరీర్ ఆరంభం నుంచీ మా ఫ్యామిలీతో ఉంటున్నారు. ఈ గిరిజన ప్రతినిధుల్ని పిలవడానికి కారణం ఉంది. కులాలు, మతాలు అనేవి లేవు అని చెప్పడానికి అందరినీ పిలిచాం. తిన్నడు బోయ కులానికి చెందినవాడు. తల్లీతండ్రి తప్ప మరో దైవం లేరని చెప్పేవాడు తిన్నడు. ఆ తిన్నడు కన్నప్పగా ఎలా మారాడన్నదే ఈ కథ. ఆకెళ్ల ఈ చిత్రానికి అద్భుతమైన మాటలు అందించారు. ఆ శివుడి ఆశీస్సులతో మే 27న రాబోతోన్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

విష్ణు మంచు మాట్లాడుతూ, 'కన్నప్ప' విష్ణు సినిమా కాదు. ఇది కన్నప్ప నినిమా. ఎడిటింగ్ టేబుల్ మీద ఈ చిత్రాన్ని చూసినప్పుడు వావ్ అనిపించింది. 'కన్నప్ప' అనేది శివానుగ్రహంతోనే జరిగింది. ఈ ప్రయాణంలో నాకు విజయ్, వినయ్ వెన్నంటే ఉన్నారు. 2017లో స్టీఫెన్ దేవస్సీని కలిశాను. ఈ కన్నప్పని ఎప్పుడు చేస్తాను.. ఎలా చేస్తాను అన్నది చెప్పలేను.. కానీ ఎప్పుడు చేసినా కూడా మీరే మ్యూజిక్ ఇవ్వాలని స్టీఫెన్‌కి అప్పుడే చెప్పాను. ఈ కథ కోసం పరుచూరి గోపాలకృష్ణ చాలా కష్టపడ్డారు. శివ బాలాజీ చేసిన సాయాన్ని బయటకు చెప్పలేను. మోహన్‌లాల్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. మా కోసం వచ్చిన అక్షయ్ కుమార్‌కి థాంక్స్. శరత్ కుమార్‌తో పని చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటూ ఉన్నాను. తమిళంలో ఈ చిత్రం పెద్ద స్థాయిలో రిలీజ్ అవుతోందంటే దానికి శరత్ కుమార్ కారణం. నా కెరీర్‌లో ఉన్న దర్శకులందరిలోనూ ముఖేష్ ది బెస్ట్. కన్నప్ప ప్రయాణం అంత సులభంగా ఏమీ జరగలేదు. ఎన్నో బాధలు పడ్డాం. అసలు ఈ చిత్రాన్ని ఎందుకు తీస్తున్నావ్ అని శివరాజ్ కుమార్ అడిగారు. 50 ఏళ్ల తరువాత మళ్లీ మన కన్నప్ప గురించి ఈ తరానికి చెప్పాలని ఆ శివుడే నాతో ఈ మూవీని తీయించారేమో అని శివన్నతో అన్నాను. స్టీఫెన్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. స్నేహంలో కృష్ణుడిగా, కర్ణుడిగా రెండు రకాలుంటాయి. నా జీవితంలో కృష్ణుడిగా ప్రభాస్ ఉంటారు. అసలు ఈ చిత్రాన్ని చేయాల్సిన అవసరం ప్రభాస్‌కి లేదు. నాన్నమీదున్న గౌరవంతోనే ప్రభాస్ ఈ మూవీని చేశారు. స్టార్‌గా కంటే.. ప్రభాస్ మానవత్వం ఇంకెంతో గొప్పగా ఉంటుంది. కొంత డబ్బు, పేరు వచ్చినా అంతా మారిపోతారు. కానీ ప్రభాస్ మాత్రం ఇంకా అలానే ఒదిగి ఉంటారు. మా చిత్రం జూన్ 27న రాబోతోంది. శివుని ఆశీస్సులు, ఆడియెన్స్ ప్రేమతో పెద్ద విజయం సాధిస్తుందని భావిస్తున్నాను అని అన్నారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్యే మెడియం బాబూరావు మాట్లాడుతూ,గిరిజనుల ప్రతినిధులుగా మా అందరినీ పిలిచి సన్మానం చేసిన కన్నప్ప టీంకి, మోహన్ బాబుకి, విష్ణుకి థాంక్స్. నేను వ్యక్తిగతంగా తిన్నడు లాంటి వాడిని. కన్నప్ప చరిత్ర భక్తికి నిర్వచనం. ఇప్పుడు ఇలాంటి చిత్రాలే రావాలి. కన్నప్ప లాంటి సినిమా గొప్ప విజయాన్ని సాధించాలి అని అన్నారు.

ముఖేష్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ, జన్మభూమిని, కర్మభూమిని మర్చిపోకూడదు. నాకు హైదరాబాద్ కర్మభూమిలాంటిది. మోహన్ బాబు నన్ను నమ్మి ఇక్కడకు తీసుకు వచ్చారు. 'కన్నప్ప'ను నాకు ఇచ్చినందుకు మోహన్ బాబుకి థాంక్స్. విష్ణు రేర్ యాక్టర్. ఒకటి, రెండు టేక్స్‌లోనే అన్ని సీన్లను చేసేశారు. ఆయన నటనస్థాయిని అందరూ చూడబోతోన్నారు. ప్రభాస్ పాత్ర గురించి ఇప్పుడు నేను ఏమీ చెప్పను. ప్రభాస్ చాలా హంబుల్, సింపుల్ పర్సన్. 'కన్నప్ప'కు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నా టీం లేకపోతే ఈ సినిమా ఇంత బాగా వచ్చేది కాదు. స్టీఫెన్ పాటలు కంటే, ఆర్ఆర్ అందరినీ మరింతగా సర్ ప్రైజ్ చేస్తుంది. జూన్ 27న మా చిత్రం రాబోతోంది అని అన్నారు. బ్రహ్మానందం మాట్లాడుతూ, 'కన్నప్ప'సినిమాను శివ తత్వం వ్యాప్తి చేయడానికి తీశారు. అందరికీ ఒకేలా చూసే ఆ శివుడి గురించి ప్రపంచానికి చెప్పేందుకు మోహన్ బాబు , విష్ణులాగా ఈ మూవీని ముందుకు తీసుకు వస్తున్నారు. కన్నప్ప ఒక చరిత్ర అవుతుంది. ఈ సినిమాను, ఈ పాత్రధారులని ఆ శివుడే ఎంచుకున్నాడు. జూన్ 27న కన్నప్ప రాబోతోంది. ఈ భూమ్మీద 'కన్నప్ప' అనేది గొప్ప చిత్రం అవుతుందని అన్నారు. మైత్రి శశి మాట్లాడుతూ,నైజాంలో మొదటగా మేం ప్రభాస్ హీరోగా చేసిన 'ఆదిపురుష్'ని రిలీజ్ చేశాం. ఆ తరువాత 'హను మాన్' వచ్చింది. ఇక ఇప్పుడు 'కన్నప్ప'ను రిలీజ్ చేస్తున్నాం. మాకు ఈ అవకాశం ఇచ్చిన మోహన్ బాబుకి, విష్ణుకి థాంక్స్. ఆల్రెడీ కొన్ని సీన్లను చూశాను. సినిమా అద్భుతంగా వచ్చింది అన్నారు. బీవీఎస్ రవి మాట్లాడుతూ, 'కన్నప్ప' సినిమా కోసం పరుచూరి గారు ఎంతో కష్టపడ్డారు. మోహన్ బాబు ఈ మూవీని నిర్మిస్తున్నారు.. విష్ణు నటిస్తున్నారంటే మొదట్లో భయపడ్డాను. ఇంతభారీగా ఖర్చు పెట్టి తీయడం అవసరమా? అని వాళ్ల మీద ఇష్టంతో భయపడ్డాను. న్యూజిలాండ్ నుంచి దిగి వచ్చిన తరువాత బ్రహ్మీజీ ఈ మూవీ గురించి అద్భుతంగా చెప్పారు. నా కోసం మోహన్ బాబు ఈ మూవీని చూపించారు. ఫస్ట్ హాఫ్ చూడంగానే ఒళ్లు జలదరించిది. సినిమా చూసిన తరువాత నా కళ్లన్నీ ఆనంద భాష్పాలతో నిండిపోయాయి. స్టీఫెన్‌కు సెల్యూట్ చెప్పాల్సిందే. ప్రభాస్ ఎంట్రీ తరువాత సినిమా మరోస్థాయికి వెళ్తుంది. అన్నారు. ముఖేష్ రిషి మాట్లాడుతూ, 'కన్నప్ప' నాకు ఎంతో ప్రత్యేకం.ఎంతో సంకల్ప బలం ఉంటే కానీ ఈ చిత్రాన్ని తీయలేరు. మోహన్‌బాబు ,విష్ణువల్లే ఈ మూవీ ఈ స్థాయికి వచ్చింది. జూన్ 27న రాబోతోన్న 'కన్నప్ప'ని, అందులో ప్రభాస్‌ని చూసి అందరూ ఎంజాయ్ చేస్తారు అని అన్నారు.

# 'షోటైం' మూవీ జూలై 4న విడుదల

**అనిల్ సుంకర** ప్రౌడ్లీ ప్రెజెంట్.. స్కై లైన్ మూవీస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కిషోర్ గరికిపాటి నిర్మాతగా మదన్ దక్షిణామూర్తి దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం షో టైం. నవీన్ చంద్ర హీరోగా మీనాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ అద్భుతమైన ఎంటర్టైన్మెంట్ చిత్రం జూలై 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ప్రజెంట్ చేస్తున్నారు. ఈ మేరకు హీరో అడవి శేషు చేతుల మీదుగా షో టైమ్ మూవీ విడుదల తేదీని ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రేక్షకుడిని థియేటర్లో కట్టిపడేసి, అన్ని వర్గాల ప్రేక్షకులను రంజింపజేసే అద్భుతమైన కంటెంట్ షో టైం మూవీలో ఉందని చిత్ర యూనిట్ తెలిపింది. హీరో నవీన్ చంద్ర నటనకు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. అలాగే బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ కామాక్షి భాస్కర్ల ఈ చిత్రంలో ఒక అద్భుతమైన పాత్రతో ప్రేక్షకులను కట్టిపడయనున్నట్లు తెలుస్తోంది. విభిన్న పాత్రలతో అలరించే రాజా రవీంద్ర ఈ సినిమాలో మరో అద్భుతమైన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. అలాగ విలక్షణ నటుడు నరేష్ ఈ సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలవబోతున్నారు అని మేకర్ అభిప్రాయపడుతున్నారు. ఇక యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న హీరో నవీన్ చంద్ర



వరుసగా హిట్ సినిమాలతో దూసుకుపోతున్నారు. ఇటీవల ఆయన నటించిన ఎలెవన్ చిత్రానికి మంచి ఆదరణ లభించింది. పోలీస్ క్యారెక్టర్‌లో ఆయన కనబరిచిన నటనకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. అలాగే 28 డిగ్రీ సెల్సియస్ సినిమాకు సైతం మంచి ప్రశంసలు వచ్చాయి. వినూత్నమైన పాత్రలతో పాటు అద్భుతమైన సబ్జెక్టును అందించే హీరో నవీన్ చంద్ర నుంచి వస్తున్న ఈ షో టైం సినిమా కోసం ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తూ ఉన్నారు.

జూలై 4న ఈ సినిమా విడుదల అవబోతున్న సందర్భంగా ఈపాటికే సామాజిక మాధ్యమాలల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. షో టైం మూవీ కచ్చితంగా ప్రేక్షకుల హృదయాలను కొల్లగొడుతుం దని చిత్ర యూనిట్ నమ్మకం వ్యక్తం చేస్తోంది.

# "స్కై" సినిమా నుంచి లిరికల్ సాంగ్ విడుదల

**మురళీ కృష్ణంరాజు,** శృతి శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'స్కై'. ఈ చిత్రాన్ని వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ బ్యానర్‌లో నాగి రెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీ లక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మిస్తున్నారు. పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వం వహిస్తున్నారు.



త్వరలో ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు 'స్కై' సినిమా నుంచి 'తపనే తెలుపగ..' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. 'తపనే తెలుపగ..' పాటకు పృథ్వీ పెరిచెర్ల అందమైన లిరిక్స్ అందించగా వైష్ణవి ఆకట్టుకునేలా పాడారు. మ్యూజిక్ డైరెక్టర్ శివ ప్రసాద్ బ్యూటిఫుల్ మెలోడీ ట్యూన్ తో కంపోజ్ చేశారు. 'తపనే తెలుపగ..' పాట ఎలా ఉందో చూస్తే 'తపనే తెలుపగ పలుకే, ఉసురే నిలిపెను పిలుపే, మనవే వినగా మనసే, మదినే గుడిలా మలిచే, అలసిన సమయం జతగా, అనుమతి అడగక రావా, కురిసెను విరహం కనులా, రగిలిన హృదయపు సడిలో..' అంటూ సాగుతుంది పాట. హీరో హీరోయిన్స్ మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టిపై కూల్ మెలోడీగా ఆహ్లాదకరమైన లొకేషన్స్‌లో ఈ పాటను చిత్రీకరించారు.

# ఆసక్తి పెంచిన 'సః కుటుంబానాం' టీజర్

**ఈ మధ్యకాలంలో** కంటెంట్ ఉన్న సినిమాలు ఏ రేంజ్‌లో ప్రేక్షకులని ఆకట్టుకుంటున్నాయో చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమా కూడా అలాంటి కోవలోకే వెళ్తుంది అని చెప్పచ్చు. ఫ్యామిలీ మ్యాన్ అనిపించుకుంటున్న కథానాయకుడు ఫ్యామిలీని హేట్ చేస్తూ కనిపించిన ఈ టీజర్‌తో కథ తాలూకు కొత్తదనం చెప్పకనే చెప్పారు దర్శక రచయిత ఉదయ్ శర్మ. మణిశర్మ సంగీతం అందించిన ఈ సరికొత్త కుటుంబ కథా చిత్రంలో రాజేంద్రప్రసాద్, రామ్ కిరణ్, మేఘా ఆకాష్, బ్రహ్మానందం, సత్య, గిరి, భద్రం ముఖ్య తారాగణంగా



ప్రేక్షకులని అలరించబోతున్నారు.

ఈ చిత్ర టీజర్ విషయానికి వస్తే ఒక పక్క నుండి అర్జున్ రెడ్డి లాంటి వైబ్స్ కనిపిస్తూనే మరోపక్క కుటుంబ సమేతంగా చూసే చిత్రం అని అర్థమవుతుంది. టీజర్‌లోని ప్రతి డైలాగ్, విజువల్ ఎంతో అద్భుతంగా ఉన్నాయి. అలాగే సత్య, బ్రహ్మానందం హాస్యం చిత్రంలో బాగా పండుతుందని అనిపిస్తుంది. మేఘా ఆకాష్ మంచి క్యారెక్టర్ ప్లే చేసినట్లు అర్థమవుతుంది. రామ్ కిరణ్ ఈ చిత్రం ద్వారా ఇండస్ట్రీలో ఒక మార్క్ సృష్టిస్తారు నడిపించేలా తన ప్రెసెన్స్ పర్ఫార్మెన్స్ కనిపిస్తుంది. కుటుంబం విషయాలలో హీరో ఉద్దేశం అందరిలా సహజంగా ప్రేమగా కాకుండా కాస్త కొత్తగా ఉంటుందని ఈ చిత్ర టీజర్ అనిపిస్తుంది. టీజర్‌లోని సంగీతం చాలా బాగుంది. త్వరలోనే విడుదల అవనున్న ఈ చిత్రం ప్రేక్షకులకు చక్కటి తెలుగింటి భోజనం అందించనుంది.

# 'యుఫోరియా' చిత్రం నుంచి సాంగ్ లాంచ్

**వినూత్న కథలతో** సక్సెస్ ఫుల్ డైరెక్టర్‌గా పేరు సంపాదించుకున్న గుణ శేఖర్ రూపొందిస్తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'యుఫోరియా'. సమకాలీన అంశాలతో, లేట్ నైట్ కల్చర్, డ్రగ్స్, యువత అనే కాన్సెప్ట్‌తో ఈ మూవీని గుణ శేఖర్ తెరకెక్కిస్తున్నారు. రిలీజ్‌కు సిద్ధమవుతోన్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫ్లై హై సాంగ్‌తో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఈ మూవీ నుంచి 'రామ రామ..' సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భూమిక, విఘ్నేష్ గవిరెడ్డి, రోహిత్, డైరెక్టర్ గుణశేఖర్, నీలిమ గుణ, ఎడిటర్ ప్రవీణ్ పూడి, ఆదిత్య మ్యూజిక్ మాధవ్, మాస్టర్ ఆరుష్, యానీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా...

చిత్ర దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ, నాతో పాటు రాగిణి, నీలిమ, యుక్త కలిసి 'యుఫోరియా' సినిమాను తీశారు. కుటుంబ సమేతంగా చూసేలా ఈ సినిమాను తెరకెక్కించాం. అందరూ కనెక్ట్ అయ్యేలా ఆహ్లాదకరంగా చక్కటి మెసేజ్‌తో సినిమాను తెరకెక్కించాం. ఫ్లై హై అనే పాటతో అందరినీ మెప్పించిన కాల భైరవ ఇప్పుడు రామ రామ అనే సాంగ్‌తో మన ముందుకు వచ్చారు. ప్రవీణ్ కె.పోతన్ అనే సినిమాటోగ్రాఫర్‌ను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాను. ఇందులో విఘ్నేష్ గవిరెడ్డి కథానాయకుడిగా కనిపించబోతున్నాడు. రోహిత్‌గారు ఈ సినిమాలో చాలా చక్కగా నటించారు. చాలా రోజుల తర్వాత భూమిక మా సినిమా ద్వారా...చాలా మంచి పాత్రలో రీఎంట్రీ ఇచ్చారు అన్నారు.

నటి భూమిక మాట్లాడుతూ , 'యుఫోరియా' నా హృదయానికి ఎంతో దగ్గరైన సినిమా. ఈ మూవీ నుంచి విడుదలైన 'రామ రామ' సాంగ్ ఎంతో నచ్చింది. కాల భైరవ మంచి సంగీతాన్ని అందించారు. ఈ సినిమా మనపై ఎంతో ఇంపాక్ట్ చూపిస్తుందని నమ్ముతున్నాను. తల్లిదండ్రులు తప్పకుండా చూడాల్సిన సినిమా అన్నారు. ఎడిటర్ ప్రవీణ్ పూడి మాట్లాడుతూ, 'యుఫోరియా' నుంచి 'రామ రామ' సాంగ్ రిలీజ్ కావటం చాలా ఆనందంగా ఉంది. గుణ శేఖర్ తెరకెక్కించిన చూడాలని ఉంది సినిమాకు నేను అసిస్టెంట్ ఎడిటర్‌గా వర్క్ చేశాను. అప్పుడు ఆయన్ని ఎలాగైతే చూశానో, ఇప్పటికీ అలాగే ఉన్నారు. తన సినిమాల ద్వారా సొసైటీకి ఏదైనా చెప్పాలని అనుకుంటారు. అలాంటి వ్యక్తులు ఈ సొసైటీకి ఎంతో అవసరం. యుఫోరియా ప్రస్తుతం ఉన్న పరిస్థితులను ఆవిష్కరిస్తుంది. అందరూ చూడాల్సిన సినిమా ఇది అన్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ, 'యుఫో రియా' నుంచి రిలీజైన రామ రామ సాంగ్ చూస్తుంటే నాకు ఒక్కడు సిని మాలో చెప్పవే చిరుగాలి సాంగ్‌లో ఆమెను చూసినట్లే అనిపించింది. కాల భైరవగారు బ్యూటీఫుల్ మ్యూజిక్ అందించారు. అందరికీ థాంక్స్ అన్నారు.యాక్టర్ విఘ్నేష్ మాట్లాడుతూ, 'యుఫోరియా' అందరూ చూడాల్సిన సినిమా. భూమికగారు నాకెంతో కంఫర్ట్ ఇచ్చారు.ఇందులో నేను ఆమె కొడుకు పాత్రలో కనిపించబోతున్నాను. నిజాయతీగా చేసిన సినిమాఇది. అందరూ సపోర్ట్ చేయాలని కోరుకుం టున్నాను అన్నారు. రోహిత్ మాట్లాడుతూ, 'యుఫోరియా' సినిమా మన అందరి కోసం చేసిన సినిమా. గుణశేఖర్ ఇప్పటి జనరేషన్‌ను దృష్టిలో పెట్టుకుని సినిమా చేశారు. విఘ్నేష్ డెబ్యూ సినిమా అయినప్పటికీ చక్కగానటించాడు. భూమికతో కలిసి పనిచేయటం మెమరబుల్ ఎక్స్‌పీరియెన్స్. ఆయన దర్శకత్వంలో సినిమా చేయటాన్ని అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.



# 'ఘాటి' ఫస్ట్ సింగిల్ రిలీజ్

**క్వీన్ అనుష్క శెట్టి,** క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఘాటి' గ్లింప్స్‌లో ఇంటెన్స్ వైలెంట్ క్యారెక్టర్‌లో అందరినీ ఆశ్చర్యపరిచారు. తమిళ స్టార్ విక్రమ్ ప్రభు ఇంటెన్స్ అవతార్‌లో కనిపించిన క్యారెక్టర్ గ్లింప్స్ సినిమాపై ఉన్న బజ్‌ను మరింత పెంచింది. ఘాటిని గేజు క్రియేషన్స్ సమర్పిస్తుంది. రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మిస్తారు. ఘాటి జూలై 11న రిలీజ్ కానుంది.

మేకర్స్ తాజాగా జానపద ఊపుతో నిండిన పాట "సైలోర్ట..." సాంగ్‌ని విడుదల చేశారు. ఇది ఓ ఎనర్జిటిక్ బ్లాస్టర్‌లా ఉంది. ప్రకృతిసౌందర్యంతో నిండిన అడవులను నేపథ్యంగా చేసుకున్న ఈ ఫోక్ వెడ్డింగ్ యాంథమ్‌లో లీడ్ పెయిర్ ఉత్సవంగా కనిపించి ప్రేక్షకులను అలరించారు. అనుష్క, విక్రమ్ కొత్తగా పెళ్లి అయిన జంటగా సంగీతం, నృత్యం, సాంస్కృతిక వెలుగులతో చుట్టూ ఉంటూ అడవిని రంగుల విందుగా, మేళా తాళాలతో, భావోద్వేగాలతో నింపారు. నాగవెల్లి విద్యాసాగర్ స్వరపరిచిన ఈ మనసును తాకే పాట జానపదపు స్వరాలను భావోద్వేగాలకు మిళితం చేస్తూ అద్భుతంగా వుంది. కృష్ణ రాసిన సాహిత్యం హుషారు వుంది. లిప్సిక భాష్యం, సాగర్ నాగవెల్లి, సోనీ కోమండూరి ఆలపించిన ఈ పాట ఉత్సవాన్ని మరింత పెంచింది. రాజు సుందరం కోరియోగ్రఫీ అద్భుతంగా వుంది. ఘాటి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషలలో పాన్ ఇండియా విడుదల అవుతుంది.






# 'జన నాయకుడు' మూవీ నుంచి ఫస్ట్ రోర్ రిలీజ్

**దళపతి విజయ్** నటిస్తోన్న 'జన నాయకుడు' చిత్రాన్ని హిస్టారికల్ మూవీగా అందరూ అభివర్ణిస్తున్నారు. అందుకు కారణం ఆయన నటిస్తోన్న చివరి చిత్రమిది. దళపతి విజయ్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఫస్ట్ రోర్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇప్పుడీ గ్లింప్స్ ఇంటర్నెట్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఆయన చివరి చిత్రం కావటంతో ఈ లెజెండ్రీకి వీడ్కోలు పలకటానికి బీజం చేసినట్లు గ్లింప్స్ చూస్తుంటే అర్థమవు తుంది. 65 సెకన్ల వ్యవధి ఉన్న 'జన నాయకుడు' ఫస్ట్ రోర్ వీడియోను గమనిస్తే, 'నా హృదయంలో ఉండే..' అనే మాటలు విజయ్ వాయిస్‌లో మనకు వినిపిస్తాయి. పోలీస్ డ్రెస్‌లో లాఠీ పట్టుకుని యుద్ధ వాతావరణాన్ని తలపించే ప్రదేశంలో నడుస్తూ వస్తుంటారు. ఈ విజువల్స్ చూస్తుంటే మైండ్ బ్లోయింగ్‌గా ఉన్నాయి. శక్తి, శాంతి, గంభీరతను కలగలిపేలా ఉన్న ఈ సన్నివేశం చూస్తుంటే జన నాయగన్ మూవీ దళపతి విజయ్‌కి సాధారణ వీడ్కోలు కాబోదనే సంకేతాన్ని స్పష్టంగా ఇస్తోంది. ఫస్ట్ రోర్ వీడియోతో పాటు విడుదలైన బర్త్ డే పోస్టర్ మరింతగా మెప్పిస్తోంది. పెద్ద సింహాసనం మీద దళపతి విజయ్ ఠీవిగా కూర్చుని చేతిలో కత్తిని పట్టుకున్నాడు. ఇన్‌టెన్స్ బ్యాక్‌డ్రాప్‌లో కూర్చున్న విజయ్ చుట్టూ పొగ ఆవరించబడి ఉంది. ఈ పోస్టర్ చూస్తుంటే ఓ రాజు, యోధుడు, నాయకుడు కలిసిన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి మన కథానాయకుడని పవర్‌ఫుల్ పోస్టర్ చూస్తుంటే స్పష్టమవుతుంది. జననాయకుడు.. దళపతి విజయ్ నటిస్తోన్న చివరి చిత్రం కావటంతో దీని చుట్టూ ఓ భావోద్వేగం నిండి ఉంది. ఇది కేవలం సినిమా మాత్రమే కాదు, స్టార్‌డమ్‌కి అర్థాన్ని మార్చేసిన హీరో కెరీర్‌కి ఇస్తున్న ముగింపుగా భావిస్తున్నారు. ఇది ఓ వ్యక్తి ఉద్యమంగా మారాడో తెలియజేసే గొప్ప నివాళి. భావోద్వేగమైన కథలను చెప్పటంలో దిట్ట అయిన హెచ్.వినోద్ జన నాయగన్ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా అనిరుద్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నారు. విజయ్, అనిరుద్ కాంబోలో ఇది వరకే ఎన్నో బ్లాక్ బస్టర్ పాటలు వచ్చిన సంగతి తెలిసిందే. మరోసారి ఈ కాంబో ప్రేక్షకులందరికీ అద్భుతమైన అనుభూతినివ్వనుంది.



# మొక్కలు ప్రకృతిలో భాగం



పిల్లల్ని, పెద్దల్నీ ప్రకృతికి దగ్గర చేసే లక్ష్యంతో 'నేచర్ వాక్స్'ని చేశారు హైదరాబాద్‌కు చెందిన కొబితా దాస్ కొల్లి ప్లాంట్ సైన్సెస్‌లో మాస్టర్స్, ప్లాంట్ ఫిజియాలజీలో ఎంఫిల్ చేసిన కాబితా.... దశాబ్దంపాటు ఇంజనీరింగ్ రంగంలో పనిచేశారు. విద్యారణ్య స్కూల్లో 22 ఏళ్లుగా నేచర్, గార్డెనింగ్ యాక్టివిటీలు ఉన్నారు. వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ రిసోర్స్ పర్సన్ కూడా. ప్రకృతిలో ఉన్నప్పుడు అన్ని ఇంద్రియాలూ అద్భుతంగా పనిచేస్తాయనీ, ప్రకృతితో మమేకమవ్వడం, దాని గురించి తెలుసుకోవడంవల్ల చాలా మార్పు వస్తుందనీ చెబుతారు కొబిత. 'ప్రకృతికి మించిన గురువు లేదు. మంచి విద్యా ఉపకరణం కూడా. అందుకే నేచర్ వాక్స్ ద్వారా హైదరాబాద్, పరిసర ప్రాంతాలను వృక్షాల గురించి అవగాహన కల్పిస్తుంది. పర్యావరణంలో అన్నీ నాకు అద్భుతమనిపిస్తాయి. ముఖ్యంగా ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు ఉంటే హైదరాబాద్ లాంటి ప్రాంతంలో అరుదైన వృక్ష జాతులు కనిపించగానే ఎంతో సంబరంగా ఉంటుంది. మొక్కలు, కొమ్మలు, ఆకులు, పూలు... ఎంతో భిన్నంగా ఉంటాయి. వాటి వెనక ఒక కారణం ఉంటుంది. అవన్నీ పిల్లలకు ఆసక్తికరంగా చెబుతా. మొక్కలు చోట స్థిరంగా ఉండేటటువంటి ఆ పరిసరాల్లో ఎలా ఉంటాయో అవి వివరిస్తా తామూ ప్రకృతిలో భాగమని పిల్లలకు అర్థమయ్యేలా చేస్తా అంటారీమె. ప్రకృతికి దగ్గరైతే అది కళలు, సైన్స్, టెక్నాలజీ అన్నింటిలో రాణించేలా స్ఫూర్తినిస్తుందనీ, ఏకాగ్రత పెరిగి పిల్లల ఆలోచనల్లో మార్పు కనిపిస్తుందనీ వివరించారు. ఇలాంటి వాక్స్ 'పర్యావరణ హితమైన జీవనానికి ఇష్టపడతారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ దృఢంగా నిలవాలి. కొన్ని అంశాలు ప్రకృతిలో చూపించాక, పాఠ్యాంశాల్ని అర్థం చేసుకోవడం తేలిక అవుతుంది' అని చెబుతారు కొబితా.

# చేతిలో కళ మనసులో పట్టుదల



**మనకున్న కళ ఎప్పుడు ఎలా ఉపయోగపడుతుందో తెలీదు. అలా రాజీబెన్ వాంకర్‌కు ఉన్న ఓ నైపుణ్యం... తన కుటుంబాన్ని నిలబెట్టడమేకాదు, పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషించేలా చేసింది. ప్రెసిడెంట్ అవార్డును అందుకునేలా చేసింది.**

గుజరాత్‌లోని రాజ్ ఆఫ్ కచ్ ప్రాంతంలో కోటే అనే చిన్న గ్రామం రాజీబెన్. ఆమెది నేత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న వాంకార్ సామాజిక వర్గం. అయితే, వాళ్ల నాన్నే ఈ వృత్తి, వద్దనుకుని వ్యవసాయంలోకి దిగారు. కానీ, నేతపై ఆసక్తితో నేర్చుకుంటానని ఆమె వాళ్ల



నాన్నను. అడిగితే అమ్మాయిలకు అన్నీ ఎందుకన్నారాయన. దాంతో నాన్నకు తెలీకుండా బాబాయి వద్ద నేర్చుకుని, 14 ఏళ్లకే అందులో ప్రావీణ్యం సంపాదించింది. అయితే, 2000 సంవత్సరంలో కచ్‌లో తీవ్ర కరవు వచ్చి, రాజీ తండ్రి చేస్తోన్న వ్యవసాయం నష్టాల్లో కూరుకుపోయింది. జీవనాధారం. లేకుండాపోయింది. అప్పుడు రాజీ 'చేనేతను తిరిగి ప్రారంభిస్తాన'ని ముందుకొచ్చి, కుటుంబానికి అండగా నిలిచింది. అయితే, 18 ఏళ్లకే రాజీకి పెళ్లిచేశారు అమ్మానాన్న. అత్తింటివారు రాజీ చేనేత వృత్తిలో కొనసాగటానికి అంగీకరించలేదు. దాంతో దాన్ని వదిలేసి కుటుంబంపై దృష్టి పెట్టింది. వెంటవెంటనే ముగ్గురు పిల్లలు దురదృష్టవశాత్తూ అప్పుడే తన భర్త గుండెపోటుతో మరణించారు. అప్పటికి ఆమె వయసు 30. పిల్లలు చిన్నవాళ్లు ఏం చేయాలో అర్థం కాలేదు. ఓ చిన్న టెంట్ వేసుకుని పిల్లలతో జీవించేది. వాళ్లను పోషించడానికి రెండేళ్లు పొలంలో కూలీపని చేసింది.

అప్పుడే ఖామిర్ అనే ఎన్జీవో నేతలకోసం వెతుకుతోందని తెలిసి, జీతానికి చేరింది. అయితే, 2012లో ఓ విదేశీ డిజైనర్‌తో ప్లాస్టిక్‌తో తయారు చేసిన బ్యాగ్ ఒకటి తీసుకొచ్చింది, ఇలాంటివి చేయాలని కోరింది. అందుకు అంగీకరించిన రాజీ ఆవిడకు కొన్నింటిని ఇచ్చి ఖామిర్ షాపులో ఉంచింది. వాటికి మంచి ఆదరణ దక్కింది. ఆ తరువాత సంస్థ తరపున లండన్ వెళ్లి అక్కడ తన నైపుణ్యాన్ని ప్రదర్శించడమే కాదు, వాళ్లకు నేర్పించడం. 'అక్షరం ముక్క రాణి నేను ఇతరులకు నేర్పించగలిగాను' ననే ఆత్మవిశ్వాసంతో సొంతంగా వ్యాపారం ప్రారంభించింది. చుట్టుపక్కల గ్రామాల్లోని మహిళలతో స్వయం సహాయక సంఘంగా ఏర్పడింది. గ్రామాల నుంచి పాలిథీన్ కవర్లు, ర్యాపర్లు... ఇలా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ సేకరించి రీసైకిల్ చేస్తుంది. వాటితో ల్యాప్టాప్ బ్యాగులు, ట్రేలు, యోగా మ్యాట్లు, ఆఫీస్ బ్యాగులు, బాటిల్ కవర్లు, పౌచ్లు, ప్లాంటర్లు.... ఇలా వివిధ రకాల ఉత్పత్తులను తయారుచేసేది. వాటిని ఓ వెబ్‌సైట్ నడిపే సంస్థకు అందిస్తుంది. అలా ఇప్పటికే లక్షల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సంచులను రీసైకిల్ చేసింది. ఇది తనకు మంచి ఆదాయం ఇవ్వడమేకాదు, పర్యావరణానికి మేలు చేసే కీలక ఇనిషియేటివ్‌గానూ గుర్తింపు తీసుకొచ్చింది. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో రాజ్ చూపించిన చొరవగానూ భారత రాష్ట్రపతి చేతుల మీదుగా 2023లో 'స్వచ్ఛ సుజల్ శక్తి సమ్మాన్' అవార్డు అందుకుంది. ఇప్పుడామె పిల్లల చదువు పూర్తిచేసి ఉద్యోగాల్లో స్థిరపడింది. చేతిలో కళ మనసులో పట్టుదల ఈ రెండూ ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవచ్చని నిరూపించింది రాజీ.

## పంజాబీ ఛోలే..



**కావలసినవి :** శనగలు-2 కప్పులు, టొమాటో గుజ్జు- రెండున్నర కప్పు, ఉల్లి తరుగు కప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద- ఒకటిన్నర చెంచా, యాలకులు -5, బిర్యానీ ఆకులు-2. దాల్చినచెక్క-అంగుళం ముక్క మిరియాలు పావు చెంచా , లవంగాలు -4, ఉప్పు-తగినంత, ఛోలే మసాలా-3 చెంచాలు, గరం మసాలా - పావు చెంచా, కారం-అర చెంచా, కొత్తిమీర, తరుగు-అర కప్పు, జీలకర్ర పొడి-ఒకటిన్నర చెంచా, సన్నగా తరిగిన అల్లం పావుచెంచా,మెంతి ఆకుల పొడి-అర చెంచా, నూనె-2 చెంచాలు, నెయ్యి-ఒక టేబుల్ స్పూన్.

**తయారీ :** శనగలు ముందు రోజు రాత్రి నానబెట్టి, ఆ నీళ్లు తీసేయాలి. వాటికి ఐదు కప్పుల నీళ్లు, ఉప్పు జతచేసి కుక్కర్‌లో ఐదు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. కడాయిలో నూనె వేడయ్యాక బిర్యానీ ఆకులు, దాల్చినచెక్క మిరియాలు, యాలకులు, లవంగాలు వేయాలి. మంచి వాసన వస్తుండగా అల్లం వెల్లుల్లి ముద్ద , ఉల్లి తరుగు వేసి బంగారు రంగు వచ్చేవరకూ వేగనివ్వాలి. అందులో టొమాటో గుజ్జు వేసి ఉడికించాలి. మధ్యలో అడుగంటకుండా కలియబెడుతుండాలి. పావు గంట తర్వాత ఛోలే మసాలా, కారం ఉప్పు, జీలకర్ర పొడి, ఉడికించిన శనగల, కప్పు నీళ్లు ఇంకో ఆరేడు నిమిషాలు ఉడికించాలి. నీళ్లు ఇగిరి, చక్కగా ఉడికిందనుకున్నాక.. నెయ్యి, అల్లం తరుగు, గరం మసాలా, మెంతి ఆకులు పొడి, కొత్తిమీర తరుగు వేసి కలియబెట్ట దించేయాలి. అంతే ఘుమఘుమలాడే పంజాబీ ఛోలే తిని ఆనందించడమే తరువాయి.

# సుఖ ప్రసవానికి భద్రాసనం



చేసే విధానం: దీనికే సీతాకోక చిలుక భంగిమ అని పేరు. ముందుగా మ్యాట్‌పై కూర్చొని రెండు కాళ్లను చాచి ఉంచి, విశ్రాంతి పొందండి ఇప్పుడు నెమ్మదిగా చేతుల సాయంతో, కాళ్లను ఒకదాని తర్వాత ఒకటి మడిచి కటి భాగానికి దగ్గరగా ఉంచండి. రెండు పాదాలనూ నమస్కార ఆకృతిలో కలిపి ఉంచండి. మోకాళ్లను వెడల్పుగా బయటవైపు ఎలాంటి ఒత్తిడి లేకుండా విస్తరించి ఉంచండి. వెన్నెముకను నిటారుగా ఉంచి, భుజాలు, ముఖం విశ్రాంతిగా ఉంచి, దీర్ఘశ్వాసలు తీస్తూ శరీరాన్ని గమనించండి. 15-20 సెకన్లు ఆసన స్థితిలో ఉండేందుకు ప్రయత్నించండి. తర్వాత నెమ్మదిగా కాళ్లను చాచి (దండాసనం) విశ్రాంతి తీసుకోండి.

**ప్రయోజనాలు:** తొడ, తుంటి భాగాల్లో నొప్పి తగ్గుతుంది.

◆ హార్మోన్ల పనితీరుకు తోడ్పడుతుంది. రుతుక్రమాన్ని క్రమబద్ధం చేస్తుంది. పీసీఓడీ సమస్యకి మంచి మందు.

◆.గర్భిణులకు సుఖప్రసవం అవుతుంది.

**జాగ్రత్తలు:** మోకాళ్ల సర్జరీలు అయినవాళ్ళు చేయరాదు. తొలి త్రైమాసికంలో ఉన్న గర్భిణులు డాక్టర్ సలహాతో చేయాలి.

**ఆహారం:** పీచు పదార్థాలు, ప్రొటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోండి. చక్కెర, మైదా, ఉప్పులను తగ్గించండి, మునగాకు, పాలకూర, చిక్కుళ్లు, మాంసకృత్తులు, అవకాడో, దానిమ్మలను తీసుకోండి.

# చిన్నారి తలపై పాపిట పువ్వు!










చిన్నారుల చిట్టిపొట్టి జుట్టుకు ఒక క్లిప్పు పెట్టో లేదంటే పోనీ కట్టో హెయిర్‌లుక్కును మారుస్తుంటాం. కానీ ఇకనకడున్న ఫొటోల్ని చూశారా.. ఉన్న ఆ కొంచెం జుట్టులోనే ఎన్నెన్నో కొత్త హెయిర్ స్టైళ్లనీ చూపించేశారు. హెయిర్ పిన్నులూ, క్లిప్పులు, పెట్టడంకన్నా ముందు జుట్టుతోనే అందమైన అలంకరణ తీసుకొస్తే అదిరిపోదూ అనుకున్న హెయిర్‌స్టైలిస్టులు ఈ సరికొత్త ప్రయోగాల్ని చేస్తున్నారు. నిటారు పాపిటకు అటూ ఇటూ చిన్న చిన్న పాయలల్లి ఒక హెయిర్‌స్టైల్‌ను చూపిస్తే, రకరకాల జడల అల్లికలతో పూలూ, ఆకులూ ఇంకా ఇతర డిజైన్లనీ తీసుకొస్తున్నారు. నల్లని కురులపైన కొట్చొచ్చే తెల్లని పాపిట దారులూ, సనన్నని జడల పాయల అల్లికలు-చూసేందుకు ముదొచ్చినా.. అసలు తలలో దువ్వెన పెడితేనే పరుగులు తీసే పిల్లలే ఇంత ఓపిగ్గా వైరైటీ జడల్ని ఎలా వేయించుకున్నారబ్బా అని ఆశ్చర్యమూ కలగకమానదు.
















## సులువుగా చేసేయొచ్చు !



కజ్జికాయలు పేరు ఒకటే కానీ.. అందులో స్టఫింగ్‌ను బట్టి.. రకరకాల రుచులను ఆస్వాదిస్తాం. వీటి కోసం ఒక అచ్చు ఉండటం తెలిసిందే. సాంకేతికత పెరిగాక. వేగంగా, తేలిగ్గా చేసే డంప్లింగ్ మేకర్‌లను రూపొందిస్తున్నారు. మనకు అనుకూలంగా అనిపించేది కొనుక్కుంటే సరిపోతుంది. ఇవి ప్లాస్టిక్‌తో తయారైనందున తుప్పు పట్టవు. ఈ పరికరం ఉంటే పని సులువైపోతుంది. ఇందులో చిన్న రొట్టెను, దాని మధ్యలో స్టఫింగ్‌ను ఉంచితే చక్కటి ఆకృతిలో కజ్జికాయ సిద్ధమవు తుంది. అన్నీ అయ్యాక కాగుతున్న నూనెలో వేయించుకోవాలి.

# అక్షతాన్ సమర్పయామి!

ఆధ్యాత్మికం

క్షతం అంటే కొరత కలిగేది. అక్షతం అంటే పరిపూర్ణమైంది. బియ్యానికి కుంకుమ రాస్తే అవి అరుణాక్షతలు, పసుపు రాస్తే హరిద్రాక్షతలు. 'అక్షతాన్ సమర్పయామి' అంటూ దైవాన్ని భక్తితో పూజిస్తాం. పిన్నలను ఆశీర్వదిస్తాం. అక్షతలుదానితో మరొకటి కలవకుండా పొడి పొడిగా ఉండాలి. నీళ్లతో కలిపిన అక్షతలు పూజకి పనికి రావు. పసుపు హరిద్ర అంటే లక్ష్మీదేవి. బియ్యం నారాయణుడు. బియ్యంలో పసుపును కలపడం అంటే నారాయణుడి దగ్గరకు అమ్మవారిని చేర్చడం. అక్షతల్లో ఆవు నెయ్యి కూడా ఉంటుంది. నెయ్యి ప్రీతి పాత్రమైంది. అంటే లక్ష్మీదేవి నారాయణుణ్ణి లేదా నారాయణుడు లక్ష్మీదేవిని ప్రీతితో చేరతారు. కొరత లేకుండా పరిపూర్ణంగా జీవించాలని ఆశీర్వదించడమే అక్షతల ముఖ్యోద్దేశం. వీటిని అన్ని వేళ్లతో తీయకూడదు. కుడిచేతి బొటనవేలు, మధ్యవేలు ఉంగరంవేలు.. ఈ మూడు వేళ్లతోనే తీసి పూజించాలి. మహా భారతం దుష్యంతోపాఖ్యానంలో 'కణ్వమహర్షి ఆశ్రమంలో ప్రవేశిస్తున్న దుష్యంతుడి మీద పూలు అక్షతలుగా కురిశాయి' అన్నాడు నన్నయ. అంటే ఈ సంప్రదాయం ఎప్పటి నుంచో ఉందని అర్థమవుతుంది. నవగ్రహాల్లో ఒక్కో ధాన్యాన్ని ఒక్కో గ్రహానికి దాన వస్తువుగా చెబుతారు. చంద్రుడికి ప్రీతి కలిగించేది బియ్యం చంద్రుడు మనసుకి అధినాయకుడు. మనః కారకో ఇతి చంద్ర అన్నారు. మనసు, బుద్ధి, గుణం, వ్యసనం వీటన్నింటికీ చంద్రుడే కారణం. మన మీద అంతగా ప్రభావం చూపిస్తాడు. చంద్రుడి సంకేతమైన బియ్యానికి అంతే ప్రభావం ఉంది. మంత్రం అంటే క్షయంలేనిది. అకారం నుంచి క్షకారం వరకూ ఉన్న బీజాక్షరాలతో మంత్రానికి ఉన్న ఆ శక్తి చేతిలోని అక్షతలకూ ఉంటుంది. ఆశీర్వదించే పెద్దల సాత్విక గుణం పిన్నలకు లభిస్తుంది. కనుకనే అక్షతలకుఅంత ప్రాధాన్యత ఉంది.

# అన్నంతో సౌందర్యం

**చర్మానికి మేలిమి ఛాయను** అందించడంలో బియ్యం కడుగు బాగా పని చేస్తుందనేది తెలిసిన విషయమే. కానీ అన్నంతోనూ ఇది లభిస్తుందని తెలుసా. ఇంట్లో లభించే కొన్ని పదార్థాలను కలిపి ఫేస్‌ప్యాక్ వేసి బ్యూటీ పార్లర్‌లో పొందే గ్లాస్ స్కిన్‌ని పొందవచ్చు. అదెలానో తెలుసుకుందామా..

**పచ్చిపాలతో..** రెండు టేబుల్ స్పూన్ల అన్నాన్ని తీసుకోవాలి. దానికి తగినన్ని పచ్చిపాలు లేదా పెరుగు కలిపి పేస్టులా చేసుకోవాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా చేసి పావుగంటాగి చల్లని నీటితో శుభ్రం చేస్తే సరి. రైస్‌లో ఉండే అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు ముఖచార్మాన్ని తేమగా చేస్తూ వృద్ధాప్య ఛాయలను దరిచేరనివ్వవు.



**తేనెతో...** రెండు చెంచాల చొప్పున అన్నం, పులియబెట్టిన బియ్యం కడుగు, అరచెంచా చొప్పున తేనె, ఆరెంజ్ తొక్కలపొడి తీసుకుని మిశ్రమం చేసుకోవాలి. దీన్ని ముఖానికి పట్టించాలి. ఆరిన తర్వాత కడిగితే సరి. పులిసిన బియ్యం నీళ్లు జిడ్డుని తగ్గించి మొటిమలు, వాటి వల్ల ఏర్పడే మచ్చలను దూరం చేస్తాయి. వారానికి కనీసం రెండు సార్లు చేస్తే నిగారింపు మీ సొంతం అవుతుంది.

**కీరాతో..** రెండు చెంచాల మెత్తగా చేసిన అన్నానికి, అదే పరిమాణంలో కీరదోస గుజ్జు కలపాలి. దీన్ని ముఖం, మెడ భాగాలకు పట్టించి పావుగంటాగి కడగాలి. కీరా చర్మ రంధ్రాలను బిగుతుగా చేస్తుంది. విటమిన్- ఐసి, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అలర్జీలను తగ్గస్తాయి. అలసిన కళ్లకు ఉపశమనం కలిగించడమే కాకుండా కంటి చుట్టూ నల్లటి వలయాలను తగ్గిస్తుంది. అదనపు నూనెలను నివారించి చర్మాన్నిహైడ్రేట్ చేసి కాంతిమంతంగా కనిపిస్తుంది.

**క్యారెట్, అన్నం..** చెంచా చొప్పున క్యారెట్ ముక్కలు, అన్నం తీసుకుని మెత్తగా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పట్టించి ఆరాక చల్లటి నీటితో శుభ్రం చేయాలి. క్యారెట్‌లో ఉండే బీటా కెరోటిన్,విటమిన్ సి ఫెనోలిక్ ఆమ్లాలు చర్మ ఛాయను మెరుగుపరుస్తాయి. ఎండవల్ల ఏర్పడే డార్క్‌స్పాట్స్‌ను తగ్గిస్తుంది. ఫ్రీరాడికల్‌తో పోరాడి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

# అల్లం పొడి ఇంట్లోనే ..

డ్రైడ్ జింజర్ పౌడర్ అంటే శొంఠి పొడి అనుకుంటారు కొందరు. నిజానికి అల్లాన్ని ఎండబెట్టి పొడి చేస్తారు. వంటలకు అదనపు రుచి తెప్పిస్తుంది. ఇంతకూ ఈ పొడిని ఎలా తయారు చేయాలంటే పావు కిలో అల్లం కడిగి, పొట్టు తీయాలి. ఎంత మాత్రం తడి లేకుండా ఆరబెట్టాలి. తర్వాత చిన్న ముక్కలుగా కోసుకోవాలి. వీటిని పొలంలో పరిచినట్లు అమర్చి మూడు రోజులు ఎండలో ఉంచాలి. ఇంకో ఐదు



రోజులు నీడలో ఆరబెట్టాలి. అలా పూర్తిగా ఎండిన తర్వాత గ్రైండర్‌లో వేసి పొడి చేయాలి. తడి లేని, గాలి చొరబడని సీసాలో ఉంచితే చాన్నాళ్లు నిలవుంటుంది. అవసరానికి వాడుకోవచ్చు. సూప్స్, కర్రీస్, స్నాక్స్‌లో వేసుకుంటే.. వాటి రుచి రెట్టింపవుతుంది, అనేక అనారోగ్యాల నుంచి కాపాడుతుంది. టీలో చిటికెడు పొడి వేశామంటే ప్రత్యేకంగా ఉండటమేకాదు. శ్వాస ఇబ్బందుల నుంచీ ఉపశమనం కలుగుతుంది.

### క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఫైనల్స్‌కు అల్కరాజ్, లెహెకా



**న్యూఢిల్లీ:** క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్-2025లో టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్ దూసుకుపోతూ విజయపరంపర కొనసాగిస్తున్నాడు. టోర్నీమెంట్ సెమీఫైనల్లో అల్కరాజ్ తోటి స్పానియార్డ్ రాబర్టో బటిస్టా అగుట్‌ను ఓడించాడు. ఇదే సమయంలో జిరి లెహెకా హోమ్ ఫేవరెట్ జాక్ డ్రేపర్‌ను ఓడించాడు. 2023లో ఇదే ఈవెంట్‌లో తన తొలి గ్రాస్‌కోర్ట్ టైటిల్‌ను గెలుచుకున్న ప్రపంచ నంబర్ 2 అల్కరాజ్, 37 ఏళ్ల బటిస్టా అగుట్‌ను 6-4, 6-4 తేడాతో ఓడించి తన కెరీర్‌లో 250వ విజయాన్ని నమోదు చేశాడు. 22 ఏళ్ల అల్కరాజ్ తన అజేయ పరంపరను 17 మ్యాచ్‌లకు విస్తరించాడు. అల్కరాజ్, హోమ్ ఫేవరెట్ జాక్ డ్రేపర్ మధ్య తుది పోరుపై బ్రిటిష్ అభిమానులు ఆశించారు, కానీ లెహెకా అతనితో తలపడి ఆ స్క్రిప్ట్‌ను 6-4, 4-6, 7-5 తేడాతో రెండవ సీడ్‌ను ఓడించి చెడగొట్టాడు. 23 ఏళ్ల లెహెకా, 15 సంవత్సరాల తర్వాత టాప్ లెవల్ గ్రాస్‌కోర్ట్ ఫైనల్‌కు చేరుకున్న తొలి చెక్ ఆటగాడు. ఇక ఎడమచేతి వాటం బౌలర్ డ్రేపర్ రెండవ సెట్ ప్రారంభంలోనే బ్రేక్ పాయింట్‌ను సేవ్ చేసి, 10వ గేమ్‌లో తన 23 ఏళ్ల లెహెక్కా సర్వీస్‌ను తొలిసారి బ్రేక్ చేసి మ్యాచ్‌ను సమం చేశాడు. లెహెకాకు 4-4తో బ్రేక్ వచ్చే మొదటి అవకాశం లభించడంతో, డిసైడర్‌లో ఇద్దరు ఆటగాళ్లు సర్వ్‌లో దృఢంగా ఉన్నారు, కానీ డ్రేపర్ తన ప్రత్యర్థిపై ఒత్తిడిని పెంచడానికి బతికిపోయాడు. అయితే, లెహెక్కా ఏమాత్రం వెనుకాడలేదు మరియు రెండు అద్భుతమైన పాసింగ్ షాట్‌లతో 55 వద్ద సర్వ్‌ను బ్రేక్ చేశాడు. దీనితో డ్రేపర్ కోర్టు వైపు ఎలక్ట్రానిక్ ప్రకటన బోర్డుపై కోపంతో తన రాకెట్‌ను ఢీకొట్టి కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డాడు.

# కెనడా సూపర్ విక్టరీ

### వరల్డ్ కప్ రేసులో 13వ జట్టుగా నమోదు



**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది జరగబోయే మెన్స్ టీ20 వరల్డ్ కప్ పోటీలకు మరో జట్టు అర్హత సాధించింది. ఇప్పటికే భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, సౌతాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్ వరల్డ్ కప్ రేసులో నిలిచాయి. తాజాగా ఇప్పుడు సూపర్ విక్టరీతో కెనడా జట్టు వర్డ్ కప్ పోటీలకు తన బెర్త్ ను కన్ ఫర్మ్ చేసుకుంది. 2026 టీ20 ప్రపంచ కప్‌లో చోటు దక్కించుకున్న 13వ జట్టుగా నిలిచింది. అమెరికాస్ రీజనల్ క్వాలిఫయింగ్ ఫైనల్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన కెనడా టి20 టోర్నమెంట్ లో స్థానం సంపాదించుకుంది. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ ఫైనల్స్‌లో బహామాస్ పై కెనడా సూపర్ విక్టరీ కొట్టింది. తొలుత బహామాస్‌ను 57 పరుగులకే పరిమితం చేసిన కెనడా, స్వల్ప లక్ష్యాన్ని 5.3 ఓవర్లలోనే ఛేజ్ చేసింది. ఈ లీగ్‌లో వరుసగా 5 విజయాలతో కెనడా దుమ్మురేపి పాయింట్స్ టేబుల్ లో అగ్రస్థానంలో నిలిచింది. పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 పోటీలకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. ఈ మెగా టోర్నీకి ఇప్పటికే 12 జట్లు అర్హత సాధించాయి. భారత్, శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఐర్లాండ్, న్యూజిలాండ్, పాకిస్తాన్, సౌతాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్.. వరల్డ్ కప్ రేసులో నిలిచాయి. మరోవైపు భారత్, శ్రీలంక ఆతిథ్య దేశాలుగా ఉండటం వల్ల అవి కూడా అర్హత సాధించాయి. మరో 7 జట్లకు బెర్తులు ఖరారు కావాల్సి ఉంది. వీటిలో యూరోపియన్ క్వాలిఫయర్ ద్వారా 2, ఆఫ్రికా క్వాలిఫయర్‌లో ఫైనల్ చేరిన రెండు జట్లతో పాటు ఆసియా ఈఏపీ క్వాలిఫయర్‌లోని టాప్3 జట్లు వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధిస్తాయి. 20 జట్లతో జరిగే మొట్టమొదటి ?20 ప్రపంచ కప్ ఇదే కానుంది.





# హాకీ టోర్నీలో భారత్ ఓటమి

### పురుషుల, మహిళల జట్లపై బెల్జియం డబుల్ విక్టరీ

**న్యూఢిల్లీ:** భారతనపురుషుల, మహిళల హాకీ జట్లు బెల్జియం చేతిలో ఓటమి పాలయ్యాయి. భారత్ పురుషుల జట్టుపై 3-6 తేడాతో వరుసగా 7వ మ్యాచ్‌లోనూ ఓటమిపాలయింది. అలాగే మహిళల విభాగంలో భారత్ జట్టుపై 1-5 తేడాతో బెల్జియం హ్యాట్రిక్ విజయం సాధించింది. ఆంట్వెర్ప్‌లో జరిగిన పురుషుల మ్యాచ్‌లో భారత్ హాకీ జట్టు దారుణమైన ప్రదర్శనను కొనసాగించింది. ఆట మొదలైన 20 సెకన్లలోనే బెల్జియం రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకోవడంతో భారతదేశం మొదటి నిమిషంలోనే గోల్ చేసింది. దిల్‌ప్రీత్ సింగ్ (36వ నిముషం) మరియు మన్దీప్ సింగ్ (38వ నిముషం) గోల్స్ చేయడం ద్వారా భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. ఇదే సమయంలోఅమిత్ రోహిదాస్ (56వ నిముషం) చేసిన మూడవ గోల్ భారత్‌ను పోటీలో నిలిపింది. అయితే బెల్జియం వేగంగా ప్రారంభించడంతో భారత్ జట్టు వెనుకబడిపోయింది, భారత్ గోల్‌ను నిలుపుకోవడంలో ఇబ్బంది పడింది. ఆట గమనానికి వ్యతిరేకంగా, అలెగ్జాండర్ హెండ్రిక్స్ హాఫ్ టైమ్‌కు ముందు పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడంతో బెల్జియం తన ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. బెల్జియం ప్లేయర్లు ఆర్థర్ వాన్ డోరెన్ (1వ నిముషం, 54వ నిముషం) చేసిన రెండు గోల్స్ మరియు అలెగ్జాండర్ హెండ్రిక్స్ (28వ నిముషం), రోమన్ దువెకోట్ (49వ నిముషం), థిబ్యూ స్టాక్‌బ్రోక్స్ (53వ నిముషం) మరియు టామ్ బూన్ (59వ నిముషం) చేసిన గోల్స్ బెల్జియం విజయాన్ని సాధించాయి. ఇక ఆంట్వెర్ప్‌లోని స్పోర్ట్‌సెంట్రమ్ విల్రిజ్క్సె ప్లీన్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 1-5 తేడాతో ఆతిథ్య బెల్జియం చేతిలో ఓడిపోయింది. సలీమా టెటె అమ్మాయిలు మంచి ఆరంభంతో ఆరంభించారు కానీ ఆటుపోట్లను తమకు అనుకూలంగా మార్చుకోవడంలో విఫలమయ్యారు. భారతదేశం తరపున దీపిక (6వ నిముషం) ఏకైక గోల్‌గా నిలిచింది, హెలెన్ బ్రాస్సియర్ (37వ నిముషం, 55వ నిముషం), లూసీ బ్రెయిన్ (41వ నిముషం), అంబ్రే బాలెంఘియన్ (54వ నిముషం), షార్లెట్ ఎంగిల్‌బర్ట్ (58వ నిముషం) బెల్జియం తరపున గోల్స్ చేశారు. ఆతిథ్య జట్టు మరింత బలంగా పుంజుకుంది, 17 పెనాల్టీ కార్నర్లు మరియు ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను సాధించింది. ఈ ఓటమితో, రాబోయే మ్యాచ్‌లలో పరిస్థితులు అనుకూలించకపోతే భారతదేశం నిష్క్రమణకు గురయ్యే అవకాశం ఉంది.

# మనీషాకు తొలి ఆసియా టైటిల్

### నితీష్‌కు డబుల్ టైటిల్స్

**న్యూఢిల్లీ:** భారత్ యువ పారా షట్లర్లు మనీషా రామదాస్ తొలి ఆసియా టైటిల్‌ను, పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ నితేష్ కుమార్ రెండు టైటిళ్లను కైవసం చేసుకున్నారు. రెండుసార్లు పారాలింపిక్ ఛాంపియన్‌గా నిలిచిన చైనాకు చెందిన యాంగ్ క్వియుక్సియాను ఫైనల్లో మనీషా ఓడించి సంచలన విజయం సంపాదించింది. థాయ్‌లాండ్‌లో ఆదివారం జరిగిన ఫైనల్‌లో మనీషా యాంగ్ క్వియాక్సియాను ఓడించి బంగారు పతకంతో పాటు, తన తొలి ఆసియా ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకుంది. 57 నిమిషాల పాటు జరిగిన మూడు గేమ్‌ల (21-18, 17-21, 21-15) హోరాహోరీ పోరులో యాంగ్‌తో జరిగిన ఏడవ మ్యాచ్‌లో మనీషా తొలిసారి విజయం సాధించింది. మహిళల సింగిల్స్ ఎస్‌యు5 విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. మనీషాకు తొలి ఆసియా టైటిల్ కోసం సానుకూలంగా ఆట ప్రారంభించింది. ప్రారంభ గేమ్‌లో తన మంచి ఆధిక్యాన్ని కొనసాగించడానికి వ్యూయాత్మకంగా వ్యవహరించింది. అద్భుతమైన క్రాస్‌కోర్ట్ డ్రాప్ షాట్‌లను ప్రదర్శించి మ్యాచ్‌లో మొదటి ఆధిక్యాన్ని 21-18తో సాధించింది. అయితే, యాంగ్ తన ప్రశాంతతను ప్రదర్శించి, రెండవ గేమ్‌లో తిరిగి పుంజుకుని టైబ్రేకర్‌ను వత్తిడి తెచ్చింది. ఇక్కడ కూడా 20 ఏళ్ల భారత క్రీడాకారిణి టైబ్రేక్‌లో 13-2 ఆధిక్యాన్ని సాధించింది. అయితే ఆమె చాలా అనవసర తప్పిదాలు చేసింది. మరియు అకస్మాత్తుగా ఆమె ఆధిక్యం కేవలం 1 పాయింట్‌కు, 15-14కి పడిపోయింది. ఈ ఆకస్మిక మార్పుతో ఒత్తిడికి గురైనాకానీ ఆమె తన ఆశను కోల్పోకుండా పట్టుదలతో కొనసాగించింది. దీంతో తిరిగి పోరాడి ఏడు ఫైనల్ పాయింట్లలో ఆరు గెలుచుకుని మ్యాచ్ మరియు ఆసియా టైటిల్‌ను కైవసం చేసుకుంది. కాగా పారిస్ పారాలింపిక్ ఛాంపియన్ నితేష్ కుమార్, థాయిలాండ్‌లో రెండు ఆసియా టైటిళ్లను గెలుచుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 ఫైనల్, తులసిమతి మురుగేషన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్




ఎస్ఎల్3-ఎస్‌యు5 విభాగాల్లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 విభాగంలో నితేష్ ఇండోనేషియాకు చెందిన యువ ఆటగాడు ముహ్ ఇమ్రాన్‌పై వరుస గేమ్‌లలో విజయం సాధించాడు. అదే సమయంలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో, నితేష్ తులసిమతి ఫైనల్‌లో రుథిక్‌మానసిపై విజయం సాధించారు. పురుషుల డబుల్స్ ఎస్ఎల్3-ఎస్ఎల్4 ఫైనల్‌లో సుకాంత్ కదమ్‌తో కలిసి నవీన్-జగదీష్‌తో తలపడనున్నందున నితేష్ ఇంకా క్లీన్ స్వీప్ పూర్తి చేసే అవకాశం ఉంది.



# ఛాంపియన్‌గా భారత్

### ఆసియా రెజ్లింగ్‌లో 6 బంగారు, 1 రజతంతో ట్రోఫీ కైవసం

**న్యూఢిల్లీ:** అండర్23 ఆసియా రెజ్లింగ్ పోటీల్లో భారత్ ఛాంపియన్‌గా నిలిచింది. రెజ్లింగ్ ట్రోఫీని దక్కించుకుని చరిత్ర సృష్టించింది. భారత ఫ్రీస్టైల్ జట్టు మ్యాట్‌పై ఆధిపత్యం చెలాయించడం ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. వుంగ్ టౌ (వియత్నాం)లో ఆదివారం జరిగిన అండర్23 సీనియర్ ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారతదేశం తన ఫ్రీస్టైల్ జట్టు ఆరు బంగారు పతకాలు మరియు 1 రజతాన్ని గెలుచుకుని మొత్తం ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అద్భుతమైన ప్రదర్శనతో ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకున్న భారత మహిళల రెజ్లింగ్ జట్టు ప్రారంభం నుండి ఆధిక్యానిన కొనసాగిస్తూ వచ్చింది. ఇక భారత పురుషుల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ జట్టు ఇప్పుడు స్టాండింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచి చరిత్ర సృష్టించింది. ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్, ఫ్రీస్టైల్ విభాగంలో భారత్ యొక్క అత్యుత్తమ ప్రదర్శన ఇది. 61 కిలోల విభాగంలో నిఖిల్, 65 కిలోల విభాగంలో సుజీత్, 74 కిలోల విభాగంలో జైదీప్, 97 కిలోల విభాగంలో చందర్ మోహన్ (79 కిలోలు), సచిన్ (92 కిలోలు) మరియు విక్కీ బంగారు పతకాలు గెలుచుకున్నారు. అలాగే 125 కిలోల విభాగంలో జస్పూర్ సింగ్ రజత పతకాన్ని గెలుచుకున్నాడు. మొత్తంగా భారత్ అండర్23 మహిళా రెజ్లర్లు తమ అత్యుత్తమ ప్రదర్శనతో దేశాన్ని గర్వపడేలా చేశారు, అంకు ముందు 10 వెయిట్ కేటగిరీలలో 4స్వర్ణాలు, ఐదు రజతాలు మరియు ఒక కాంస్య పతకాలను సాధించింది. 50 కిలోల విభాగంలో ప్రియాంషి ప్రజాపత్, 55 కిలోల విభాగంలో రీనా, 68 కిలోల విభాగంలో శ్రుష్టి మరియు 76 కిలోల బరువు విభాగంలో ప్రియా భారతదేశం తరపున బంగారు పతకాలను గెలుచుకున్నారు. 57 కిలోల విభాగంలో నేహా శర్మ, 62 కిలోల విభాగంలో ప్రగతి, 65 కిలోల విభాగంలో శిక్ష, 59 కిలోల విభాగంలో తన్వి, 72 కిలోల విభాగంలో జ్యోతి బెర్వాల్ రజత పతకాలు గెలుచుకున్నారు.

# ఎన్ఆర్ఐ పెట్టుబడులకు 'ఫండ్స్' బెస్ట్


**ముంబై, జూన్ 22:** ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) భారతదేశంలో మ్యూచువల్ ఫండ్లలో డబ్బును పెట్టుబడి పెట్టవచ్చా అనే అనుమానం చాలా మందికి ఉంటుంది. అయితే దేశంలోని మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడానికి ఎన్ఆర్ఐలకు అనుమతి ఉందని నిపుణులు చెబుతున్నారు. కానీ వారు విదేశీ మారక నిర్వహణ చట్టం కింద నిర్దేశించిన నియమాలను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నారు. ఈ నియమాలు అన్ని విదేశీ పెట్టుబడులు సురక్షితంగా, చట్టబద్ధంగా ఉండేలా చూసుకోవడానికి సహాయపడతాయి. భారత దేశంలో డబ్బును పెట్టుబడి పెట్టడం ద్వారా ఎన్ఆర్ఐలు తమ వ్యక్తిగత పొదుపులను పెంచుకోవడమే కాకుండా దేశ ఆర్థిక పురోగతికి కూడా మద్దతు ఇస్తారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించడానికి ఎన్ఆర్ఐలకు అనేక మార్గాలు ఉన్నాయి. ఒక సాధారణ పద్ధతి నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ ఖాతా ద్వారా ఇది ఎన్ఆర్ఐలు తమ విదేశీ ఆదాయాన్ని భారతదేశంలో డిపాజిట్ చేయడానికి అనుమతిస్తుంది. ఈ ఖాతాపై వచ్చే వడ్డీ పన్ను రహితం. మరొక ఎంపిక




నాన్‌రెసిడెంట్ ఆర్డినరీ (ఎన్ఆర్ఓ) ఖాతా, ఇది అద్దె, డివిడెండ్‌లు లేదా ఆస్తి అమ్మకపు ఆదాయం వంటి భారతదేశంలో సంపాదించే ఆదాయాన్ని నిర్వహించడంలో సహాయపడుతుంది. వారు తమ ఎన్ఆర్ఈ లేదా ఎన్ఆర్ఓ ఖాతాలను సాధారణ బ్యాంకింగ్ మార్గాల ద్వారా ఉపయోగించి నేరుగా పెట్టుబడి పెట్టడానికి కూడా ఎంచుకోవచ్చు. ఈ పద్ధతి పెట్టుబడి నిర్ణయాలపై పూర్తి నియంత్రణను ఇస్తుంది. ముఖ్యంగా తమ లక్ష్యాలకు సరిపోయే నిధులను ఎంచుకోవడానికి వీలు కల్పిస్తుంది. తమ పెట్టుబడులను వ్యక్తిగతంగా నిర్వహించలేని వారికి, పవర్ ఆఫ్ అటార్నీ (పీఓఏ)ని నియమించడం సహాయకరంగా ఉంటుంది. అప్పుడు విశ్వసనీయ వ్యక్తి అన్ని పెట్టుబడి నిర్ణయాలను నిర్వహించ గలడు.

# టర్మ్ ఇన్సూరెన్స్‌కే మహిళల ప్రాధాన్యం..సర్వేలో వెల్లడి


**న్యూఢిల్లీ, జూన్ 22:** మహిళల ఆర్థిక ప్రాధాన్యతలలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నట్లు సర్వే స్పష్టం చేసింది. పిల్లల భవిష్యత్తు, వారి విద్యా వ్యయాలు, ఆరోగ్యం ముఖ్యమైన అంశాలుగా మారాయి. పిల్లల భవిష్యత్తు రక్షణకు ఆర్థిక సాధనాలలో టర్మ్ ఇన్సూరెన్స్‌కు మహిళలు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆరోగ్య సంబంధిత రిస్కులపై వారిలో అవగాహన పెరిగినట్లు ఇది సూచిస్తుంది. వైద్యపరమైన అనూహ్య ఖర్చుల వల్ల తమ కుటుంబ పొదుపు తీవ్రంగా దెబ్బతింటుందని 53 శాతం మంది మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీకి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని 87శాతం మంది పేర్కొన్నారు. తమ టర్మ్ ప్లాన్‌లో అంతర్గతంగా హెల్త్ మేనేజ్‌మెంట్ సేవలు తప్పనిసరిగా ఉండాలని 50 శాతం మంది తెలిపారు. పిల్లల చదువు ప్రయోజనాలు టర్మ్ ప్లాన్‌లో భాగంగా ఉండాలని మహిళలు ఆకాంక్షిస్తున్నారు. ఆర్థికంగా స్వతంత్రంగాఉన్న మహిళలు, బీమాను కేవలం జీవిత రక్షణకు మాత్రమే పరిమితం చేయకుండా, దీర్ఘకాలిక



ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి ఉపయోగపడే సాధనంగా పరిగణిస్తున్న విషయాన్ని ఈ సర్వే ధృవీకరిస్తుంది. ఏదైనా అనుకోనిది జరిగితే పిల్లలకు ఆర్థిక స్థిరత్వం ఎలా కల్పించాలనేది 61 శాతం మంది మహిళల ప్రాథమిక ఆందోళన. ఆదాయ స్థిర త్వం (61), ఆరోగ్య వ్యయాలు (53), రిటైర్మెంట్ ప్లానింగ్ (54), పిల్లల చదువు (57) ప్రధాన ఆర్థిక ప్రాధాన్యతలుగా ఉన్నాయి. తమ పిల్లల ఆర్థిక భవిష్యత్తును కాపాడటానికి 46శాతం మంది మహిళలు టర్మ్ ఇన్సూరెన్స్‌లో పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ లక్ష్యసాధనకు ఇది ఆర్థికంగా అత్యంత ముఖ్యమైన ఎంపికగా నిలుస్తుంది. టర్మ్ ప్లాన్‌లో అంతర్గతంగా హెచ్ఎంఎస్, హెల్త్‌సీఐ కవర్ తప్పనిసరిగా ఉండాలని 57 శాతం మంది మహిళలు కోరుకుంటున్నారు. టర్మ్ ప్లాన్‌లో చైల్డ్ ఇన్‌కం సెక్యూరిటీ ఫీచర్ అత్యంత ఆకర్షణీయమైన నదిగా 93శాతం మంది మహిళలు భావిస్తున్నారు. జీవితంలో ముందుకెళ్లే కొద్దీ పరిస్థితులకు అనుగుణంగా కవరేజీ పెంచుకునే వెసులుబాటు, మెచ్యూ రిటీ బెనిఫిట్స్ కావాలని 51శాతం మంది ఆశిస్తు న్నారు. టర్మ్ ప్లాన్లలో పిల్లల చదువుపరంగా ఆర్థిక ప్రయోజనాలు తప్పనిసరిగా ఉండాలని 33 శాతం మంది, అత్యధిక లైఫ్ కవరేజీ ఉన్న టర్మ్ ప్లాన్‌లు కావాలని 28 శాతం మంది మహిళలు ఆకాంక్షిస్తున్నారు.


# రోజుకు 10 గంటల వర్క్ రూల్..జెన్‌ప్యాక్ట్ కొత్త పాలసీ

**ముంబై, జూన్ 22:** ప్రముఖ టెక్ మరియు సర్వీసెస్ సంస్థ జెన్‌ప్యాక్ట్ తీసుకున్న ఓ నూతన నిర్ణయం ఉద్యోగుల్లో, ముఖ్యంగా హైదరాబాద్ కార్యాలయంలో తీవ్ర ఆందోళన రేపుతోంది. సంస్థ తమ ఉద్యోగులకు రోజుకు 10 గంటల పని విధానాన్ని తప్పనిసరి చేస్తూ కొత్త పాలసీని ప్రవేశపెట్టిందని, ఇది జూన్ మధ్య నుంచి అమల్లోకి రానున్నట్లు సమాచారం. ఈ కొత్త విధానం ప్రకారం, ఉద్యోగులు రోజుకు తప్పనిసరిగా 10 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పెరిగిన పనిగంటలకు అనుగుణంగా మూల వేతనంలో (బేస్ శాలరీ) ఎటువంటి పెంపుదల లేకపోవడం గమనార్హం. నిర్దేశించిన 10 గంటల పనిని పూర్తిచేసిన వారికి నెలకు 500 పాయింట్ల వరకు ప్రోత్సాహకాలు అందుతాయని, వీటివిలువ సుమారు రూ.3,000 ఉంటుందని తెలుస్తోంది. అంతేకాకుండా, 10గంటలు దాటి అదనంగా పనిచేసిన సమయానికిదాదాపు రూ.150కి సమానమైన 5బోనస్ చెల్లిస్తారని సమాచారం. ఉద్యోగుల ఉత్పాదకతను, వారు చురుకుగా పనిచేసిన గంటలను (యాక్టివ్ అవర్స్) పర్యవేక్షించేందుకు ఓ అంతర్గత సాధనాన్ని (ఇంటర్నల్ టూల్) ఉపయోగించనున్నట్లు కూడా ఆ కథనం పేర్కొంది. ఈ నిబంధనలను పాటించని ఉద్యోగులు పనితీరు సమీక్షలను (పెర్ఫార్మెన్స్ రివ్యూ) ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా చెబుతున్నారు. జెన్‌ప్యాక్ట్ తీసుకున్న ఈ నిర్ణయం, ముఖ్యంగా హైదరాబాద్ కార్యాలయంలోని ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. కార్యాలయంలో వాతావరణం ఉద్రిక్తంగా మారిందని, ఉద్యోగుల నైతిక స్థైర్యం దెబ్బతిన్నదని తెలుస్తోంది. ఈ నూతన విధానాన్ని అధికారిక హెచ్ఆర్ విభాగం ద్వారా కాకుండా, మేనేజర్లు మరియు టీమ్ లీడర్ల ద్వారా అనధికారికంగా తెలియజేయడం కూడా ఉద్యోగుల ఆందోళనలను మరింత పెంచింది. ఈ విధానంపై స్పష్టత కొరవడిందని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. అంతా మౌఖికంగానే చెబుతున్నారు. ఎవరైనా దీన్ని ప్రశ్నిస్తే, వారిని ఇబ్బంది పెట్టేవారిగా ముద్రవేసి, ఉద్యోగం నుంచి తొలగించేప్రమాదం ఉంది అని ఓ సీనియర్ రిక్రూట్‌మెంట్ స్టాఫ్ సభ్యుడు అన్నట్లు సమాచారం. జెన్‌ప్యాక్ట్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గాపనిచేస్తున్న అభిషేక్ శర్మ అనే ఉద్యోగితన ఆందోళనను లింక్డ్‌ఇన్ ద్వారా పంచుకున్నారు.




# యూరప్ మార్కెట్లోకి భారతీయ 'ఇ' బైక్‌లు

**ముంబై, జూన్ 22:** భారతీయ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ అల్ట్రావైలెట్, పారిస్‌లోని ఐఫిల్ టవర్ వద్ద తన యూరోపియన్ విడుదలతో సంచలనం సృష్టించింది. జర్మనీలో విజయవంతంగా అడుగుపెట్టిన తర్వాత, కంపెనీ తమ అత్యాధునిక మోటార్‌సైకిళ్లు - ఎఫ్77 ఎంఎసిహెచ్ 2 ఎఫ్77 సూపర్ స్ట్రీట్లను ఫ్రాన్స్ రాజధానిలో విడుదల చేసింది. ఈ ప్రయోగం ఎలక్ట్రిక్ వాహన (ఇవి) విభాగంలో ప్రపంచ స్థాయి శక్తిగా తమను తాము నిలబెట్టుకోవాలనే అల్ట్రావైలెట్ ఆశయాన్ని బలోపేతం చేస్తుంది. దీనికి బలమైన పెట్టుబడిదారుల మద్దతు, భారతదేశంలో లోతైన పరిశోధన, అభివృద్ధి నైపుణ్యం తోడయ్యాయి. అల్ట్రావైలెట్ సిఇఒ నారాయణ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, ఇతర యూరోపియన్ దేశాలలో ఎఫ్77 విడుదల అల్ట్రావైలెట్‌కు ఒక కీలక మలుపు. ఇది భారతదేశ ఆటో మొబైల్ రంగానికి కూడా ఒక మైలురాయి. ఈ ప్రవేశం ద్వారా యూరప్‌లోని అత్యంత ప్రభావవంతమైన టూవీలర్ మార్కెట్‌లలోకి అడుగుపెట్టాం. ఎలక్ట్రిక్ మొబిలిటీ విప్లవంలో ప్రపంచ శక్తిగా ఉండాలనే మా ఉద్దేశాన్ని ఇది నొక్కి చెబుతుంది" అని వివరించారు. ఒక భారతీయ కంపెనీగా, భవిష్యత్ డిజైన్, అత్యాధునిక సాంకేతికతను ప్రపంచానికి అందించటం గర్వకారణమని ఆయన అన్నారు. ఇది భారతదేశ ఇంజినీరింగ్, తయారీ సామర్థ్యాలకు ప్రపంచ గుర్తింపు లభించిన సందర్భమని సుబ్రమణ్యం చెప్పారు. ఎఫ్77 మోటార్‌సైకిళ్లు ఎలక్ట్రిక్ పనితీరును కొత్తగా నిర్వచిస్తాయి. కేవలం 2.8 సెకన్లలో 0 నుంచి 60 కెపిహెచ్ వేగాన్ని అందుకుంటాయి. ఇందులో 10.3 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్ ఉంది. 30 కెడబ్ల్యూ గరిష్ట పవర్ అవుట్‌పుట్ అందిస్తుంది. 100 ఎన్ఎం టార్క్యు ఉత్పత్తి చేస్తుంది. ఇది వేగవంతమైన త్వరణం, చురుకైన హ్యాండ్లింగ్, 155 కెఎం/హెచ్ గరిష్ట వేగంను అందిస్తుంది. అత్యాధునిక సాంకేతిక భద్రతతో అల్ట్రావైలెట్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిళ్లు అత్యాధునిక సాంకేతికతతో రూపొందాయి. కంపెనీ యాజమాన్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిస్టమ్ వయోలెట్ ఏఐ ఇందులో ఉంది. బోష్ అభివృద్ధి చేసిన పరిశ్రమప్రముఖ స్విచబుల్ డ్యూయల్‌ఛానల్ ఎబిఎస్ (యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్) వంటి ఫీచర్లు ఉన్నాయి. 10 స్థాయిల రీజెనరేటివ్ బ్రేకింగ్, 4 స్థాయిల ట్రాక్షన్ కంట్రోల్, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ వంటి అధునాతన లక్షణాలు భద్రత, పనితీరును మెరుగుపరుస్తాయి. తెలివైన, సురక్షితమైన ఉత్సాహభరితమైన రైడింగ్ అనుభవాన్ని అందిస్తాయి. అల్ట్రావైలెట్ సిటిఒ సహవ్యవస్థాపకుడు నీరజ్ రాజ్‌మోహన్ మాట్లాడుతూ, ఇది కొత్త మార్కెట్‌లలో మోటార్ సైకిళ్లను ప్రవేశపెట్టడం మాత్రమే కాదు, భారత దేశంలో పుట్టిన సంవత్సరాల నిరంతర పరిశోధన, ఇంజినీరింగ్, ఆవిష్కరణల ప్రపంచ ఆవిష్కరణ. ప్రపంచంలో అత్యంత అధునాతన ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌ను నిర్మించాలనే ఆశయంతో బయలుదేరాం. ఈ రోజు, ఆ విజన్‌ను అంతర్జాతీయ కస్టమర్‌లకు అందిస్తున్నాం అని చెప్పారు. ఈ మైలురాయి ప్రపంచ 'ఇవి' మార్పులో మన సామర్థ్యాన్ని, అత్యున్నత స్థాయిలో పోటీపడే సాంకేతికతతో దీనికి నాయకత్వం వహించే మన సామర్థ్యాన్ని సూచిస్తుంది అని ఆయన అన్నారు.



# వాణిజ్యం

## క్రెడిట్ స్కోర్ పెంచుకోవడం చాలా ఈజీ!

**ముంబై, జూన్ 22:** ఒక వ్యక్తి డబ్బు నిర్వహణ, క్రెడిట్ నిర్వహణ, ఖర్చు తనిఖీ వంటి అంశాలపై ఆధారపడి క్రెడిట్ స్కోర్ ఉంటుంది. అయితే క్రెడిట్ స్కోర్‌పై ప్రజలకు అవగాహన పెరుగుతున్నా కొన్ని తప్పుల వల్ల స్కోర్ గణనీయంగా పడిపోతుందని నిపుణులు చెబుతున్నారు. క్రెడిట్‌స్కోరు అనేది కేవలం ఒక సంఖ్య కాదని, రుణగ్రహీత క్రెడిట్ ప్రవర్తన, తిరిగి చెల్లించే అలవాట్లతో పాటు మొత్తం ఆర్థిక విశ్వసనీయతను సూచిస్తుంది. క్రెడిట్ స్కోర్‌లు ఆర్థిక విశ్వసనీయతకు ఒక స్నాప్‌షాట్‌ను అందిస్తున్నప్పటికీ అవి మీరు ఆర్థికంగా అప్రమత్తంగా ఉండటానికి, మీ స్టేటస్ గురించి తెలుసుకోవడంలో సహాయపడే సాధనంగా కూడా పనిచేస్తాయి.క్రెడిట్ విలువను ప్రభావితం చేసే అంశాలను అర్థం చేసుకోవడం ప్రారంభం మాత్రమే, ఆ జ్ఞానం రోజువారీ ఆర్థిక నిర్ణయాలలో ఎలా వర్తింపజేయాలనే విషయం చాలామందికి తెలియదు.




కొత్త క్రెడిట్ కార్డ్ ఆఫర్‌ను అంచనా వేయడం, రుణం కోసం ప్రణాళిక వేయడం లేదా నెలవారీ ఖర్చులను నిర్వహించడం వంటి వాటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. బలమైన క్రెడిట్ ప్రొఫైల్, ఆరోగ్యకరమైన క్రెడిట్ స్కోర్ స్థిరమైన క్రెడిట్ క్రమశిక్షణ ద్వారా నిర్మితమవుతాయి. సకాలంలో, పూర్తిగా బకాయిలను చెల్లించడం అనేది ఆరోగ్యకరమైన క్రెడిట్ స్కోర్‌ను నిర్మించాలని సూచిస్తున్నారు. అలాగే సకాలంలో చెల్లింపులు రుణదాతలకు విశ్వసనీయతను సూచిస్తాయి. భవిష్యత్తులో మెరుగైన క్రెడిట్ సౌకర్యాలకు మార్గం సుగమం చేస్తాయి. క్రెడిట్‌స్కోర్ ఎడ్యుకేషన్ కూడా చురుకైన క్రెడిట్ నిర్వహణనుప్రోత్సహిస్తుంది. క్రెడిట్ నివేదికలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా వ్యత్యాసాలను గుర్తించవచ్చు. అలాగే వారి పురోగతిని ట్రాక్ చేయవచ్చు. దేశవ్యాప్తంగా క్రెడిట్ యాక్సెస్ విస్తరిస్తున్నందున ఆర్థిక అవగాహనను బలోపేతంచేయడానికి సంబంధించిన ప్రాముఖ్యత కూడా పెరుగుతుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.